

నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



సగం ధారాలీ భూస్థాపితం

ట్రంప్ టారిఫ్ బెదిరింపులపై మోదీ మౌనం

ప్రతిపక్షాల డిమాండ్‌ను తిరస్కరించిన కేంద్రం

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 247 | గురువారం | 7-08-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## 50% భారతదేశంపై సుంకాలు

- ఇప్పటికే 25% టారిఫ్ విధించిన అమెరికా రష్యా చమురు కొంటున్నందుకు తాజాగా 25% పెనాల్టీ
- కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన ట్రంప్



**వాషింగ్టన్ :** రెండు రోజులుగా భారత్‌ను బెదిరింపులకు గురిచేస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చెప్పినవిధంగానే మరో 25 శాతం సుంకాల భారం మోపారు. ఈ మేరకు బుధవారం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేశారు. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకుగాను ఈ అదనపు సుంకాల పెంపును పెనాల్టీగా ఉత్తర్వు పేర్కొంది. దీంతో మనదేశం నుండి అమెరికాకు ఎగుమతిచేసే సరుకులపై ట్రంప్ ప్రభుత్వం విధించే మొత్తం సుంకాలభారం 50 శాతానికి పెరిగింది.
ఈ ఉత్తర్వులు వెలువడిన 21 రోజులకు పెంచిన అదనపు సుంకాలు అమలులోకి వస్తాయని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పేర్కొంది. అంటే దాదాపు ఆగస్టు 27వ తేదీన ఈ సుంకాలు అమలులోకి వస్తాయి. ఇంతకుముందు పెంచిన 25 శాతం సుంకాలు ఆగస్టు 7వ తేదీ నుండి అమలులోకి వచ్చాయి. ఈ అదనపు సుంకాల వల్ల దేశంలోని టెక్స్‌టైల్స్, తోలుపరిశ్రమ, సముద్ర ఉత్పత్తులకు సంబంధించిన ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుంది. అదేవిధంగా రష్యా నుండి ఇంకా ఏ ఏ దేశాలు చమురు కొనుగోలు చేస్తున్నాయో నిర్ణయించి తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుగా దేశాధ్యక్షుడికి యంత్రాంగం సిఫార్సు చేస్తుందని వైట్‌హౌస్ ప్రకటన పేర్కొంది. ఉక్రేన్‌లో రష్యన్ ఫెడరేషన్ చర్యలు అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి నిరంతరం ముప్పు కలిగిస్తున్నాయని, రష్యా నుండి భారత్ చమురు కొనుగోలు చేయడంవల్ల రష్యా చేస్తున్న హానికరమైన కార్యకలాపాలను ఎదుర్కోవడంలో అమెరికా చర్యలను బలహీనపరుస్తున్నాయని పేర్కొంది.
ఈ సుంకాల పెంపుపై భారతదేశం వెంటనే స్పందిస్తూ, ఈ పెంపుదల అన్యాయం,శాస్త్ర విరుద్ధం, నిర్హేతుకమని ఉద్ఘాటించింది. ఇలా అదనపు భారాలు విధించాలన్న అమెరికా నిర్ణయం దురదృష్టకరమని, ఇతర దేశాలు కూడా తమ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని గుర్తుచేసింది. నిర్దేశిత గడువులోపు ఒప్పందం చేసుకోవడంలో భారత్ విఫలమైందన్న ఆరోపణపై జులై 29వ తేదీన 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ రష్యాతో చమురు వ్యాపారం చేస్తున్నదనే అక్కసుతో ఎనిమిది రోజుల వ్యవధిలో మరో 25 శాతం సుంకాలు విధించారు. కొత్త ఒప్పందాల ప్రకారం చూస్తే ఇప్పటివరకూ ప్రపంచంలో బ్రెజిల్–భారత్ దేశాలపై మాత్రమే ట్రంప్ భారీగా సుంకాలు విధించారు. కానీ చైనాపై 30 శాతం సుంకాలు, టర్కీపై 15 శాతం సుంకాలు, పాకిస్థాన్‌పై 19 శాతం సుంకాలు మాత్రమే ట్రంప్ విధించారు.
వాణిజ్య సంబంధాలను, బ్రెజిల్,భారత్ దేశాలలో అంతర్గత పాలనా తరువాయి 2లో

## బిసి బిల్లుకు ఆమోదం తెలుపకుంటే
# మోదీని గద్దెదించుతాం

- 42 శాతం రిజర్వేషన్లు సాధించేదాకా నిద్రపోం
- బిల్లుపై రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం తాత్సారం
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు తెలంగాణ బిసిలు అవసరం లేదా?
- ధర్నాకు బిఆర్‌ఎస్ ఎందుకు రాలే?
- జంతర్‌మంతర్ వద్ద పోరుబాట ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్



బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని, ఈ బిల్లులు ఆమోదం పొందే వరకు తాము నిద్రపోమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించకుండా రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బిసి రిజర్వేషన్ల పెంపును ఆమోదించకుంటే ప్రధాని మోదీని గద్దె దించుతామని సిఎం హెచ్చరించారు. కెసిఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ లకు తెలంగాణ బిసిలు అవసరం లేదా, బిఆర్‌ఎస్ నాయకులు బిసి రిజర్వేషన్ల పెంపు ధర్నాకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లులు తక్షణమే ఆమోదం పొందేలా చూడాలని, లేకుంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు బిజెపికి, మోదీకి గుణపాఠం చెబుతారని సిఎం హెచ్చరించారు.
బిసి రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోరుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఆధ్వర్యంలో భారీ ఎత్తున 'పోరుబాట ధర్నా'ను ఢిల్లీ జంతర్‌మంతర్‌లో బుధవారం నిర్వహించారు. ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండ సురేఖ, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మణ్, 70 మందికి పైగా ఎంపిలు, 50 మందికి పైగా ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌సిలు, తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, వేల సంఖ్యలో కాంగ్రెస్ తెలంగాణ నాయకులు, అన్ని వర్గాల నాయకులు పాల్గొన్నారు. ధర్నాలో ఇండియా కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకె, ఎన్‌సిపి, తరువాయి 2లో



> తెలంగాణ బిసి రిజర్వేషన్ల పెంపును ఆమోదించకుంటే ప్రధాని మోదీని గద్దె దించుతాం. ఎర్ర కోటపై మూడు రంగుల జెండా ఎగురవేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకుని మా డిమాండ్‌ను నెరవేర్చుకుంటాం. గోద్రా అల్లర్ల సమయంలో రాజీనామా చేయాలని నాటి ప్రధానమంత్రి వాజ్‌పాయ్ నరేంద్ర మోదీని కోరితే చేయలేదు. ఇప్పుడు 75 ఏళ్లు నిండినందున పదవి నుంచి వైదొలగాలని ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ కోరుతున్నా మోదీ పట్టించుకోవడంలేదు. మోదీ లేకపోతే 150 సీట్లు కూడా బిజెపికి రావని మోదీ భక్తుడు నిశికాంత్ దూబే అంటున్నారు. ఈసారి బిజెపికి ఎట్టి పరిస్థితుల్లోనూ 150 సీట్లు దాటవు.
> – సిఎం రేవంత్‌రెడ్డి

### బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు



కులగణన ఆధారంగా సామాజిక న్యాయం కోరుతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బిసి ధర్నాపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. బిసి బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలనే డిమాండ్‌తో ధర్నా జరిగినట్లు చెప్పారు. 'కాంగ్రెస్ మహాధర్నాకు రాష్ట్రపతి స్పందిస్తారని ఆశిస్తున్నా. బిసి బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు అవుతుంది. ఈ పోరాటం కేవలం తెలంగాణ కోసమే కాదు.. దేశంలోని అణగారిన వర్గాలందరి కోసం. ఈ ధర్నాకు హాజరైన ఇండియా కూటమి నేతలకు ధన్యవాదాలు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే జార్ఖండ్ మాజీ సిఎం శిబు సోరెన్ అంత్యక్రియలకు వెళ్లినందున బిసి ధర్నాకు రాహుల్ హాజరుకాలేకపోయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తరువాయి 2లో

## విద్యార్థుల హాజరు శాతంలో జోక్యం చేసుకోం




- యూనివర్సిటీ నిబంధనలను కోర్టులు తిరగరాయలేవు
- హాజరుశాతంపై నిర్ణయం విశ్వవిద్యాలయాలదే
- స్పష్టం చేసిన హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్

హాజరు శాతం నిబంధనల విషయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది, యూనివర్సిటీ నిబంధనలను కోర్టులు తిరిగి రాయలేవని స్పష్టం చేసింది. పరీక్షలు రాయడానికి అవసరమైన హాజరు శాతం నిర్ణయాన్ని యూనివర్సిటీలు రూపొందిస్తాయని, ఇంజనీరింగ్ కోర్సు సాంకేతిక వ్యవహార అంశమని పేర్కొంది. ప్రాక్టికల్, థియరీ తరగతుల తరువాయి 2లో

## 'సృష్టి' కేసులో మరో 9 మంది అరెస్టు




**విదేశాలకు పారిపోతున్న డాక్టర్ సైతం**

ప్రజాపక్షం/హైదరాబాద్

సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో హైదరాబాద్ పోలీసులు బుధవారం మరో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఓ డాక్టర్ విదేశాలకు పారిపోతుండగా శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. దీంతో అరెస్టుల సంఖ్య 18కి చేరింది. సృష్టి కేసులో తీగ లాగితే డొంక కదిలినట్లుగా పాన్ ఇండియా లెవల్లో డాక్టర్ నమ్రత అక్రమాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నమ్రతను కస్టడీలోకి తీసుకుని పోలీసులు విచారిస్తుండగా ఇన్నాళ్లు ఆమె చేసిన అక్రమాల్లో తరువాయి 2లో

## 'ఎస్ఐఆర్' చర్చపై 'ఇండియా' ఐక్యత

- దళితులు, మైనారిటీలు, గిరిజన్ల ఓట్ల కోత
- సంయుక్త విలేకరుల సమావేశంలో రాజ్యసభలో ప్రతిపక్షనేత ఖర్గే



**న్యూఢిల్లీ :** పార్లమెంటులో ఎస్‌ఐఆర్‌పై చర్చ విషయంలో ఇండియా ఐక్య సంఘటనలోని పార్టీలన్నీ ఐక్యంగా ఉన్నాయని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. భారతీయుల ఓటింగ్ హక్కులకు సంబంధించిన కీలక అంశం కాబట్టి బిహార్‌లో ఎస్‌ఐఆర్‌పై పార్లమెంటు ఉభయ సభల్లో చర్చను 'ఇండియా' ఐక్యంగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ, విజయ్ చౌక్ వద్ద నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ దళితులు, మైనారిటీలు, ఆదివాసీలు తమ ఓటు హక్కును కోల్పోయే ముప్పు ఏర్పడిందని అన్నారు. ఎస్‌ఐఆర్‌పై పార్లమెంటులో చర్చను ఇండియా కోరుతుంటే, సర్కారు ఒప్పుకోవడం లేదని చెప్పారు. 'లోక్‌సభ స్పీకర్‌ను, రాజ్యసభ చైర్మన్‌ను, ప్రభుత్వాన్ని మళ్లీ మళ్లీ కోరుతూ తిరస్కృతే లభిస్తోంది. ప్రజల ఓట్ల హక్కుల హరణే తరువాయి 2లో



### కాళేశ్వరంలో నిధుల దుర్వినియోగం
## దోషులకు కఠిన శిక్ష

సిపిఐ కామారెడ్డి జిల్లా 3వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్

**కామారెడ్డి :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నిధులను దుర్వినియోగం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కామారెడ్డి పట్టణంలో సిపిఐ కామారెడ్డి జిల్లా 3వ మహాసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి పోలీస్ స్టేషన్ రోడ్ సుభాష్ రోడ్ మీదుగా మున్నూరు కాపు సంఘం భవన్ వరకు ప్రదర్శన జరిగింది. ప్రసంగించారు. మహాసభ ప్రాంగణంలో సిపిఐ సీనియర్ నాయకులు వి.ఎల్.నరసింహ రెడ్డి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. మహాసభకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమన్న హాజరయ్యారు. మహాసభ ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుకలను, మావోయిస్టులను, అర్బన్ నక్సలైట్ల పేరుతో మేధావులను, దేశ పౌరులను తరువాయి 2లో

## రోడ్డు ప్రమాదంలో సిపిఐ నేత అయోధ్య మృతి



ప్రజాపక్షం/ ఖమ్మం/సూర్యాపేట



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొల్లోజు అయోధ్య (72) బుధవారం తెల్లవారుజామున సూర్యాపేట సమీపంలోని విజయవాడ, హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎస్‌వి కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో ముందు వెళ్తున్న వాహనాన్ని అయోధ్య ప్రయాణిస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో అయోధ్య అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ రమేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. అయోధ్య సతీమణి అనసూర్య గత సంవత్సరం మరణించగా అయోధ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సూర్యాపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌కు తీసుకువచ్చారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, పాకాలపాటి వెంకటేశ్వరరావు (పెద్దాబ్బాయి), సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఎస్‌కె సాబీర్ పాషా, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు అయోధ్య పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌కు పార్టీశ్రేణుల సందర్శనార్థం తరలించారు. సిపిఐ, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అయోధ్య మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. అయోధ్య మృతి వార్త ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి ఒక్కరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. కమ్యూనిస్టు నాయకునిగా తనదైన పోరాటశైలిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరువాయి 12లో

## 31న చైనాకు మోదీ



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ చైనా పర్యటన ఖరారైంది. గల్వాన్ ఘర్షణ తర్వాత తొలిసారి ప్రధాని నరేంద్ర మోదీ చైనా పర్యటనకు వెళ్లనున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న బ్రిక్స్ దేశాలపై సుంకాలు విధిస్తూ లక్ష్యంగా చేసుకున్న సమయంలో చైనాలో మోదీ పర్యటిస్తుండడం గమనార్హం. బ్రిక్స్ దేశాల్లో చైనా కూడా ఉంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సదస్సులో తరువాయి 2లో

### సంక్షేమ పథకాలలో సిఎం పేర్లు, ఫోటోలు...
## మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు కొట్టివేత

- పిటిషనర్, ఎఐఎడిఎంకె నేత సి.వి.షణ్ముగమ్‌కు రూ.10లక్షల జరిమానా విధించిన సుప్రీంకోర్టు
- వారం రోజుల్లో చెల్లించకుంటే కోర్టు ధిక్కరణగా పరిగణిస్తామని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్, ఇతర పార్టీ ప్రముఖుల పేర్లు, ఫోటోలను సంక్షే పథకాలలో ఉపయోగించకూడదంటూ తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మద్రాస్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను బుధవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఉంగలుడన్ స్టాలిన్ '(మీతో, స్టాలిన్) ఔట్‌రీచ్ కార్యక్రమానికి వ్యతిరేకంగా ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐడిఎంకె) నాయకుడు సి.వి.షణ్ముగం కోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు.ఇది 'చట్టపరంగా పూర్తిగా తప్పు', 'చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేయబడింది' తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పోలెండ్ అధ్యక్షుడిగా నవ్రోకి ప్రమాణ స్వీకారం



**వార్సా:** పోలెండ్ దేశ అధ్యక్షుడు కరోల్ నవ్రోకీ (42) బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సార్వ భౌమాధికార పోలాండ్ కోసమే తాను పోరాడతానని ఆయన ఈ సందర్భంగా పార్లమెంటులో అన్నారు. యూరోపియన్ యూనియన్‌లో సార్వభౌమాధికార పోలెండ్‌కు మద్దతుఇచ్చే వారి పక్షానే తాను నిలబడతానని స్పష్టం చేశారు. పార్లమెంటు వెలుపల వేలాదిమంది నవ్రోకీ మద్దతుదారులు ఆయనకు అనుకూల నినాదాలు చేశారు. జాతీయ వాది, చరిత్రకారుడు, రాజకీయ నాయకుడు, డోనాల్డ్ ట్రంప్ భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న ఆయన మద్దతుదారుడు కరోల్ నవ్రోకీ జూన్‌లో జరిగిన రెండో రౌండ్ అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. అంతకుముందు ఎన్నికల ప్రచారం సందర్భంగా మే నెలారంభంలోనే ఓవల్ ఆఫీస్‌కు వెళ్ళి ట్రంప్‌తో నవ్రోకీ సమావేశమై ఆయన ఆశీర్వాదాలు పొందారు. ఐతే నవ్రోకీ గెలుపుతో యూరోపియన్ యూనియన్ అనుకూల పోలాండ్ ప్రధానమంత్రి డోనాల్డ్ టస్క్ సమస్యల్లో పడ్డారు.

# అణ్వాయుధ నిషేధ ఒప్పందం అమలు చేయాలి

### హిరోషిమా మేయర్ కజుమి మట్సుయి పిలుపు

జపాన్‌పై అణుదాడి విషాదానికి 80 ఏళ్ళు





**టోక్యో:** హిరోషిమా నగరంపై అమెరికా అణుబాంబుదాడి చేసి 80 సంవత్సరాలు గడచిన సందర్భంగా ఆనాటి మృతులకు జపాన్ ప్రభుత్వం, ప్రజలు బుధవారం ఉదయం నివాళులు అర్పించారు. స్మారక కేంద్రం వద్ద జపాన్ ప్రధానమంత్రి షిగెరు ఇషిబా, సిటీ మేయర్ కజుమి మట్సుయి, ఇతర మంత్రివర్గ సహచరులు, అనేకమంది ప్రముఖులు కొద్దినిమిషాలు మౌనంపాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హిరోషిమా మేయర్ మాట్లాడుతూ, చరిత్ర విషాదాల నుండి గుణపాఠాలు నేర్చుకోవాలన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం ప్రతి దేశం ఆయుధాల సేకరణ, సైనిక నిర్మాణంవైపే దృష్టి సారించిందని, ఈ పరిస్థితుల్లో జాతీయ భద్రతకు అణ్వాయుధాలు అత్యవసరమనే భావన ఏర్పడిందన్నారు. అంతర్జాతీయంగా సైనిక నిర్మాణంపై దృష్టిసారించడం అంటే చరిత్రలో సంభవించిన విషాదాలను, గుణపాఠాలను విస్మరించడమే అవుతుందన్నారు. అణ్వాయుధ నిషేధ ఒప్పందాన్ని జపాన్ కూడా ఆమోదించాలని జపాన్ ప్రభుత్వా న్ని ఆయన కోరారు. అణ్వాయుధాల నిషేధంపై ఒప్పందాన్ని ఇప్పటికే 70 దేశాలు ఆమోదించినప్పటికీ అమెరికా, రష్యా వంటి దేశా లు మాత్రం అంగీకరించడంలేదు. జపాన్ కూడా తిరస్కరించింది. అమెరికా వంటి దేశాలు చేసే దాడుల నుండి అణ్వాయుధాలవల్లే రక్షణ కలుగుతుందని జపాన్ చెబుతున్నది.

రెండో ప్రపంచయుద్ధంలో హిరోషిమా నగరంపై 1945 ఆగస్టు ఆరో తేదీన అమెరికా చేసిన అణుబాంబు దాడి చేసింది. తర్వాత మూడురోజులకు ఆగస్టు తొమ్మిదో తేదీన నాగాసాకి నగరంపై అణుబాంబు దాడి చేసింది. ఈ బాంబుదాడుల్లో లక్షలమంది మరణించారు. హిరోషిమా నగరంపై జరిగిన దాడిలో 1.10 లక్షలమంది తక్షణమే మరణించగా, మరో 90వేలమంది ఆ తర్వాత అణుధార్మికత ప్రభావంవల్ల మరణించారు. వేలాదిమంది జీవచ్ఛవాలుగా మారారు. పసిఫిక్ సముద్రంలో పెరల్ హార్బర్‌లో ఉన్న అమెరికా నౌకాకేంద్రంపై 1941 డిసెంబరు ఏడో తేదీన జపాన్ ఆకస్మికంగా దాడి చేయడంతో బ్రిటన్,అమెరికాలు ఆ మరునాడే జపాన్‌పై యుద్ధం ప్రకటించాయి. తర్వాత 1945లో అమెరికా ఈ రెండు నగరాలపై బి–20 బాంబర్లతో అణుదాడులు చేసింది. ఆ తర్వాత జపాన్ లొంగిపోవడంతో ఈ యుద్ధం ముగిసింది. కానీ అణుధార్మికత ప్రభావం ఇప్పటికీ అనేక తరాలను వెంటాడుతూనే ఉంది. "హిరోషిమా బాంబు దాడివల్ల నా తండ్రి ఒళ్ళంతా కాలిపోయింది, ఆయన చర్మం శరీరం నుండి ఊడిపోయి ఒక సంచీలా వేలాడిపోయింది" అని ఆనాటి పేలుడు నుండి సజీవంగా బయట పడిన షింగో నైటో ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. హిరోషిమా బాంబుదాడిలో బయటపడిన సజీవుల బృందం ఒకటి ప్రపంచాన్ని అణుబాధ నుండి విముక్తి చేసేందుకు కృషి చేస్తున్నందుకుగాను 2024లో నోబెల్ బహుమతి పొందింది.

## దక్షిణ ఫ్రాన్స్‌లో దావానలం : ఒకరు సజీవదహనం



**పారిస్:** దక్షిణ ఫ్రాన్స్ స్పెయిన్ సరిహద్దుల్లోని మెడిటేరియన్ రీజియన్‌లో దావానలం చెలరేగింది. ఈ ప్రమాదంలో ఒక మహిళ ఇంట్లోనే సజీవదహనమైంది. మరో వ్యక్తి గల్లంతు కాగా తొమ్మిది మంది గాయపడ్డారు. దాదాపు 1800 అగ్నిమాపకబృందాలు, ఇతర సహాయ బృందాలు మంటలను అదుపు చేసేందుకు పోరాడుతున్నాయి. కేవలం 12గంటల వ్యవధిలో దావానలం 11,000 హెక్టార్ల ప్రాంతాన్ని ఆవరించుకుంది. ఈ వేసవికాలంలో ఫ్రాన్స్‌లో చెలరేగిన అతిపెద్ద కార్చిచ్చు ఇదే. మంగళవారం మధ్యాహ్నం రిబాట్ గ్రామంలో ఈ కార్చిర్చు చెలరేగి శరవేగంగా విస్తరించింది. రాత్రి తెల్లవార్లూ సహాయబృందాలను మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మంగళవారం వాతావరణం మంటలను అదుపు చేసేందుకు ఏ మాత్రం అనువుగా లేదు. కానీ బుధవారం కూడా ఈ కార్చిచ్చు చాలా క్రియాశీలంగా కదులుతోంది. ఈ వేసవికాలంలో దక్షిణ యూరప్ ప్రాంతంలో అనేకచోట్ల కార్చిచ్చులు చెలరేగాయి. వాతావరణ మార్పులు, వేడి పొడిబారిన ప్రాంతాలను మరిన్ని చిక్కుల్లో పడేయడంవల్ల కార్చిచ్చులు చెలరేగే ప్రమాదాలు న్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# గాజా ఆక్రమణ.. వినాశకర పరిణామం


### నేడు సెక్యూరిటీ క్యాబినెట్‌లో నెతన్యాహు చర్చ



**టెల్అవీవ్:** గాజాను పూర్తిస్థాయిలో ఆక్రమించుకోవాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రణాళిక చేస్తున్నారు. ప్రపంచదేశాలు, సహాయ సంస్థలు దీనిని అత్యంత వినాశకర పరిణామంగా అభివర్ణించాయి. గాజాను సంపూర్ణంగా ఆక్రమించుకోవాలన్న విషయంపై గురువారం నాడు జెరూసలెం కార్యాలయంలో జరిగే సెక్యూరిటీ క్యాబినెట్ సమావేశంలో నెతన్యాహూ చర్చిస్తారు. తర్వాత తుది నిర్ణయం వెలువడుతుంది. సైన్యంలో కొంతమంది వ్యతిరేకిస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో గాజాను పునఃస్వాధీనం చేసుకోవాలని నెతన్యాహూ పట్టుదలతో ఉన్నారు. ఐతే మంగళవారంనాడు పరిమితమైన సభ్యులతో కూడిన మంత్రివర్గంలో మూడుగంటలపాటు నెతన్యాహూ చర్చలు జరిపారు. గాజా ఆక్రమణకు సంబంధించి తన ప్రణాళికను వారికి వివరించారు. గాజాలో సైనిక చర్యలు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ సర్వసైన్యాధికారి లెఫ్టినెంట్ జనరల్ ఎఎల్ జమీర్‌తో చర్చించారు. గురువారం జరిగే సమావేశంలో గాజా సంపూర్ణ ఆక్రమణపై ఒక స్పష్టత వస్తుంది.

**ఆయన ఇష్టానికే వదిలేశా–ట్రంప్ :** గాజా పూర్తి ఆక్రమణ ప్రణాళికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ, గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలా? వద్దా? అనేది పూర్తిగా నెతన్యాహూ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పుడు తన దృష్టి అంతా గాజాలో ఆకలి తో బాధపడుతున్న ప్రజలకు ఆహారం సమకూర్చేవిషయంమీదే ఉందన్నారు. గాజాలో కొత్త ఆహార కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఇక ఆ తర్వాత నుండీ గాజా కోసం ఒక కొత్త ప్రణాళికను ఆవిష్కరిస్తామని ట్రంప్ ఎనిమిది రోజులక్రితం చెప్పారు. ఐతే ఈ ప్రణాళికను ఇంకా అమలు చేయలేదు. అరబ్ దేశాలు కూడా ధనంపరంగా తమకు సహాయం చేసే అవకాశాలున్నాయని కూడా ట్రంప్ చెప్పారు. అదేవిధంగా కొద్దిరోజులక్రితం గాజా ప్రజలకోసం మిలియన్ డాలర్లు గాజా ఫౌండేషన్‌కు ఇజ్రాయెల్ అందించిందని వార్తలు వచ్చాయి. కానీ ఇదే నిజమైతే స్వదేశంలో నెతన్యాహూకు తీవ్రమైన వ్యతిరేకత ఎదురవుతుంది. గాజాలో ఇంకా 50 మంది ఇజ్రాయెలీ ప్రజలు హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో గాజా సంపూర్ణ ఆక్రమణ విషయాన్ని ఆయన ఇష్టానికే వదిలిపెడుతున్నట్లు ట్రంప్ చెప్పారు.

## మంచుకొండల్లో చెక్కుచెదరకుండా..
## 28 ఏళ్ల తర్వాత బయటపడిన మృతదేహం




**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని మంచుకొండల్లో అదృశ్యమైన నసీరుద్దీన్ అనే వ్యక్తి మృతదేహం 28 సంవత్సరాల తర్వాత చెక్కు చెదరకుండా బయట పడింది. ఒమర్‌ఖాన్ అనే ఒక గొర్రెలకాపరి ఈ మృతదేహాన్ని చూశాడు. తీవ్ర దిగ్భ్రాంతి, భయంతో అందరికీ ఈ విషయం తెలియజేశాడు. సదరు మృతుడి వద్ద నజీరుద్దీన్ అనే పేరుతో చెక్కుచెదరకుండా ఉన్న గుర్తింపు కార్డును కూడా స్వాధీనం చేసుకున్నారు. అతడి శరీరంపై ఉన్న దుస్తులు ఏ మాత్రం చిరిగిపోలేదు. మృతుడు నసీరుద్దీన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబంతో పాటు అతడి సోదరుడితో కలిసి 1997లో ఆ పర్వతప్రాంతాల్లో గుర్రాలపై తిరిగారు. తర్వాత నసీరుద్దీన్ ఒక గుహలోకి వెళ్ళాడని, ఇక వెనక్కు తిరిగి రాలేదని ఆయన సోదరుడు ఖతిరుద్దీన్ అంతర్జాతీయ మీడియాకు చెప్పారు.

ఈ ప్రాంత ప్రజల సహాయంతో ఆ మొత్తం ప్రాంతం తిరిగినా గానీ తన సోదరుడి జాడ తెలియలేదని, ఇప్పుడు ఈ విధంగా మృతదేహం బయటపడిందని ఖతిరుద్దీన్ చెప్పారు. ఈ పరిణామంపై ఇస్లామాబాద్‌లోని కాన్సాట్ యూనివర్సిటీ పర్యావరణ విభాగం ప్రొఫెసర్ మహ్మద్ బిలాల్ మాట్లాడుతూ, లోతైన మంచులోపలిభాగంలో ఒక మృతదేహం కూరుకుపోయినప్పుడు ఏ మాత్రం మాయిశ్చర్, ఆక్సిజన్ లేకుండా ఒక మమ్మీ తరహాలో భద్రంగా ఉండటంవల్ల ఆ మృతదేహం కుళ్ళిపోయే అవకాశం ఉండదని, అందువల్లనే అనేక సంవత్సరాలు గడచినాగానీ మృతదేహం, అతడు ధరించిన దుస్తులు, గుర్తింపు కార్డు కూడా చెక్కు చెదరకుండా బయటపడ్డాయని చెప్పారు. మృతదేహంతోపాటు గుర్తిం పు కార్డు కూడా దొరకడంతో అతడి ఆచూకీ గురిం చి స్థానిక ప్రజలు కూడా కొద్దికొద్దిగా సమాచారాన్ని తెలియజేయడంతో పూర్తి వివరాలు తెలిశాయి. 1997 జూన్‌లో మంచు తుఫాను వచ్చినప్పుడు ఆ సమయంలో అతడిపై ఒక పెద్ద మంచుగడ్డ పడి మంచులో కూరుకుపోయి సమాధయ్యాడు. అతడి జాడ ఎవ్వరికీ తెలియలేదు. కానీ ఇటీవలి సంవత్సరాలలో ఈ ప్రాంతంలో మంచు తగ్గిపోతోంది. వాతావరణ మార్పుల కారణంగా సంభవిస్తున్న పరిణామాలకారణంగానే పాకిస్థాన్‌లోని మారుమూల ప్రాంతం కోహిస్తాన్‌లో కరుగుతున్న హిమనీనదాలలో అతడి మృతదేహం దొరికింది.

## 31న చైనాకు మోదీ

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొనేందుకు ప్రధాని మోదీ, ఈ నెల 31న చైనాలోని తియాన్‌జిన్ నగరానికి చేరుకోనున్నారు. సెప్టెంబర్ 1న కూడా అక్కడే ఉండనున్నారు. సదస్సులో భాగంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉందని జాతీయ మీడియా పేర్కొంది. 2019లో చివరిగా ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. గతేడాది రష్యా వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రధాని మోదీ తొలుత ఈ నెల 30న జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడ జపాన్ ప్రధాన మంత్రి ఫ్యూమియో కిషిదాతో వార్షిక ఇండియా జపాన్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి మోదీ చైనాకు వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే జూన్‌లో చైనాలోని కింగ్‌డావోలో జరిగిన ఎస్‌సిఒ రక్షణ మంత్రుల సమావేశంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు.

## 9 మంది అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యం ఉన్నవారి వెన్నులో వణుకుపుడుతోంది. దీంతో తమ పేరు బయటపడక ముందే విదేశాలకు ఎస్కేప్ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనిఏ మహిళా డాక్టర్ విద్యుల్లతతో పాటు మరో 9 మందిని అరెస్టు చేశారు. వైద్యురాలు విదేశాలకు పారిపోతుండగా అదుపులోకి తీసుకోవడం ఈకేసులో కీలక పరిణామంగా మారింది. 'సృష్టి' నిర్వాహకురాలు నమ్రత కేసులో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. పెద్ద నెట్వర్కు ఏర్పాటు చేసుకున్న డా.నమ్రత సికింద్రాబాద్కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ లెటర్హెడ్లు వాడినట్లు గుర్తించారు. తన పేరుతో ఉన్న లెటర్హెడ చూసి ఆశ్చర్యానికి గురైన ఓ వైద్యురాలు నమ్రతపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఈ వ్యవహారంపై గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## దోషులకు కఠిన శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

చంపే హక్కు ఎవరిచ్చారని ఆయన నిలదీశారు. అంబానీ, అదానీల వంటి కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడే విధంగా కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ప్రభుత్వం విధానాలు ఉన్నాయని విమర్శించారు. మతోన్మాదంతో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్ళు, పేదలకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు , రేషన్ కార్డులు పార్టీలకతీతంగా అందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని కూనంనేని సూచించారు. హామీలను అమలు చేయకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.స్వామినాథన్ సిఫార్సు ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, రైతులకు నాణ్యమైన ఎరువులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మహాసభలో సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్, పి.బాలరాజ్,దుబాస్ రాములు, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు. సుమారు 300 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు.

## 50శాతం సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయాలను ముడిపెట్టి శత్రువైఖరితో సుంకాల భారాలు విధించారు. ఐతే చైనాపై కూడా ఆంక్షలు విధించేందుకు ట్రంప్ సమాయత్తమవుతున్నట్లు వార్తలు వచ్చాయి. రష్యాకు ఎలాంటి ఆర్థిక వనరులూ సమకూరకుండా అన్నిదారులూ మూసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా అంతర్జాతీయ ప్రపంచం ముందు భారతదేశాన్ని నేరస్థురాలుగా నిలబెట్టిన ట్రంప్, చమురు కొనుగోలు ద్వారా రష్యాకు లాభాల మీద లాభాలు చేకూర్చి ఉక్రేన్‌లో యుద్ధానికి ఆజ్యం పోస్తోందని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అమెరికాతో వాణిజ్యం చేస్తున్న దేశాలలో ఇప్పటివరకూ బ్రెజిల్, భారత్‌లపై మాత్రమే ట్రంప్ అతిభారీస్థాయిలో 50 శాతం మేరకు టారిఫ్‌లు విధించారు. దీనిని ట్రంప్ యంత్రాంగం 'టారిఫ్‌లతో శిక్షించడం'గా భావిస్తున్నది. బ్రెజిల్‌లోని లులా డసిల్వా ప్రభుత్వం అన్ని పాలనావ్యవస్థలను దుర్వినియోగం చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపిస్తూ ఆ దేశంపై 50 శాతం వాణిజ్య సుంకాలు విధించారు. ఉక్రేన్‌లో విరామం లేకుండా యుద్ధం కొనసాగడానికి భారతదేశం రష్యాతో చేస్తున్న చమురు వ్యాపారమే కారణమని ఆరోపిస్తూ భారత్‌పై సుంకాలను మొత్తంగా 50 శాతానికి పెంచారు. బ్రెజిల్‌లో పూర్వపు అధ్యక్షుడు బోల్సెనారో ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడు. ఆ దేశంలో ఆయన ఎదుర్కొంటున్న కేసుల విచారణకూ, మానవహక్కులకు, వాణిజ్య నిర్ణయాలకు ట్రంప్ ముడిపెట్టారు. బోల్సెనారోపై అక్రమంగా కేసులు బనాయించి జైలులో పెట్టారనేది ట్రంప్ వాదన. ఆ దేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండ్రీ డీ మొరాయిస్ బోల్సెనారోను గృహనిర్బంధం చేయాలని మంగళవారంనాడు ఆదేశించడాన్ని ట్రంప్ ఖండించారు. అమెరికా–భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం చర్చలు మధ్యలో ఉండగానే భారత్‌పట్ల కూడా ఆకస్మికంగా ట్రంప్ ఇదే వైఖరి తీసుకున్నారు.

## జోక్యం చేసుకోం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిబంధనలు రూపకల్పన ఉంటుందని అభిప్రాయపడింది. సాధారణంగా 75శాతం హాజరు అవసరమని, అనారోగ్యం, క్రీడలు, ఎన్సీసీ వంటి ప్రత్యేక పరిస్థితుల్లో 10 శాతం మినహాయింపు వరకే అవకాశం ఉంటుందని, దీనికి మించి అనుమతించేందుఉ వీల్లేదనే నిబంధనలను గుర్తుచేసింది. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థిని పరీక్షలకు అనుమతిస్తూ ఆదేశాలివ్వలేమని పేర్కొంది. హాజరు తక్కువగా ఉన్న విద్యార్థి నిర్దిష్ట విద్యా సంవత్సరంలోగా సెమిస్టర్ పూర్తి చేయాల్సిందేనని వెల్లడించింది. హైదరాబాద్‌కు చెందిన కె. మాన్విత అనారోగ్యంతో హాజరు శాతం తక్కువగా ఉన్న కారణంగా బీటెక్ మూడో సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్షలకు అనుమతించాలని సింగిల్ జడ్జి గతంలో ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని గీతాంజలి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) అప్పీల్ దాఖలు చేసింది. చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. యూనివర్సిటీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఇలాంటివి అనుమతిస్తే విద్యార్థులందరూ ఇదే తరహా అభ్యర్థనలతో కాలేజీకి రాకుండా పరీక్షలకు అనుమతించాలని కోర్టులకు వస్తారని తెలిపారు. ప్రస్తుతం పిటిషనర్‌తో పాటు హాజరు తక్కువగా ఉన్న అయిదుగురిని పరీక్షలకు అనుమతించలేదన్నారు. విద్యార్థి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అనుమతించాలని కోరారు. మేఘాలయ హైకోర్టుతో పాటు ఇతర హైకోర్టులు ఇచ్చిన తీర్పులను పరిగణనలోకి తీసుకుని నిర్దిష్ట కారణాలతో కాలేజీకి వెళ్లలేకపోయిన విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలని కోరారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ, జీవితంలో ఎన్నోక ఒడిదుడికలు ఎదురౌతుంటాయని, అనేక అడ్డంకులు వస్తుంటాయని వీటిని దీటుగా ఎదుర్కొని పరీక్షలకు హాజరుకాలేకపోతే ఎలాగని ప్రశ్నించింది. యుపీఎస్సీ తదితర పోటీ పరీక్షల్లో కూడా మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులు కాలేనివారు చాలా మందే ఉంటారని, ఆ తర్వాత ప్రయత్నాలు చేసి అగ్రస్థానంలో నిలిచిన వారు ఉన్నారని గుర్తు చేసింది. అనారోగ్యం కారణంగా విద్యార్థిని పరీక్షలకు అనుమతిస్తే, రేపు మరొకరు ఇలాగే ప్రత్యేక కారణాలతో కాలేజీ, యూనివర్సిటీ నుంచి వచ్చే అవకాశం ఉండే ప్రమాదం లేకపోలేదని చెప్పింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే జనవరి నుంచి ప్రారంభమయ్యే మూడో సంవత్సరం 2వ సెమిస్టర్‌లో జూనియర్ విద్యార్థులతోపాటు చదవాలని చెప్పింది. అప్పీల్‌ను అనుమతించింది.

## 'ఇండియా' ఐక్యత

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఐఆర్‌లో జరుగుతోంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు వెల్లడించారు. స్వయంప్రతిపత్తిగల రాజ్యాంగబద్ధ సంస్థ కాబట్టి ఎన్నికల సంఘం పనితీరుపై పార్లమెంటులో చర్చించలేమని ఇటు సభాపతి, అటు ప్రభుత్వం చెబుతున్నారు. కానీ, ఈ వ్యవహారంలో చర్చ అవకాశాన్ని కోరుతున్నాం. ఈ ప్రక్రియ పారసత్వంపై సందేహాలు కల్పించేలా ఉంది' అని ఖర్గే వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలోని తప్పులను చూపాలని, దేశ ప్రయోజనాల దృష్ట్యా మరిన్ని సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయని చెప్పారు. 'సంపూర్ణ చర్చ జరిగితే ఎక్కడెక్కడ తప్పులు చేశారు... ఎక్కడ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారో చెప్పే వీలుంటుంది. తగు సూచనలను ప్రతిపక్షాలు చేయగలవు. మరీ ముఖ్యంగా పౌరుల ఓటు హక్కుకు రక్షణ లభిస్తుంది' అని ఖర్గే అన్నారు. ఈ భూమ్మీద జరిగే దేని గురించైనా పార్లమెంటులో చర్చించవచ్చని 2023లో రాజ్యసభ చైర్మన్‌గా ఉన్న జగదీప్ ధన్కర్ చెప్పారు కానీ ప్రస్తుత డిప్యూటీ హరివంశ్ ఒప్పుకోలేదన్నారు. 'ఎవరి ఓట్లలో కోతలు పడతాయి? మైనారిటీలు, దళితులు, గిరిజనులు, గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు, వలస కార్మికులు... ఈ వర్గాలు తమ ఓటు హక్కును కోల్పోయే ముప్పు ఉంది. ఎస్ఐఆర్ ద్వారా వీరి హక్కును హరిస్తున్నారు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు సాగరిక మాట్లాడుతూ ఎస్ఐఆర్ అంశంపై పార్లమెంటు లోపల, బయట తమ ఆందోళన కొనసాగుతుందని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడేవారిపై దాడులనూ లేవనెత్తుతామని అన్నారు. ఈనెల 11న ఇండియా అధ్వర్యంలో ఈసీ కార్యాయం వరకు మార్చ్ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో తిరుచీ శివ (డీఎంకే), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం), సంజయ్ రౌత్ (శివసేన ఉద్ధవ్) తదితర నేతలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పార్లమెంటు హౌస్ కాంపెక్స్ వద్ద ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఇండియా ఆందోళన కొనసాగింది. 'ఎస్ఐఆర్: చర్చకు డిమాండ్, తొలగింపునకు కాదు!' అనే బ్యానర్‌ను నాయకులు ప్రదర్శించారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ 'వాళ్లు (ప్రభుత్వం) బలహీనపడ్డారా? ఇటు పార్లమెంటును నిర్వహించలేకపోతున్నారు... అటు ట్రంప్‌కు బదులు ఇవ్వలేకపోతున్నారు. మేము చర్చను మాత్రమే కోరుతున్నాం. దీన్ని వారు సులువుగా పరిష్కరించగలరు' అని వ్యాఖ్యానించారు.

**ఎస్ఐఆర్‌పై రాజ్యసభలో చర్చించాలి**
**డిప్యూటీ చైర్మన్‌కు ఖర్గే లేఖ**

బీహార్‌లోని ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై చర్చకు అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కు లేఖ రాశారు. ఇది 'కోట్లాది మంది ఓటర్లకు, ముఖ్యంగా సమాజంలోని బలహీన వర్గాలకు చెందిన వారికి అత్యంత ఆందోళన కలిగించే అంశం' అని పేర్కొన్నారు. ఎగువ సభ డిప్యూటీ చైర్మన్‌కు రాసిన నాలుగు పాయింట్ల లేఖలో... రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు ఇలా అన్నారు : 'ప్రస్తుత సమావేశాల మొదటి రోజు నుంచే ప్రతిపక్ష ఎంపీలు సభలో అత్యవసర చర్చకు అనేక సార్లు అడిగారు' అని అన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ తీర్పును ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ... 'ఒకే పరిమితితో ప్రతిదాని గురించి చర్చించడానికి సభకు అర్హత ఉంది' అని తీర్పు ఇచ్చారని, ఆ పరిమితి 'సుప్రీం కోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి తన విధుల నిర్వహణలో ప్రవర్తించడం', 'న్యాయమూర్తి తొలగింపు కోసం ప్రార్థిస్తూ రాష్ట్రపతికి ప్రసంగం సమర్పించాలనే ప్రతిపాదన తప్ప' అని పేర్కొన్నారు. మన ప్రజాస్వామ్యంలో ప్రాథమిక ప్రాముఖ్యత కలిగిన ఓటర్ల జాబితాల సవరణ అంశంపై చర్చించడానికి రాజ్యసభకు అర్హత ఉందని చైర్ ఇచ్చిన ఈ తీర్పు నుంచి స్పష్టంగా తెలుస్తుంది' అని ఖర్గే ఆ లేఖలో తెలిపారు.

## గద్దె దించుతాం..

(మొదటి పేజీ తరువాయి)

వామపక్షాలకు చెందిన ఎంపిలు పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

**బిల్లులను ఆమోదించకుంటే ఢిల్లీకి రాం.. గల్లీకి వచ్చినప్పుడు బిజెపి నేతలను పట్టుకుంటాం**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను, తెలంగాణ ప్రజల శక్తిని మోదీ తక్కువగా అంచనా వేస్తే ఆయనకు తడాఖా చూపిస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్ల పెంపు బిల్లులను ఆమోదించకుంటే ఇక ఢిల్లీకి రాబోమని, గల్లీకి వచ్చినప్పుడు బిజెపి నేతలను పట్టుకుంటామని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ వారసునిగా వచ్చిన రాహుల్ గాంధీ బిసిలకు న్యాయం చేసేందుకు కంకణం కట్టుకున్నారని, ఆయన మహత్తర ఆశయాలకు అడ్డ తగిలితే వారి చిరునామా గల్లంతవుతుందని సిఎం హెచ్చరించారు. ప్రధాని మోదీకి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రపతి దగ్గర ఉన్న బిల్లులు తక్షణమే ఆమోదం పొందేలా చూడాలని, లేకుంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు బిజెపికి, మోదీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

**కెసిఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు తెలంగాణ బిసిలు అవసరం లేదా?**

తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాంచంద్రావులు బిసి రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు తెలంగాణ బిసిలు అవసరం లేదా, బిఆర్ఎస్ నాయకులు బిసి రిజర్వేషన్ల పెంపు ధర్నాకు ఎందుకు రాలేదని, ఆ పార్టీ తెలంగాణతో పేరు బంధంతో పాటు పేగు బంధం కూడా తెంచుకుందా అని ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్ల పెంపు ధర్నాను కెటిఆర్ డ్రామా అంటున్నారని, కెటిఆర్ పేరే డ్రామారావు అని, కెసిఆర్ కుటుం బం డ్రామాలతో బతుకుతోందని సిఎం విమర్శించారు. అధికారం, పదవులు పోయినా కెటిఆర్ బుద్ధి మారలేదని, అహంకారం తగ్గలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. కెసిఆర్ కుటుంబంలోనే ఒకరు రిజర్వేషన్లకు అనుకూలమని, మరొకరు ప్రతికూలమని... మరొకరు అటూ ఇటూ కాకుండా మాట్లాడుతున్నారని సిఎం ఎద్దేవా చేశారు.

**బిసి రిజర్వేషన్లకు గుదిబండగా మారిన కెసిఆర్ చేసిన చట్టం...**



ధర్నాను ఉద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ బలహీనవర్గాలపై కక్ష గట్టిన గత సిఎం కెసిఆర్ 50 శాతం రిజర్వేషన్లు మించకుండా చట్టం చేశారని విమర్శించారు. నాడు కెసిఆర్ చేసిన చట్టం నేడు రిజర్వేషన్లకు గుదిబండగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో బలహీనవర్గాల బిడ్డలు సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు కాకుండా అడ్డుగా ఉన్న చట్టాన్ని తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపామని, దానిని ఆమోదించడంలేదని సిఎం అన్నారు. బిసిలకు స్థానిక ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీలో ధర్నా చేపట్టామని, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధించి తీరుతామని సిఎం ప్రకటించారు.

మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ 'వినోబా బావే భూదాన ఉద్యమం మొదలు పెట్టినప్పుడు తెలంగాణకు చెందిన ఓ రెడ్డి భూస్వామి భూదానం చేసి పెద్ద మనస్సు చాటుకున్నారు. ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డి రెడ్డి కులానికి చెందినప్పటికీ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులు ఆమోదించారు. ఇది చరిత్రలో నిలిచిపోయే అంశం' అన్నారు.

ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి సుప్రియా సూలే మాట్లాడుతూ 'సిఎం అవుతానని రేవంత్ రెడ్డి ఎప్పుడూ చెప్పలేదు. కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మాత్రమే చెప్పారు. ఒక కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి వరకు రేవంత్ రెడ్డి ఎదిగారు. పీడితులు, తాడితుల తరపున రేవంత్ రెడ్డి పోరాడుతున్నారు. దేశంలో రిజర్వేషన్లు కల్పించిన అంబేద్కర్, తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లకు కారణమైన కరుణానిధి పేర్ల పక్కన రేవంత్ రెడ్డి పేరును సువర్ణాక్షరాలతో లిఖిస్తారు. బిసి రిజర్వేషన్ల విషయంలో రేవంత్ రెడ్డి కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుంది' అన్నారు.

డిఎంకె ఎంపి కనిమొళి మాట్లాడుతూ 'తెలంగాణలో బిసి రిజర్వేషన్ల పెంపు బిల్లులను తక్షణమే ఆమోదించాలి. తరతరాలుగా వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. బిసి రిజర్వేషన్ల పెంపునకు తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు డిఎంకె అండగా ఉంటుంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు అన్ని స్థాయిల్లో మద్దతుగా నిలుస్తాం' అన్నారు.

టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అంశాన్ని మతకార్డుతో ముడిపెట్టి అడ్డుకోవడమే బిజెపి నేతల లక్ష్యమని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల మద్దతు లేకుండా సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి నామినేషన్ వేయగలరా? అని ఆయన ప్రశ్నించారు. బిసిల పేరుతో గెలిచిన బండి సంజయ్, ఇప్పుడు కిషన్ రెడ్డికి వత్తాసు పలుకుతుండడం సిగ్గుచేటన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఎంత దూరమైనా పోతామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సర్పంచ్‌లు చేపట్టిన పనులపై ప్రభుత్వ బిల్లులకు మరో నాలుగు వారాల గడువు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంచాయతీరాజ్ కమిషన్ నాలుగు వారాల గడువు కోరినట్లు తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తెలిపారు. గ్రామాలలో సర్పంచ్‌లు చేపట్టిన పనులకు ప్రభుత్వం తక్షణమే బిల్లులను చెల్లించే విధం గా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ మానవ హక్కుల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపైన కమిషన్ నోటీసులు జారీ చేయగా, మరో నాలుగు వారాల గడువు కావాలని పంచాయతీరాజ్ కమిషనర్ కోరినట్లు సుర్వి యాదయ్య వివరించారు. ఈ విచారణ సందర్భంగా సర్పంచులు సుర్వి యాదయ్య గౌడ్ , కేశ బోయిన మల్లయ్య, నెమలి సుభాష్ గౌడ్, మన్నె పద్మారెడ్డి సముద్రాల రమేష్ ,అల్లంపల్లి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ జీవితం యువతకు ఆదర్శం

### ప్రొఫెసర్ జయశంకర్‌కు ప్రముఖుల నివాళులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ సిద్ధాంత కర్త, రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 91వ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పించారు. తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. శాసనసభ ప్రాంగణంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. 'మన నీళ్ళు మనకు, మన ఉద్యోగాలు మనకు' అంటూ ఉద్యమానికి ఊపిరి పోసిన ధీశాలి జయశంకర్ అని సుఖేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రం ఆయన సేవలను గుర్తించి భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం గౌరవంగా భావించాలని చెప్పారు. జయశంకర్ జీవితం నేటి యువతకు ఆదర్శమని స్పీకర్ ప్రసాద్ కుమార్ తెలిపారు.

**తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్ : బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్**

బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, వనరుల రక్షణ కోసం జయశంకర్ జీవితాంతం పోరాడరన్నారు. తొలి, మలి దశ ఉద్యమాలలో ఆయన పోషించిన పాత్ర కీలకమన్నారు. ఈ తరం యువత ఆయన స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకొని రెండు నిమిషాల మౌనం పాటించారు.






**హెచ్ఎంఆర్ఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి ఘన నివాళి**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) ఎన్‌విఎస్ రెడ్డి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. మెట్రో రైల్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎండి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన నిస్వార్థ సేవలను, అవిశ్రాంత పోరాటాన్ని కొనియాడారు. ఆయన ఆశయాలను, కలలను సాకారం చేయడానికి అందరూ కృషి చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఆర్ఎల్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి తమ నివాళులు అర్పించారు.

**తెలంగాణ కోసం తన జీవితం అంకితం– టిజిపిసిబి సిఇ రఘు :** తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజి పిసిబి) ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ దార్శనికుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించా రు. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టిజిపిసిబి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బోర్డులోని సీనియర్ అధికారులు, సిబ్బంది ఆయన సేవలను స్మరించుకున్నారు.

టిజిపిసిబి చీఫ్ ఇంజనీర్ బి. రఘు, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల్లో ఉద్యమ భావజాలాన్ని రగిలించడంలో జయశంకర్ సార్ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రజలు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని తెలిపారు. తెలంగాణ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని రఘు కొనియాడారు. సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నప్పుడు ఆయన ఆదర్శాలు మనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టిజిపిసిబి ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.



# బిసి రిజర్వేషన్లపై దాగుడు మూతలు తగదు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** బిసి రిజర్వేషన్లపై దాగుడు మూతలు తగదు స్థానిక ఎన్నికలు ఆగడం కుంటుబట్టిన గ్రామీణ వ్యవస్థ కేంద్రం వెంటనే 42 శాతం బిసి రిజర్వేషన్లు ఆమోదించాలి చాడ వెంకట రెడ్డి మాజీ ఎమ్మెల్యే సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన బిసి రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని చాడ ఆరోపించారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించకుండా కేంద్రం దాగుడు మూతలకు పాల్పడుతోంది. స్థానిక ఎన్నికలు జరగకపోవడంతో నిధులు లేక గ్రామీణ వ్యవస్థ కుంటుబట్టింది. ఇప్పటికైనా బిసి రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించి సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల గౌడ్ ఫంక్షన్హాల్లో సిపిఐ 23వ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం జస్టిస్ పిసి ఘోష్ ఇచ్చిన నివేదికలో కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అక్రమాలపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరగాలి. అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలువడేలా చర్యలు తీసుకోవాలని. కాళేశ్వరం కూలడానికి కారణం ఎవ్వరో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి నివేదిక పై చర్చించాలని ఆయన అన్నారు. రాష్ట్ర పునర్విభజన సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వలసల జిల్లా పాలమూరులో ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాళేశ్వరం పాలమూరు రంగారెడ్డి పనులు వేగవంతం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్ని అవరోధాలు వచ్చినా స్థానిక ఎన్నికలు జరిపించాలని చేయాలని ఆయన కోరారు. గత పాలకులు ప్రాజెక్టుల విషయంలో చేసిన అవినీతి అక్రమాలు, వ్యక్తిగత లాభాపేక్ష తదితర అంశాలపైన పూర్తి స్థాయిలో చర్చ చరగాలని ఆయన పిలుపునిచ్చారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికోసం ప్రాజెక్టు దగ్గర కుర్చీ వేసుకొని కూర్చుని పూర్తి చేస్తానని చెప్పిన మాటలు ఏమయాయని ప్రశ్నించారు. సి ఎం రేవంత్ రెడ్డి సోంత జిల్లా ను అభివృద్ధి పథకంలో ముందుకు తీసుకు వెళుతాం అని చెప్పడం హర్షించ దగ్గ విషయం అన్నారు. ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పారదర్శకత ప్రదర్శించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సింహ, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాల కృష్ణ, నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఫయాజ్ దళిత హక్కుల నాయకులు అనిల్, రాష్ట్ర నాయకులు పరమేశ్వర్, రాము, సురేష్, గోవర్ధన్, కృష్ణ అల్వాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ–ఫిలిప్పీన్స్ వాణిజ్య సంబంధ విస్తరణకు పూర్తి సహకారం

### 'తెలంగాణ బియ్యం' ఎగుమతులపై ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ మంత్రి ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ బియ్యం' ఎగుమతి చేసే తెలంగాణ రాష్ట్ర ప్రతిపాదన పట్ల ఫిలిప్పీన్స్ మంత్రి సానుకూలంగా స్పందించారు. నాణ్యమైన బియ్యం పట్ల ఫిలిప్పీన్స్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ ప్రశంసలు కురిపించారు. తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు 'తెలంగాణ బియ్యం' ఎగుమతుల పరిధిని విస్తరించేందుకు ఆయన ఆసక్తి కనబర్చారు. తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ మంత్రి ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ జూనియర్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి మరింత బియ్యం ఎగుమతిపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. తెలంగాణ, ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్య సంబంధాన్ని విస్తరించేందుకు పూర్తి సహకారం అందిస్తామని ఫిలిప్పీన్స్ హామీనిచ్చారు. అయితే ఆయనను ఈ ఏడాది చివరిలో తెలంగాణ రాష్ట్రంలో పర్యటించాలని మంత్రిని ఉత్తమ్ కుమార్ ఆహ్వానించగా దీనిపై ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ జూనియర్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ పౌర సరఫరాల కమిషనర్ డిఎస్ చౌహాన్ 'తెలంగాణ సోనా' (ఆర్ఎన్ఆర్ 15048) బియ్యం రకాన్ని ఎగుమతి చేసుకోవచ్చని పిలిప్పీన్‌కు సూచించారు. కాగా 'తెలంగాణ మొక్కజొన్న'ను దిగుమతి చేసుకునే అవకాశంపై ఫిలిప్పీన్స్ మంత్రి ఆరా తీశారు.



## చారిత్రక ఆలయాలను అభివృద్ధి చేయాలి

### ఎంపి కడియం కావ్య వినతి

**ప్రజాపక్షం/హనుమకొండ:**ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయ వారసత్వ సంపదను పునరుద్ధరించాలంటూ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కె ఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్యతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఆలయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలంటే ఆలయాల పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. ప్రధాన ఆలయాలకు కేటాయించాల్సిన నిధుల వివరాలను కూడా కేంద్ర మంత్రికి అందజేశారు. అందులో భాగంగా వరంగల్ వేయి స్తంభాల ఆలయంలోని కల్యాణ మండపం మరమ్మతులు, విగ్రహ ప్రతిష్టాపన, పార్కింగ్, శౌచాలయాల కోసం 75 కోట్లు, భద్రకాళి ఆలయంలోని మహా మండపం పునర్నిర్మాణం, పర్యాటక సదుపాయాల కోసం 100 కోట్లు, చిల్పూర్ లోని శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయం (తెలంగాణ తిరుపతి) లోని భక్తుల వసతి గదులు, కొండపైకి రవాణా మార్గం కోసం 9.97 కోట్లు. భూపాలపల్లి జిల్లాలోని నపాక ఆలయం, కోటగుళ్లు, రెడ్డి గుడి ప్రత్యేక శిలలపై నిర్మితమైన ఆలయాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని కోరారు. ఎంపీ కావ్య,ఎమ్మెల్యేల విజ్ఞప్తుల పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వరంగల్ ప్రాచీన ఆలయాలను ప్రసాద్ పథకంలో చేర్చనున్నట్లు హామీ ఇచ్చారు.

# పారిశ్రామిక పార్కులకు ఆర్థిక సాయం

### కేంద్ర మంత్రి జితేంద్ర మాంజికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మధిర నియోజకవర్గంలో రెండు పారిశ్రామిక పార్కులను ఆర్థిక సహాయం అందించాలని, అలాగే ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎంఇ పార్కులను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 'ఎంఎస్ఎంఇసిడిపి' పథకం కింద ఈ పార్కుల అభివృద్ధికి ఆర్థిక సహాయానికి ప్రాజెక్ట్ ప్రతిపాదనలకు ముందస్తు అనుమతి ఇవ్వాలని, ఈ ప్రాజెక్ట్‌కు కేంద్ర నుంచి ఆర్థిక సహాయాన్ని ఆశిస్తున్నామని వివరించారు. ఈ మేరకు ఎంఎస్ఎంఇ మంత్రి జితన్‌రామ్ మాంజీని భట్టి విక్రమార్కతో పాటు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్, ఎంపి మల్లు రవి న్యూఢిల్లీలో బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు కేంద్ర మంత్రికి లేఖను అందించారు.



ఎంఎస్ఎంఇ రంగం సమగ్ర ఆర్థిక ప్రగతికి కీలక క్షేత్రంగా మారుతుందని భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున, ఖమ్మం జిల్లా మధిర మండలంలోని యెండపల్లి, ఎర్రుపాలెం మండలంలోని రెమిడిచర్ల గ్రామా ల్లో ఎంఎస్ఎంఇ పార్కులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించామని, వరుసగా 85, 60 ఎకరాల్లో ఈ పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని వారు వివరించారు. ఈ పార్కులు వివిధ తయారీ రంగాలకు అనుకూలం గా ఉంటుందని, కనీసం 5,000 ప్రత్యక్ష, 15, 000 పరోక్ష ఉపాధి అవకాశాలు ఉంటాయని వారు కేంద్ర మంత్రికి వివరించారు. ఈ ఎంఎస్ఎంఇ పార్కుల్లో హాస్టల్స్, కిచెన్లు,టాయిలెట్లు, టెస్టింగ్ సెంటర్లు, ఇతర సాధారణ వసతులు ఉంటాయని, వ్యాపార అభివృద్ధి,ఉత్పత్తి ఆవిష్కరణ, మార్కెట్ వ్యూహం వంటి సేవలు అందుబాటులో ఉంటాయని వారు వివరించారు. మహిళా ప్రాధాన్యత గల సంస్థలకు ప్రోత్సాహంగా స్త్రీనిధి పథకం ద్వారా రుణాల మద్దతు కూడా ఇవ్వనున్నామని, తద్వారా మహిళల ఆధ్వర్యంలోని సంస్థలు బలోపేతం కావడంతో పాటు, జీవనోపాధి అవకాశాలు విస్తరించనున్నాయని తెలిపారు.

## గుండెపోటుతో చింతామణి మృతి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ రాష్ట్ర కార్యాలయ మాజీ కార్యదర్శి, దివంగత డి.ఎస్. రాం చందర్ రావు కుమారుడు డి.ఎస్.చింతామణి బుధవారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించారు. చింతామణికి ఇద్దరు సోదరులు డి.ఎస్. నారాయణ, డి.ఎస్.రవి ఉన్నారు. అయితే వారు ఇరువురు విదేశాలలో స్థిరపడ్డారు. అంబర్‌పేట్ శ్మశాన వాటికలో చింతామణి అంత్యక్రియలను సిపిఐ నాయకులు నిర్వహించారు. అంత్యక్రియలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి.నరసింహ, నాయకులు ప్రేమ్ పావని, డాక్టర్ రజని, బి.వెంకటేశం, ఛాయాదేవి, స్టాలిన్, సి.ఆర్.ఫౌండేషన్ కార్యదర్శి చెన్న కేశవరావు హాజరయ్యారు. వారే దగ్గరుండి అత్యక్రియలు జరిపించారు. కొద్దికాలం క్రితమే రాంచందర్ రావు మృతిచెందడం, కొద్దినెలలకే చింతామణి మరణించడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చింతామణి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## ఇప్పటివరకూ రావాల్సిన యూరియా మొత్తాన్ని కేంద్రం సరఫరా చేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి ఏప్రిల్ నుండి జులై వరకు రావాల్సిన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని, ఈ యూరియా మొత్తాన్ని ప్రస్తుత నెల (ఆగస్టు) కేటాయింపులతో కలిపి వెంటనే సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కేంద్ర మంత్రులను కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ఆలస్య మైతే రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నదని ఆయన కేంద్ర మంత్రి నడ్డా దృష్టికి తీసుకెళ్లారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్,నడ్డాలను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం కలిసి తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారం రావాల్సిన యూరియాను వెంటనే సరఫరా చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత నెలకు (ఆగస్టు) రాష్ట్రానికి కేటాయించిన 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తక్షణమే సరఫరా చేయాలన్నారు. క్రూడ్ పామాయిల్‌పైన దిగుమతి సుంకాన్ని మార్చి 2018సంవత్సరం తరహాలోనే 44 శాతానికి పెంచాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతరామన్‌ను కోరారు. క్రూడ్ పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుండి 16.5 శాతం తగ్గించడంతో ఆయిల్ పామ్ గెలల ధర తగ్గడంతో పాటు , ఇది ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సహకానికి అడ్డంకిగా మారుతుందని తుమ్మల వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత పథకమైన ఎన్ఎంఇఒఒపి పథకంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆయిల్ ప్లాంటేషన్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు చేస్తున్న కార్యక్రమాలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. కేంద్ర మంత్రులను కలిసిన వారిలో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.



## ఎసిబి వలలో జగిత్యాల జిల్లా రవాణాశాఖ అధికారి

### రూ.22వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిటిఒ



**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల మండలం తాటిపల్లిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం పై ఎసిబి అధికారుల దాడులు నిర్వహించగా లంచం తీసుకుంటూ డిటిఒ పట్టుబడ్డారు. జగిత్యాల జిల్లా అవినీతి నిరోధక అధికారులకు బుధవారం పట్టుబడ్డారు. పట్టుకున్న జేసిబీ విడిపించేందుకు శశిధర్ అనే వ్యక్తి డీటివో భద్రునాయక్ ను కలువగా ఆయన డబ్బులు డిమాండ్ చేశారని శశిధర్ తెలిపారు. అయితే ఈ విషయాన్ని శశిధర్ ఏసీబి అధికారులను సంప్రదించగా వారి సూచనల మేరకు శశిధర్ డిటివోకు 22000 వేలు లంచం తీసుకుంటుండగా రవాణాశాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయము :: కరీంనగర్**
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
నెం. E1/DB/MCK/8201/220/MCK/2025-26, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ రీకాల్ టెండర్ ప్రకటన తేది: 05.08.2025
మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద రూ. 91.00 లక్షల అంచనా వ్యయంతో అవెన్యూ ప్లాంటేషన్ & మీడియన్ ప్లాంటేషన్‌లో 08 గుంతలు వేయడం మరియు తోటల పెంపకం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 06.08.2025న సా.04.00గం.లకు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది: 12.08.2025న సా.04.00గం.ల వరకు. మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్.
DIPR R.O. No. : 6114-PP/CL/ADVT/1/2025-26, Date: 06-08-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఫలక్‌నుమా సర్కిల్-10, చార్మినార్ జోన్.
NIT No. 32/EE-10/CHMRZ/GHMC/2025 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 05.08.2025
పని పేరు: జహనుమా వార్డ్ 54 లోని హర్మైన్ బేకరీ నుండి ఖిజ్రా హోటల్ వరకు బిటి రోడ్డు రీకార్పెటింగ్ (అన్ని ఎస్సీ వ్యక్తులు / యాజమాన్య సంస్థలకు రిజర్వ్ చేయబడింది), అంచనా విలువ: రూ.49.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 07.08.2025న సా.04.30గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 12.08.2025న మ.03.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎం. వెంకటేశ్వర్లు, ఫలక్‌నుమా సర్కిల్-10, సిహెచ్ఎంఆర్‌జెడ్, ఫూల్‌బాగ్, చాంద్రాయణగుట్ట, హైదరాబాద్. ఫోన్ నెం. 9989930389. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఫలక్‌నుమా సర్కిల్-10, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 6156-PP/CL/ADVT/1/2025-26, Date: 06-08-2025

## ప్రజలు ప్రపంచ శాంతిని కోరుకుంటున్నారు: ఎఐపిఎస్ఒ నేత కెవిఎల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హిరోషిమా, నాగసాకిపై అణుబాంబు దాడి నేపథ్యంలో ప్రజలు ప్రపంచ శాంతిని కోరుకుంటున్నారని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్ఒ) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అన్నారు. ఎఐపిఎస్ఒ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్‌లో స్కూల్ ఇంచార్జ్ కీర్తి ప్రసన్న అధ్యక్షతన బుధవారం 'హిరోషిమా డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కెవిఎల్ మాట్లాడుతూ అణుబాంబుల ఫలితంగా హిరోషిమా, నాగసాకి పట్టణాలలో, లక్ష నలభై వేలకు పైగా ప్రజలంతా మృత్యువాత పడ్డారని వేలాదిమంది ప్రజలు రేడియేషన్‌తో తీవ్రమైన జబ్బులకు గురయ్యారని తెలియజేశారు. హిరోషిమా పట్టణంపై యురేనియంతో నిండిన అణుబాంబును లిటిల్ బాయ్ పేరుతో, నాగసాకి పట్టణంపై ప్లాటినంతో నిండిన బాంబును ఫ్యాట్ మ్యాన్ పేరుతో ప్రయోగించడం వలన రెండు పట్టణాలతో పాటుగా ప్రజా జీవితం నాగరికత పారిశ్రామిక ప్రాంతాలు విద్యాలయాలు, వైద్యశాలలు, నౌక కేంద్రాలు, ఆర్మీ స్థావరాలు, దేవాలయాలు, మాన వ భవిష్యత్తు, తీవ్రంగా దెబ్బతిన్నదని తిరిగి కోలుకోవటానికి జపాన్‌కు చాలాకాలం పట్టిందని, ఆ అనుభవాల నుండి జపాన్ ప్రజలంతా పీస్ మెమోరియల్ పార్కును ఏర్పాటు చేసుకొని ప్రపంచంలో శాంతి వెల్లి విరియాలని కోరుకుంటున్నారని, సామ్రాజ్యవాదానికి, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని ఆశిస్తున్నారని పేర్కొన్నారు. ఎఐపిఎస్ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలంతా రాజకీయాల కతీతంగా యుద్ధాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎఐపిఎస్ఒ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ సమత మాట్లాడుతూ యుద్ధ పరికరాలకు ఇచ్చిన ప్రాధాన్యతను విద్యను అభివృద్ధి చేయడానికి ఇవ్వడం లేదని తక్షణమే విద్యకు ఎక్కువ బడ్జెట్ ను కేటాయించాలని ప్రజల చైతన్యంతోనే యుద్ధాలను ఆపగలుగుతామని అన్నారు. హైదరాబాద్ జిల్లా శాంతి సంఘీభావ సంగం కార్యదర్శి జె. కే. శ్రీనివాస్ మాట్లాడుతూ అఖిల భారత శాంతి సంఘీభావ సంగం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం నింపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, 15 మంది విద్యార్థు లు యుద్ధాల వల్ల జరిగినటువంటి దుష్పరిణామాల గురించి వివరించారు. ప్రపంచ శాంతి కోసం ఉద్యమిస్తామని ప్రతిజ్ఞ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈ భావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ రచించిన 'సామ్రాజ్య వాదంపై విజయపతాక క్యూబన్ ఫైవ్ వీరులు' అనే పుస్తకాలను విద్యార్థులకు బహూకరించారు.

## అప్పులబాధతో యువరైతు ఆత్మహత్య

**ప్రజాపక్షం/చింతపల్లి :** అప్పుల బాధతాళలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వింజమూరు గ్రామానిక చెందిన బీనమోని రాములు కుమారుడు బీనమోని మహేందర్ (33) గత కొంత కాలంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నాడు. పండించిన పంట సరిగ్గా దిగుబడి రాకపోవడంతో అప్పులు ఎక్కువయి, మనస్థాపానికి గురయి జూలై 25న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న మహేందర్ మంగళవారం మృతి చెందాడు. కాగా మృతుడికి భార్య నవ్య, కూతురు రిషిత, కుమారుడు రితిక్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమర్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య, తల్లి, చిన్నారులు రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.



## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో నిర్వహించిన లిటిల్ ఛాంపియన్ క్రికెట్ పోటీలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బుధవారం ఫైనల్‌కు చేరుకోని విజయం సాధించి ట్రోఫిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం అలవరుడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మానాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కుర్ర కృష్ణకాంత్‌నాయక్, స్వామి, ఉపేందర్, ముంతాజ్‌బేగం, తావుర్యా, అనిత, జ్యోతి పాల్గొన్నారు.





## ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతరావును కలిసిన సిపిఐ బృందం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంత రావును కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావును సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా బృందం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలకే అందే విధంగా చూడాలని హనుమంత రావుని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, ఏశాల అశోక్, కురిమిద్ద శ్రీనివాస్, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, మండల కార్యదర్శులు అన్నేమైన వెంకటేష్, దాసరి లక్ష్మ య్య, లక్ష్మి పతి తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/యాదాద్రి :** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. బుధవారం మినీ మీటింగ్ హాల్‌లో అన్ని శాఖల అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్ల పైవివిధ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ఆయా శాఖల వారీగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, భువనగిరి ఆర్డిఓ కృష్ణా రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామలింగం, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## దొడ్డ పద్మ సేవలు చిరస్మరణీయం

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు కామ్రేడ్ దొడ్డ పద్మ సిపిఐ పార్టీకి,ప్రజలకు సేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో దొడ్డ పద్మకు సంతాపం తెలియజేశారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘననివాళులు అర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన వీరనారి దొడ్డ పద్మ అని కొనియాడారు. అంతేకాక సిపిఐ పార్టీ అభ్యున్నతికై ఆమె చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆమె చేసిన ఉద్యమాలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,ధూళిపాల ధనుంజయ్ నాయుడు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,దేవరం మల్లీశ్వరీ,పోకల వెంకటేశ్వర్లు,యల్లావుల రమేష్,కందుల వెంకటేశ్వర్లు,ముండ్ల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య మరణం సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బి.అయోధ్య మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో అయోధ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ బుధవారం ఉదయం సూర్యాపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ అయోధ్య మృతి చెందడం అత్యంత బాధాకర మని అన్నారు. అయన మరణం ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్ర సిపిఐ పార్టీకి ప్రజలకు తీరని లోటు అన్నారు. సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా పక్షాన సంతాపాన్ని తెలియజేసి, అయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, ఏశాల అశోక్, చిగుర్ల లింగం, మండల కార్యదర్శులు అన్నేమైన వెంకటేష్, దాసరి లక్ష్మ య్య, నాయకులు లక్ష్మీ పతి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తం

**ప్రజాపక్షం/డిండి:** సైబర్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలని డిండి ఎస్ఐ సిహెచ్. బాలకృష్ణ తెలిపారు. బుదవారం డిండి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన సైబర్ మోసాల పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తమ తల్లిదండ్రులకు సైతం విద్యార్థులు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎలమంచలి శిరీష, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఉచితం

### సన్నబియ్యం, రేషన్‌కార్డులు పంపిణీ మన జిల్లా నుండి ప్రారంభించడం అదృష్టం

### కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట(ఆత్మకూర్ ఎస్):** రాష్ట్ర వ్యాప్తంగా హుజూర్‌నగర్ నుండి సన్నబియ్యం పంపిణీ, తిరుమలగిరి నుండి నూతన రేషన్‌కార్డుల పంపిణీ చేయడం మన జిల్లా అదృష్టమని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. బుధవారం ఆత్మకూర్ ఎస్ మండలం నెమ్మికల్ లోని రామయ్య ఫంక్షన్‌హాల్‌లో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డితో కలిసి ఆత్మకూర్ ఎస్ మండలంకు చెందిన వారికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మకూర్ ఎస్ మండలంలో 704 నూతన కార్డుల ద్వారా 2239 మందిని అదనంగా చేర్చి కొత్తగా అవకాశం కల్పించడం జరిగిందని, 1030 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు అయ్యాయని అన్నారు. రేషన్‌కార్డులు రాని వారు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరంలేదని, కొత్తకార్డు కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. అర్హత ఉంటే తహసిల్దార్ పరిశీలన చేసి పౌర సరఫరాల శాఖ ద్వారా కార్డు మంజూరు చేస్తారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందన్నారు. సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికి నూతన రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇవ్వడం, ఇల్లులు ఇవ్వడం అభినందనీయమని, ఇండ్లు త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశానికి ఆహ్వానించాలని లబ్ధిదారులకు సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేశాక అన్ని అమలు చేయాలని సూచించారు. సూర్యాపేట మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ ఆత్మకూర్ ఎస్ మండలంలో 1030 ఇందిరమ్మ ఇండ్లు అలాగే 704 నూతన రేషన్‌కార్డులకు మంజూరు పత్రాలు ఈ రోజు ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవరావు, పిఎసిఎస్ చైర్మన్ సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌నాయక్, డిఎస్వో మోహన్‌బాబు, హౌజింగ్ పిడి సిద్దార్థ, తహసిల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో మహ్మాద్ హాసీం, మార్కెటింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



## కాంగ్రెస్- బిఆర్ఎస్ నేతల మధ్య రసాభాస

**ప్రజాపక్షం/సూర్యాపేట(ఆత్మకూర్ ఎస్):** ఆత్మకూర్ ఎస్ మండలంలోని నెమ్మికల్ గ్రామంలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల బుధవారం పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మధ్య రసబస జరిగింది. మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జగదీష్‌రెడ్డి పంపిణీ కార్యక్రమంలో ప్రసంగిస్తూ మాజీ సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాల ద్వారానే ఆత్మకూర్ ఎస్ మండలం ఎంతో అభివృద్ధి చెందిందని, కాళేశ్వరం ద్వారా పంటసాగుకు గోదావరి జలాలు ఇవ్వడంతో రైతులు రికార్డు స్థాయిలో ధాన్యం పండిస్తున్నారని చెప్పుకోచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చిన ఇండ్లు పూర్తయితే ఎన్ని సంవత్సరాలకో అంటూ హేళనగా మాట్లాడటంతో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు కాస్త కునేశ్వరం అయ్యిందని, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి ద్వారానే శ్రీరాం సాగర్ రెండో దశ జలాలు సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు ఇచ్చిందని చెప్పారు. ఈక్రమంలో ఒకరినొకరు తోచుకున్నారు. పరిస్థితి ఉధృతంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దీంతో అందరు ఊపిరి పీల్చుకొగా లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను పంపిణీ చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని 20 శాతానికి తీసుకురావాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ(కేతేపల్లి):** ఈనెల 13 నాటికి నకిరేకల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని 20 శాతానికి తీసుకురావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె కేతేపల్లి ఎంపిడిఓ కార్యాలయంలో నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు, తహశీల్దార్లు,ఏపిఎంలతో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.నియోజక వర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి తక్కువ శాతం ఉన్న మండలాలు ఈ నెల 13 నాటికి కనీసం 20 శాతం పురోగతి తీసుకురావాలని చెప్పారు. పురోగతి తక్కువగా ఉండడానికి గల కారణాలను విశ్లేషించగా ఇసుక సమస్య ఉందని,ఎం పి డి వోలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఇసుక ,మెటల్, రా మెటీరియల్ సమస్యలు రాకుండా తహసిల్దార్లు పరిష్కరించాలని చెప్పారు. వన మహోత్సవం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ,భూభారతి దరఖాస్తులను కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డిలుఉన్నారు.

**అన్ని రకాల వైద్య సేవలను అందించాలి**

ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల ద్వారా అన్ని రకాల వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె మాన్యం చెల్క పట్టణ వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి,ఏ ఎన్ సి ,మందుల స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అలాగే టెస్టులు, ఇతర రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయా చికిత్సలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల జబ్బులు, చికిత్స , రెఫరల్ వివరాలు అడిగారు.అనంతరం పక్కనే నిర్మిస్తున్న మాన్యం చెల్క యుపిహెచ్‌సి నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించి భవన నిర్మాణం పనులు పూర్తయినందున ఇతర పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పుర కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్,మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలుఉన్నారు.

## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువగా విద్యావంతులే సైబర్ నేరగాళ్లు బారిన పడి అనేక మోసాలకు గురవుతున్న తరుణంలో వారి బారిన పడకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడమే ఉత్తమ మార్గం అని సైబర్ క్రైమ్ డిఎస్పి లక్ష్మీనారాయణ అన్నారు.జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ఆడిషనల్ ఎస్పి రమేష్, సైబర్ క్రైమ్ డిఎస్పి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సైబర్ జాగారుకత దివాస్ సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణం పోలీసు ఆడిటోరియం లో ప్రగతి కళాశాల విద్యార్థుల కు, సైబర్ అవేర్నెస్ గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సైబర్ మోసాలు నిరోధించవచ్చునని, సైబర్ నేరగాళ్లు ప్రజలనూ మోసం చేస్తున్న విధానాన్ని కళాశాల యువతకు తెలియజేశారు. నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి సైబర్ క్రైమ్ ఎస్ఐ విష్ణు,టూటౌన్ ఎస్ఐ సైదులు, సైబర్ క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ రియాజ్, కానిస్టేబుల్ మోక్షిడ్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పేదేడు పేదోడిగానే ఉన్నాడు

### జగదీష్‌రెడ్డి డబ్బుతో గెలిచాడు తప్ప ప్రజా నాయకుడు కాదు

### ఎస్ఆర్ఎస్పి నీళ్లు తెచ్చిన ఘనత ముమ్మాటికి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిదే : వేణారెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్ ఎస్):** పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పేదోడు, పేదోడుగానే ఉన్నారని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బిఆర్ఎస్ వాళ్లు లక్షల కోట్లు పంచుకున్నారని ప్రజలకు చేసిందేమి లేదని వారు గొప్పలు చేపుకునేందుకు ఇది రాజకీయ వేదిక కాదని అన్నారు. జగదీష్‌రెడ్డి డబ్బుతో గెలిచాడు తప్ప ప్రజా నాయకుడు కాదని విమర్శించారు. వందలమంది ప్రాణాలు బలితీసుకుని లక్షలు దోచుకున్నారని, బిఆర్ఎస్ నేతలపై విరుచకపడ్డారు. ఎస్ఆర్ఎస్పి ద్వారా ఆత్మకూర్ ఎస్ మండలంతో పాటు మండలానికి గోదావరి జలాలు తెచ్చిన ఘనత ముమ్మాటికి మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిదేనని చెప్పారు. బుధవారం ఆయన ఆత్మకూర్ ఎస్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పంపిణీ కార్యక్రమానికి హాజరైన మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి తమ ప్రభుత్వ హాయంలోనే పేదలకు మేలు జరిగిందని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించామని, గోదావరి జలాలు అందించడంతో నేడు రైతులు అత్యధికంగా ధాన్యాన్ని పండించారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు పట్టాలు ఇచ్చిన నిర్మాణం పూర్తిచేసి పేదలు ఇండ్లలోకి ఎన్నోళ్లకు పోతారో అంటూ హేళనగా మాట్లాడటంపై మండిపడ్డారు. ఆత్మకూర్ ఎస్ మండలంలో 700 మందికి ఇండ్లు ఇచ్చామని, త్వరలోనే మరిన్ని నిర్మాణాలు మొదలవుతాయని అన్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఇలాంటి అవాక్కులు, చవక్కులు పేలితే మరోసారి నియోజకవర్గంలో తిరగనియ్యబోమని హెచ్చరించారు. కొద్ది రోజుల్లో కాళేశ్వరం తుది నివేదికపై అసెంబ్లీలో చర్చ సాగుతుందని అప్పుడు దొంగలు ఎవరో, దొరలు ఎవరో ప్రజలకు తెలుస్తుందని అన్నారు.

## బనకచర్లకోసమే కాళేశ్వరం ఎండబెట్టిండ్రు

### మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట(ఆత్మకూర్ ఎస్):** బనకచర్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టింద్రు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఈ కుట్ర ముమ్మాటికి చంద్రబాబుదేనని సిఎం రేవంత్‌రెడ్డి ఆయన చేతిలో కీలుబొమ్మగా మారి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాడని అరోపించారు. బుధవారం ఆత్మకూర్ ఎస్ మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం జరిగిందని అందులో రెండు ఫిల్లర్లు కుంగిపోతే బాగు చేయకుండా వ్యవసాయానికి నీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ రైతులను మోసం చేస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం వేసిక కమిషన్ కాంగ్రెస్ కమిషన్ అని అంతా తప్పడు రిపోర్టు అంటూ ఆరోపించారు. బిజేపి కాంగ్రెస్ చంద్రబాబు ప్రోత్సాళంతో రిపోర్టును తయారు చేయడం జరిగిందన్నారు. రెండేళ్లుగా చెప్పిందే చెబుతున్న కాంగ్రెస్ నాయకులు కెసిఆర్‌పై ఏడ్పు తప్ప ఒరగపెట్టిందేమిలేదన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసిన తమ నేత కెసిఆర్‌ను ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్ ముందుచూపు పాలనే తెలంగాణలో నేడు అద్భుత ఫలితాలు వస్తున్నాయని అన్నారు. కాళేశ్వరమే తెలంగాణకు జీవనాధారమని చెప్పారు. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారంతో కాలం వెల్లబుచ్చడం సరికాదని కాంగ్రెస్ నేతలకు హితవు పలికారు. మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు కాళేశ్వరంపై చేసిన పవర్ ప్రజంటేషన్‌లో నిజాలన్ని చెప్పడం జరిగిందన్నారు. వలస మోసాలతో కాంగ్రెస్ రికార్డులు సృష్టిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల స్టంట్‌లో భాగమే బిఆర్ఎస్ తప్పుడు ఆరోఫణలు అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికి, ప్రధాని మోడి, ఎపి సిఎం చంద్రబాబు చేతిలో కీలుబొమ్మేనని విమర్శించారు. తెలంగాణ నీళ్లను బనకచర్ల రూపంలో దోచిపెట్టే కుట్ర జరగుతుందని అన్నారు. చిల్లర మాటలు మానుకొని పాలనపై దృష్టి సారించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరా రు. ఎప్పటికైనా కెసిఆర్ తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు.

# భూభారతి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

### కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్





**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** భూభారతి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నందు అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి జిల్లాలోని ఆర్డీవో, తహసిల్దార్ వెబ్ ఎక్స్ సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూభారతి రెవిన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన అర్జిలను త్వరగా పరిష్కరించాలని, వీలైనంత ఎక్కువ సిబ్బందిని వినియోగించుకుని ప్రతి గ్రామాన్ని సందర్శించి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరిష్కరించాలని, ఒక గ్రామంలో పూర్తిగా దరఖాస్తుల పరిశీలన పూర్తయిన పిదప మరోక గ్రామానికి వెళ్లాలని ఆ విధంగా ఆర్డీవోలు అందరూ సంబంధిత తహసిల్దార్‌లకు దిశా నిర్దేశం చేయాలని, అవసరం అయితే పై స్థాయి సిబ్బందిని కూడా వినియోగించుకుని ఉదయం, సాయంత్రం సమయం కేటాయించుకుని పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని, అసైన్మెంట్ ల్యాండ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ణయం తీసుకోవాలని, ప్రతిరోజు సంబంధిత తహసిల్దార్లు ఆ రోజు జరిగిన దరఖాస్తుల వివరాలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఫుడ్ కమిషన్ చైర్మన్, మెంబర్లు గురువారం సూర్యాపేట జిల్లా సందర్శించిన సందర్భంగా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ కమిషన్ జిల్లా సందర్శన సందర్భంగా సంక్షేమ అధికారులు వారితో కలిసి సంక్షేమ హస్టల్స్‌ను, రెసిడెన్సియల్ హస్టల్స్‌ను సందర్శించి ఫుడ్ మెను వివరాలను వారికి వివరించాలని, అలాగే సాయంత్రం జరిగే ఫుడ్ కమిషన్ సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, సంక్షేమ హాస్టల్స్, వార్డెన్స్, ఎంఈవోలను, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ల సమావేశానికి హాజరు అయ్యేటట్లు చూడాలని సంక్షేమ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో డిఈవోఅశోక్, డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, ఎస్సీ కార్పోరేషన్ ఈడి, స్త్రీ శిశు సంక్షేమ వయోవృద్దుల శాఖ ఇన్‌ఛార్జి అధికారి దయానందరాణి, ఎస్టీ అభివృద్ధి అధికారి శ్రీనివాసనాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణ పథకంపై రాయితీ పనిముట్లు

**ప్రజాపక్షం/చండూరు:** వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 2025/26 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ యాంత్రికరణ పై సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానిజన్ పథకం ద్వార రాయితీపై వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం జరిగిందని అన్నారు. చండూరు మండలంలో 355 యూనిట్లు రాయితీపై ఇవ్వనున్నారని మండల వ్యవసాయాధికారి చంద్రిక ఓ ప్రకటనలో తెతలిపారు. అందులో బ్యాటరీ స్ప్రేయర్లు 275 యూనిట్లు , తైవాన్స్ ప్రేయర్లు 35, రోటవేటర్లు 16 ,సేల్ఫ్ ప్రొఫిల్డ్ ఎక్విప్‌మెంట్ 6, హార్వేస్టింగ్ ఎక్విప్‌మెంట్ 4, ట్రాక్టర్ డ్రోన్ 20 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పై యూనిట్లకు ఆసక్తిగలవారు అగస్టు 5నుండి 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తూ ఫారంతో పాటు రైతు పట్టాదారు భూమి పాస్ పుస్తకం జీరాక్స్, పట్టాదారు ఆధార్ కార్డు జీరాక్స్ , మూడు పాస్ ఫోటోలు ,( ట్రాక్టర్ సంబంధిత పని ముట్లుకు ట్రాక్టర్ ఆర్‌సి) తో ఆయా గ్రామాల ఏఇఓ కు దరఖాస్తు అందజేయాలని వ్యవసాధికారి చంద్రిక ఓ ప్రకటనలో తెలిపారు

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలుంటాయని దేవరకొండ సిఐ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం తాటికోల్ గ్రామ వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న తాటికోల్ గ్రామానికి చెందిన జూలూరు అనిల్‌కు సంబందించిన ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు సిఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## అదుపుతప్పి నదిలో పడిన కారు... ముగ్గురి మృతి

**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం సిమ్లాలో ఓ కారు అదుపుతప్పి నదిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల వివరాల ప్రకారం... చిర్గావ్ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు అదుపు తప్పి పబ్బర్ నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురిలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా... ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను విశాల్ ఠాకూర్, అభ్య కందియాన్, హిమాన్షుగాను, గాయపడిన వ్యక్తిని హర్ష్ చౌహాన్‌గా గుర్తించారు. నది నుంచి మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అదానీపై విచారణ జరుగుతున్నందువల్లే ట్రంప్ టారిఫ్ బెదిరింపులపై మోదీ మౌనం

ఈ విషయాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలి : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారత్‌పై గణనీయంగా టారిఫ్‌లు పెంచుతానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. వీటిపై ప్రధాని మోదీ మౌనంగా ఉండటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. ఈసందర్భంగా మోదీ చేతులు కట్టేశారంటూ ఎద్దేవా చేశారు. అమెరికాలో అదానీపై విచారణ జరుగుతుంది కాబట్టి.. టారిఫ్‌లపై ట్రంప్ పదేపదే బెదిరింపులకు పాల్పడినా మోదీ మౌనంగా ఉండిపోయారని రాహుల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ విషయాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. మోదీ, ఏఏ (అదానీ, అంబానీలను ఉద్దేశిస్తూ), రష్యా చమురు ఒప్పందాల ఆర్థిక వ్యవహారాలు బయటపడతాయని వ్యాఖ్యానించారు. మోదీ చేతులు కట్టేశారంటూ విమర్శించారు. రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తుండటంతో భారత్‌పై ట్రంప్ మండిపడుతున్నారు. ఇప్పటికే 25శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈక్రమంలోనే భారత్ మంచి భాగస్వామి కాదంటూ టారిఫ్‌లను గణనీయంగా పెంచుతానని మరోసారి హెచ్చరికలు చేశారు. అయితే, ఆయన వ్యాఖ్యలను భారత్ తిప్పికొట్టింది. అమెరికా కూడా మాస్కో నుంచి దిగుమతులు చేసుకుంటున్న విషయాన్ని గుర్తుచేసింది. రసాయనాలు, ఎరువులు వంటివి కొనుగోలు చేస్తోందని దుయ్యబట్టింది. అలాంటప్పుడు భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం అసంబద్ధం అని స్పష్టం చేసింది. మరోవైపు.. ట్రంప్ హెచ్చరికలపై మోదీ స్పందించకపోవడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్‌తో మోదీ కౌగిలింతల దౌత్యం కుప్పకూలిందంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

**పరువు నష్టం వ్యాఖ్యల కేసులో రాహుల్‌కు బెయిల్**

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారనే కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు ఝార్ఖండ్‌లోని ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీ స్వయంగా చాయిబాసా కోర్టు ముందు బుధవారంనాడు హాజరయ్యారు. దీనికి ముందు, రాహుల్ గాంధీ కోర్టుకు హాజరవుతున్న నేపథ్యంలో కోర్టు చుట్టూ భద్రతను పెంచారు. శాంతిభద్రతల దృష్ట్యా ఉంచుకుని స్థానిక యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసింది. రాంచీ నుంచి చాయిబాసాకు రాహుల్ హెలికాప్టర్‌లో వచ్చారు. ఇందు కోసం టాటా కాలేజ్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రాహుల్ మంగళవారంనాడు రాష్ట్రానికి వచ్చారు. రాహుల్ గాంధీ 2018లో జరిగిన ఒక ర్యాలీలో అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి పరువు నష్టం కేసు వేశారు. జూన్ 26న ప్రత్యేక కోర్టు ముందు రాహుల్ హాజరు కావాల్సి ఉండగా ఆయన తరపు న్యాయవాది తన క్లయింట్ ఆరోజు హాజరుకాలేరని, 6వ తేదీని హాజరయ్యేందుకు వీలు కల్పించాలని కోర్టును కోరారు.

# సగం ధారాలీ భూస్థాపితం

మెరుపు వరదల్లో 28 మంది కేరళ బృందం గల్లంతు
తెలియని 11 మంది సైనికుల జాడ
150మందిని కాపాడిన సహాయబృందాలు
డజన్లమంది ఇంకా శిథిలాల్లోనే...
రెండు మృతదేహాలు స్వాధీనం




**ఉత్తరకాశీ:** ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలో మేఘాలు విరుచుకుపడి సృష్టించిన వరద విధ్వంసంవల్ల పర్వతగ్రామం 'ధారాలీ' సగానికి సగం బురదమట్టిలో భూస్థాపితమైంది. ఆటంకాలు ఎదుర్కొంటూ సైనికులు, ఇతర బృందాలు బుధవారం కూడా సహాయ చర్యలు కొనసాగించాయి. అధికారిక సమాచారం ప్రకారం, మొత్తంగా నలుగురు మరణించారు. మరో 50 మంది జాడ తెలియడంలేదు. 150 మందిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. గంగోత్రి వెళ్ళేందుకు కేరళ నుండి వచ్చిన 28 మందితో కూడిన బృందం జాడ తెలియకుండా పోయింది. ఆ సమీపప్రాంతంలోని సైనికుల శిబిరంలో ఉన్న 11 మంది సైనికుల జాడ కూడా ఇంతవరకూ తెలియ లేదు. డజన్లసంఖ్యలో ప్రజలు ఇప్పటికీ శిథిలాల్లోనే చిక్కుకుని ఉన్నారు. సైన్యం, ఐటిబిపి, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నాయి. రుద్రప్రయాగలో మందాకినీ, హరిద్వార్‌లో బాన్‌గంగా, దేవ్‌ప్రయాగ్‌లో భాగీరథి వంటి ప్రధాన నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి.

గంగోత్రి వెళ్ళాలంటే ఎవరికైనా ధారాలీ గ్రామమే ప్రధానకేంద్రం. అందరూ అక్కడినుండి బయలుదేరతారు. అనేకమైన హోటళ్ళకు, యాత్రికులకు అద్దెలకు ఇచ్చే ఇళ్ళకు ఈ గ్రామమే కీలక ప్రదేశం. ఈ గ్రామంలో అసంఖ్యాకంగా యాత్రికులకు సదుపాయాలు ఉంటా యి. కానీ శరవేగంగా వచ్చి మీద పడిన వరదజలప్రవాహంతోపాటు కొట్టుకువచ్చిన మట్టి, బురదలో సగానికిసగం ధారాలీ గ్రామం భూస్థాపితమైంది. డెహ్రాడూన్‌కు 140 కి.మీ దూరంలో ఉన్న ధారాలీకి నాలుగు గంటల్లో ప్రయాణం చేసి వెళ్ళే సౌకర్యం ఉంది. కానీ ఇప్పుడు ధారాలీలో ఈ దారిని అనుసంధానం చేసే ప్రధాన రహదారి ధ్వంసమైంది. దీంతో రెండు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను హెలికాప్టర్ ద్వారా ధారాలీకి తరలించేందుకు యత్నిస్తున్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో వారు వెళ్ళలేక పోతున్నారని ఎన్‌డిఆర్‌ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆపరేషన్స్ మోహ్సెన్ షాహేది చెప్పారు. రుషీకేష్ – ఉత్తరకాశీ జాతీయ రహదారిలో ఎడతెగకుండా కొండచరియలు, బండరాళ్ళు కింద పడి ఉండటంతో ఆ దారి మూసుకుపోయింది. అనేకచోట్ల గంగోత్రి జాతీయ రహదారి మూసుకుపోవడంతో 200 మందికిపైగా సహాయబృందాలు ఈ మార్గాన్ని శుభ్రం చేసేందుకు భట్వారీ వద్ద సిద్ధంగా ఉండి సమయంకోసం ఎదురుచూస్తున్నాయి. గంగోత్రి జాతీయ రహదారిలో లిమాచా నదిపై నిర్మించిన వంతెన వరదల్లో కొట్టుకుపోయింది. దీంతో ధారాలీ వెళ్ళే మార్గంలో ఉన్న సహాయబృందాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఉత్తరకాశీజిల్లాలో పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు తనకు సమాచారం తెలియజేస్తూ ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీకి ఆదేశించారు. తాజా పరిస్థితిని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ధారాలీ, హార్సిల్ ప్రాంతాలలో వరద పరిస్థితిని హెలికాప్టర్ ద్వారా ఆయన పరిశీలించారు. అందరికీ మెడిసిన్స్, ఆహారం అందజేసేందుకు, రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేశామని, నోడల్ అధికారులను నియమించామని ముఖ్యమంత్రి చెప్పారు. సైన్యం, ప్రభుత్వ అధికారులు, ఏజన్సీలు సమన్వయంతో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాయని చెప్పారు. దారిమధ్యలో నిలిచిపోయినవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సైన్యం ఎంఐ–17, చినోక్ హెలికాప్టర్లను రంగంలోకి దించింది.

కేరళనుండి వచ్చిన బృందం మంగళవారంనాడు ఉదయం 8.30 గంటలకు ఉత్తరకాశీ నుండి బయలుదేరింది. అదే రోజు మధ్యాహ్నం మేఘాలు విరుచుకుపడటంతో ప్రకృతి విధ్వంసం ప్రారంభమైంది. వారు వెళ్ళినమార్గంలోనే కొండచరియలు విరిగిపడ్డాయి. హరిద్వార్‌లోని ట్రావెల్ ఏజన్సీ వీరిని పదిరోజులపాటు ఉత్తరాఖండ్ పర్యటనకు తీసుకువచ్చింది. ఈ బృందం ఉత్తరకాశీలో బయలుదేరిన తర్వాత వారితో సంబంధాలు తెగిపోయాయని, ఫోన్‌లో అందుబాటులోకి రావడంలేదని వారి తరపు బంధువు ఒకరు చెప్పారు. అదేవిధంగా మరో యాత్రికుడు పిటిఐ వీడియోస్‌తో మాట్లాడుతూ, మంగళవారం మధ్యాహ్నం నుండి తన కుటుంబం, తన సోదరుడు కనిపించడంలేదని, కానీ వాతావరణం అనుకూలిస్తే గురువారం నాటికి మీ బంధువులను హెలికాప్టర్ ను రంగంలోకి దించి సురక్షితంగా తీసుకువస్తామని ముఖ్యమంత్రి తనకు హామీ ఇచ్చారని చెప్పారు. వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. సహాయ చర్యల్లో భాగంగా రెండు మృతదేహాలను వెలికితీశారు. జలప్రళయం సృష్టించిన వినాశనంవల్ల సైన్యానికి, ఇతర బృందాలకు సహాయ చర్యలు చేపట్టడంలో సవాళ్ళు ఎదురవుతున్నాయి. వరద బీభత్సం, కొండచరియలు విరిగిపడటంతో ధారాలీలో ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. డజన్లసంఖ్యలో ప్రజలు ఇంకా శిథిలాల్లోనే చిక్కుకుని ఉన్నారు.వారిని వెలికి తీసేందుకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. నడచివెళ్ళేందుకు దారులు లేవు. ఈ వరద వినాశనంవల్ల అనేక ఇళు, కార్లు జల ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఎన్నో ఇళ్ళు కూలిపోయాయి. సహాయబృందాలు స్వాధీనం చేసుకున్న రెండు మృతదేహాల్లో ఒకరిని 35 ఏళ్ళు వయసుగల ఆకాశ్ పన్వార్‌గా గుర్తించినట్లు ఉత్తరకాశీ ప్రకృతి వైపరీత్యా నియంత్రణ కేంద్రం ప్రకటించింది.

## ప్రతిపక్షాల డిమాండ్‌ను తిరస్కరించిన కేంద్రం



**న్యూఢిల్లీ :** పార్లమెంట్‌లో బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ(ఎస్‌ఐఆర్)పై చర్చ జరపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. ఈ అంశం న్యాయస్థానం ముందు ఉన్నందున సభలో చర్చించలేమని తెలిపింది. లోక్‌సభ బుధవారం రెండుసార్లు వాయిదా పడిన అనంతరం మధ్యా హ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభం కాగానే, ఎస్‌ఐఆర్‌పై చర్చ జరపాలని ప్రతిపక్ష పార్టీలు నిరసనలను కొనసాగించాయి. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ న్యాయస్థానంలో ఉన్న విషయాలను సభలో చర్చించడానికి లోక్‌సభ నిబంధనలు అనుమతించవని చెప్పారు. ఎన్నికల సంఘం వంటి స్వయంప్రతిపత్తి గల సంస్థల పనితీరును పార్లమెంటులో చర్చించలేమని ఆయన పేర్కొన్నారు. 1998లో లోక్‌సభ స్పీకర్ బలరామ్ జాఖ డ్ ఇచ్చిన రూలింగ్‌ను రిజిజు ఉటంకిస్తూ ప్రస్తుత రాజ్యాంగ నిబంధనల కింద, ఎన్నికల సంఘం చర్యలపై సభ వ్యాఖ్యానించలేలదని, ఎన్నికల సంఘం పనితీరుపై చర్చకు అనుమతించడం ద్వారా తాను నిబంధనలను ఉల్లంఘించలేనని ఝాకర్ అన్నారని తెలిపారు.

**మధ్యేమార్గంగా ప్రతిపక్షాల ప్రతిపాదన**

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)పై చర్చ జరపాలని డిమాండ్ చేయడంతో పార్లమెంటులో ఏర్పడిన ప్రతిష్టంభనకు 'మధ్యేమార్గం'గా 'ఎన్నికల సంస్కరణలపై' చర్చకు అనుమతించాలని ప్రభుత్వానికి ప్రతిపక్షాలు ఎంపిలు ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రభుత్వం ఇంకా ఈ ప్రతిపాదనపై స్పందించలేదని వారు బుధవారం తెలిపారు. అయితే, అధికార పక్షం ఇలాంటి చర్చకు అంగీకరించే అవకాశం లేదని ప్రభుత్వవర్గాలు సూచించాయి. కాగా, 1961లో రాజ్యసభలో ఎన్నికల నిర్వహణ నిబంధనల సవరణలపై చర్చ జరిగిందని, ఆ చర్చకు అప్పటి న్యాయ మంత్రి గోపాల్ స్వరూప్ పాఠక్ నాయకత్వం వహించారని లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ గౌరవ్‌గొగొయ్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. 1981లో ఎన్నికల చట్టాలను సమీక్షించడానికి ఒక పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలన్న తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపి మనుభాయ్ పటేల్ ప్రవేశపెట్టారని ఆయన గుర్తు చేశారు. '1991లో, ప్రస్తుత ఎన్నికల చట్టాలను సవరించాల్సిన ఆవశ్యకతపై రాజ్యసభలో చర్చ జరిగింది. 2015లో, ఎన్ఆర్‌ఐలకు ప్రాక్సీ, ఇ–పోస్టల్ ఓటింగ్‌పై రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ సావధాన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి న్యాయ మంత్రి డి.వి.సదానంద గౌడ ప్రతిపక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునేందుకు అంగీకరించారు' అని గొగొయ్ అన్నారు. 'ఇటీవల, 2019లో, ఎన్నికల సంస్కరణలపై స్వల్ప అవధి చర్చ జరిగింది. అందులో నాటి న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు. దీనికి చాలా ఉదాహరణలు ఉన్నాయి. ప్రభుత్వం చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న, అత్యవసరమైన ఎన్నికల సంస్కరణల చర్చ ను వాయిదా వేయకూడదు' అని ఆయన అన్నారు.

**ఆ బిల్లులను జెపిసికి పంపండి**

జాతీయ క్రీడా పాలన బిలు– 2025, జాతీయ డోపింగ్ వ్యతిరేక (సవరణ) బిలు–2025లను మరింత పరిశీలన కోసం పార్లమెంటు జాయింట్ కమిటీకి పంపాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రతిపక్ష ఎంపిలు కోరారు. ఈమేరకు స్పీకర్‌కు సంయుక్తంగా రాసిన లేఖలో జాతీయ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని సభలో పరిశీలన, ఆమోదం కోసం జాబితా చేయబడిన రెండు ముఖ్యమైన బిల్లులపై విస్తృత ఏకాభిప్రాయం అవసరమని ప్రతిపక్ష నాయకులు తెలిపారు. లేఖపై సంతకం చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు కె.సి.వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్, కె.సురేశ్, ఎన్సీపీఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, టిఎంసికి చెందిన కాకోలి ఘోష్ దస్తికార్, డిఎంకెకు చెందిన కనిమొళి, శివసేన (యుబిటి) అరవింద్ సావంత్, ఆర్ఎస్‌పికి చెందిన ఎన్.కె. ప్రేమ్‌చంద్రన్, విసికెకు చెందిన డి.రవికుమార్, ఎండిఎంకెకు చెందిన దురై వైకో, ఐయుఎంఎల్‌యుకు చెందిన ఇ.టి.మహమ్మద్ బషీర్ ఉన్నారు.

## హిమాచల్‌లో మెరుపు వరదలు

600 రహదారులపై స్తంభించిన రాకపోకలు
400 మంది యాత్రికులు సురక్షితం

**సిమ్లా :** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ వర్షాలకు పర్వత రాష్ట్రాలు అయిన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ఆకస్మిక వరదలు చుట్టుముడుతున్నాయి. నిన్న ఉత్తరకాశీ జిల్లాలో జలవిలయం బీభత్సం సృష్టించగా... హిమాచల్‌ప్రదేశ్‌లో మెరుపు వరదలు సంభవించాయి. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన టాంగ్లింగ్ ప్రాంతంలో కురిసిన వర్షం కారణంగా కిన్నౌర్ కైలాశ్ యాత్ర మార్గంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదల్లో వందలాది మంది యాత్రికులు పర్వత మార్గంలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఇండోటిబెటన్ బోర్డర్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టారు. రోప్‌వే సాయంతో దాదాపు 413 మంది యాత్రికులను రక్షించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. కాగా, రెండు రోజుల నుంచి హిమాచల్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో 600 కి పైగా రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కిన్నౌర్ కైలాశ్ యాత్రను నిలిపివేశారు. మండిమనాలి మధ్య ఐదు కొండచరియలు విరిగిపడటంతో చండీగఢ్‌మనాలి జాతీయ రహదారి (ఎన్‌హెచ్21) మూసుకుపోయింది. దీని వలన కులుమనాలికి ప్రయాణించే ప్రజలు 12 గంటలకు పైగా చిక్కుకుపోయారు. చాలా మంది తమ వాహనాల్లో రాత్రంతా గడిపారని ఒక ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. అనేక చోట్ల ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ కారణంగా దాదాపు 450 రోడ్లను అధికారులు మూసివేశారు. ముఖ్యంగా మండి జిల్లా అత్యంత ప్రభావితమైంది. ఇక్కడ దాదాపు 295 రోడ్లు మూసుకుపోయాయి. ఇక సిమ్లాలోని చక్కీమోర్ వద్ద కొండ చరియలు విరిగిపడటంతో కీలకమైన చండీగఢ్‌సిమ్లా జాతీయ రహదారిని అధికారులు మూసివేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉనా, కాంగ్రా, మండి, సిర్మౌర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. సిమ్లా, మండి, కులు, సోలన్ జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీలు మూతపడ్డాయి. సిమ్లా నగరంలోని కొన్ని పాఠశాలలు ఆన్‌లైన్ తరగతులకు మారాయి.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చ జరపాల్సిందే

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఉభయసభల్లో కార్యకలాపాలు ముందుకు సాగుడం లేదు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చ జరపాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టు వీడడం లేదు. దీంతో సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి వాయిదాల పర్వం కొనసాగుతోంది. బుధవారం కూడా ఉభయసభ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రతిపక్షాల నిరసనలు, గందరగోళం మధ్య ఉభయసభలు గురువారానికి వాయిదా పడ్డాయి. రాజ్యసభ ఉదయం 11 గంటలకు సమావేశం కాగానే ఎజెండాను ప్రవేశపెట్టిన తరువాత సంతాప సూచకంగా సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు ప్రతిపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించినప్పటికీ, స్పీకర్ స్థానంలో ఉన్న భువనేశ్వర్ కలిత 'ది క్యారేజ్ ఆఫ్ గూడ్స్ బై సి బిల్లు 2025'ను చేపట్టాలని కోరారు. కోలాహలం మధ్య బిల్లును వాయిస్ ఓటు ద్వారా ఆమోదించారు. దీనిని లోక్‌సభ ఇప్పటికే ఆమోదించింది. ఉదయం సభ ప్రారంభం కాగానే డిప్యూటీ చైర్మన్ హరివంశ్ 267 నిబంధన కింద సభ్యుల నుండి 35 నోటీసులు అందాయని, వాటిని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. సభ్యులు జీరో అవర్ సమయంలో తమ సమస్యలను లేవనెత్తే విధంగా సభను పనిచేయడానికి అనుమతించాలని డిప్యూటీ చైర్మన్ ప్రతిపక్షాన్ని కోరారు. జీరో అవర్ సమయంలో సమస్యలను లేవనెత్తే హక్కు ఉందని చెప్పారని, జీరో అవర్ సమయంలో తమ ప్రశ్నలను లేవనెత్తడానికి అనుమతించమని అన్నారన్నారు. అయితే, ప్రతిపక్ష సభ్యులు నిరసనగా లేచి నిలబడ్డారు. ఫలితంగా సభను చైర్మన్ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. కోలాహలం మధ్య, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా 2025–26 సంవత్సరానికి మణిపూర్‌కు గ్రాంట్ల డిమాండ్లను ప్రవేశపెట్టారు. మరోవైపు లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల నిరంతర నిరసనల మధ్య బుధవారం లోక్‌సభ కార్యకలాపాలు రెండోసారి మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే, ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. సభా కార్యకలాపాలకు అధ్యక్షత వహిస్తున్న దిలీప్ సైకియా, నిరసన తెలుపుతున్న సభ్యులను వారి స్థానాలకు తిరిగి వెళ్లమని కోరారు. నిరసనలు కొనసాగుతుండగా, సైకియా మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేశారు. కాంగ్రెస్, టిఎంసిలతో సహా 30 మందికి పైగా ప్రతిపక్ష సభ్యులు సభా కార్యకలాపాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. ఉదయం సమావేశంలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ, ప్రతిపక్ష సభ్యులు సభ సక్రమంగా పనిచేయడంపై ఆసక్తి చూపకపోవడంతో, మధ్యాహ్నం వరకు కార్యకలాపాలను వాయిదా వేస్తున్నట్లు చెప్పారు.

## 'ఓటు బందీ' చర్చపై రాజీ లేదు: కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** పార్లమెంటు ఉభయ సభల్లో ఎన్నికల సంఘం ద్వారా 'ఓటు బందీ' అంశంపై చర్చ కోసం ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ విషయంలో రాజీ ప్రసక్తే లేదని కాంగ్రెస్ బుధవారం స్పష్టం చేసింది. బీహార్‌లో ఓటర్ల జాబితాల పున:పరిశీలన పేరిట చేపట్టిన ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల తొలగింపు ఉద్దేశంతోనే ఎస్‌ఐఆర్ చేపట్టినట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ ప్రక్రియ రద్దునకు డిమాండ్ చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఇంచార్జి, కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ సామాజిక మాధ్యమంగా స్పందిస్తూ 'రాజ్యసభలో సభాపతి స్థానం శాశ్వతం. చైర్మన్‌లు వస్తారు... వెళతారు. షెడ్యూల్, అన్‌షెడ్యూల్ ఉండవచ్చు' అని వ్యాఖ్యానించారు. 'పార్లమెంటులో ఎన్నికల సంఘానికి సంబంధించిన ఏ అంశాన్ని చర్చించడానికి వీల్లేదంటూ 1988, డిసెంబరు 14న లోక్‌సభ స్పీకర్ స్పష్టం చేసినట్లు డిప్యూటీ చైర్మన్ గుర్తుచేశారు. కానీ, మోదీ నియమిత రాజ్యసభ చైర్మన్ 2023, జులై 21న ఒక్కటి మినహా ఈ భూమ్మీదుంటే దేని గురించి అయినా రాజ్యసభ చర్చించవచ్చన్నారు. న్యాయ పరిశీలనలో ఉన్న అంశం అనే దానిని పూర్తిస్థాయిలో తప్పు గా అర్థం చేసుకున్నారంటూ అప్పట్లో చైర్మన్ అన్నారు' అని ఎక్స్‌లో జైరాం రమేశ్ పేర్కొన్నారు. 2023, జులై 21న నాటి చైర్మన్ చెప్పినదానికి ఎందుకు ఉద్దేశపూర్వకంగా బేఖాతరు చేస్తున్నారంటూ ఆయన ప్రశ్నించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం ద్వారా ప్రభుత్వ పెద్దలు చేయించి... పశ్చిమ బెంగాల్, అసోం తదితర రాష్ట్రాల్లో చేయించాలనుకునే 'ఓటు బందీ, ఓటు చోరీ'పై పార్లమెంటు ఉభయ సభల్లో చర్చ కోసం ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై రాజీ ప్రసక్తే లేదని జైరాం రమేశ్ తేల్చిచెప్పారు.

## కర్తవ్యభవన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ





**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం కర్తవ్య భవన్‌ను ప్రారంభించారు. రాబోయే 10 సాధారణ కేంద్ర సచివాలయ భవనాలలో ఇది మొదటిది. అన్ని మంత్రిత్వ శాఖల కార్యాలయాల సముదాయంగా నిర్మితమైంది. మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఒకే తాటిపైకి తీసుకురావడం ద్వారా సామర్థ్యాన్ని పెంచడం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ లక్ష్యం. మొదట ప్రారంభించబడిన ఈ కర్తవ్యభవన్ 03 హోం వ్యవహారాలు, విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి, ఎంఎస్‌ఎంఇ, డిఓపిటి. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖలు, ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయాలను కలిగి ఉంటుంది. ప్రస్తుతం పలు ప్రధాన మంత్రిత్వ శాఖలు 1950–1970ల మధ్య నిర్మించిన శాస్త్రి భవన్, కృషి భవన్, ఉద్యోగ్ భవన్, నిర్మాణ్ భవన్‌ల నుంచి కార్యాకలాపాలు కొనసాగిస్తుండగా ఆ భవనాల కాలం తీరిపోయింది. అవి అన్నీ ప్రభుత్వం ప్రకారం... నిర్మాణపరంగా కాలం చెల్లినవి, వినియోగానికి పనికిరాకుండా మారాయి. కేంద్ర గృహనిర్మాణం, అర్బన్ వ్యవహారాల (హెచ్‌యుఎ) మంత్రి మనోహర్‌లాల్ కట్టర్, హెచ్‌యుఎ మంత్రిత్వశాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్‌లతో కలిసి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నూతనంగా నిర్మించిన కర్తవ్య భవనాన్ని సందర్శించారు. కర్తవ్య భవన్ విశిష్టతల గురించి శ్రీనివాస్ ప్రధానమంత్రి మోదీకి వివరించారు. ప్రభుత్వ సెంట్రల్ విస్టా పునర్ అభివృద్ధి ప్రాజెక్ట్ కింద కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ (సిసిఎస్) కోసం 10భవనాలను నిర్మించాలని హెచ్‌యుఏ మంత్రిత్వ శాఖ ప్రణాళికలు రూపొందించింది. కాగా రెండు కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ భవనాలు, 1, 2లను సెప్టెంబర్ మాసం వరకు పూర్తిచేయనుంది. అదే సమయంలో 10 సిసిఎస్‌లు 2026 ఏప్రిల్ నెలాఖరు నాటికి పూర్తి చేయనున్నారు. సిసిఎస్ బిల్డింగ్స్ ప్రాజెక్ట్ 6 మరియు 7, 2026 అక్టోబర్ చివరి నాటికి పూర్తి కానున్నది. మంగళవారం నాడు ఖట్టర్ మాట్లాడుతూ నాలుగు భవనాల నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్న కార్యాలయాలు కస్తూర్బా గాంధీ మార్గ్‌లోని నాలుగు కొత్త లొకేషన్స్‌కు బదిలీ కానున్నాయన్నారు. మింటో రోడ్, నేతాజీ ప్యాలెస్‌కు తాత్కాలికంగా రెండేళ్ల పాటు మారుతాయని ఖట్టర్ చెప్పారు. ఆ సమ యంలో నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు.

## బిహార్‌లో కుల దురహంకార హత్య

**పట్నా:** బీహార్‌లో కుల దురహంకార హత్య కలకలం సష్టించింది. రాష్ట్రంలోని దర్భాంగా మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ (డీఎంసీహెచ్)లో నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న రాహుల్ కుమార్(25)ను అతని మామ కాల్చి చంపినట్లు అధికారులు బుధవారం తెలిపారు. సుపాల్‌కి చెందిన రాహుల్, ప్రేమ్ శంకర్ ఝా కుమార్తె కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ ఈ ఏడాది ఏప్రిల్‌లో కులాంతర వివాహం చేసుకున్నారు. ఝా ఈ వివాహాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. మంగళవారం సాయంత్రం కాలేజీకి చేరుకున్న ఆయన రాహుల్‌ను పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపాడు. ఆగ్రహించిన తోటి విద్యార్థులు ఝాను చితగ్గొట్టారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు విద్యార్థులను అడ్డుకుని... ఝాను ఆస్పత్రిలో చేర్చారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో పట్నాలోని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని అన్నారు. ఈ ఘటన అనంతరం ఆస్పత్రిలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఆగ్రహించిన నర్సింగ్ విద్యార్థులు ఆస్పత్రి గేటును దిగ్బంధించారు. దీంతో వైద్య సేవలకు అంతరాయం కలిగింది. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు లాఠీచార్జ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆస్పత్రి ఎదుట భారీ సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించామని అన్నారు.

## ఉక్రేన్‌పై ట్రంప్ డెడ్‌లైన్ దగ్గరపడటంతో
# పుతిన్‌తో 'విట్‌కాఫ్' సంప్రదింపులు

**మాస్కో:** ఉక్రేన్‌తో 10 లేదా 12 రోజుల వ్యవధిలో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన గడువు తేదీ ముగింపు దశకు వస్తున్న తరుణంలో మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ బుధవారంనాడు మాస్కోలో పుతిన్‌తో సంప్రదింపులు జరిపారు. కాల్పుల విరమణకు అంగీకరించకపోతే తీవ్రమైన ఆంక్షలతోపాటు రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై కూడా సెకండరీ ఆంక్ష లు విధిస్తామని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. ఇందులోభాగంగా భారత్‌పై ప్రధానంగా దృష్టిసారించారు. రష్యా దగ్గర నిధుల కొరత ఏర్పడితేనే యుద్ధం ఆపి శాంతి చర్చలకు లొంగివస్తుందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ చేస్తున్న వాదనకు అనుగుణంగా రష్యాను ఆర్థికంగా దెబ్బతీసే విషయంపై ట్రంప్ ప్రధానంగా దృష్టిసారించారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేసే భారత్ వంటి దేశాలపై భారీ టారిఫ్‌లు విధించాలన్న ట్రంప్ ఆలోచనలపట్ల జెలెన్స్కీ హర్షం ప్రకటించారు. ఇస్తాంబుల్‌లో మూడు విడతలుగా ఉక్రేన్–రష్యా మధ్య జరిగిన చర్చల్లో బందీల మార్పిడి మినహా ఎలాంటి ఫలితాలు రాలేదు. ఈ నేపథ్యంలో గడచిన సోమవారం (ఆగస్టు 4వ తేదీ) ట్రంప్–జెలెన్స్కీ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత 200 మిలియన్ డాలర్ల అదనపు సైనిక విక్రయాలు చేసేందుకు వైట్‌హౌస్ యంత్రాంగం ఆమోదం తెలిపింది.



ఒకవైపు ట్రంప్ దౌత్యమార్గంలో చర్చలు జరుపుతూనే మరోవైపు రష్యాపై అన్ని వైపుల నుండీ తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు. రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు ఆ దేశానికున్న అన్ని దారులనూ మూసివేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉక్రేన్‌లో శాంతిస్థాపన ట్రంప్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విషయంగా మారింది. తాను గెలిస్తే అతి తక్కువ వ్యవధిలోనే ఉక్రేన్‌లో యుద్ధాన్ని ఆపేస్తానని గత ఏడాది అమెరికా ఎన్నికల ప్రచారంలో ట్రంప్ విస్తృత ప్రచారం చేశారు. అధికారం చేపట్టాక గడచిన గడచిన ఆరున్నర నెలలుగా రష్యాను లొంగదీసేందుకు ఆయన చేస్తున్న చర్చలు ఫలించడంలేదు. ఉక్రేన్‌కు నాటో ఆయుధ సరఫరాలు ఆపేయాలని, ఆ దేశానికి నాటో కూటమిలో సభ్య త్వం ఇవ్వకూడదనీ, ఉక్రేన్ నిరాయుధదేశంగా ఉండాలని అన్నింటికంటే మించి తమ సరిహద్దుల్లో ఉన్న ఉక్రేన్ ప్రాంతాలలో రష్యా సంస్కృతిని, రష్యాభాషను కాపాడే చర్యలు తీసుకోవాలని, అక్కడి ప్రజల మనోభావాలను గుర్తించాలని పుతిన్ చేస్తున్న డిమాండ్లపై ట్రంప్ ఏ విధంగానూ స్పందించకుండా కాల్పుల విరమణ చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. పైపై మాటలు కాకుం డా ఈ యుద్ధం చెలరేగడానికి మూలకారణాలను పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని, ఇందుకు అంగీకరిస్తే చర్చల ప్రక్రియ తుది దశలో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ముఖాముఖీ చర్చలకు తాను సిద్ధంగా ఉన్నాననీ అనేక సార్లు పుతిన్ పునరుద్ఘాటించారు. ఒకవైపు నాటో ద్వారా ఉక్రేన్‌కు ఆయుధాలు భారీ ఎత్తున సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేసి మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోమని రష్యాపై ఒత్తిడిచేయడాన్ని క్రెమ్లిన్ వర్గాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఉక్రేన్‌లో జరుగుతున్నది ఉక్రేన్ చేస్తున్న సొంత యుద్ధం కాదనీ, ఉక్రేన్ వేదికగా నాటో కూటమే రష్యాతో ఈ యుద్ధం చేస్తోందని క్రెమిన్ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. నాటో కూటమి ద్వారా ఉక్రేన్‌కు మొదటి విడత ఆయుధ సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసిన తరుణంలో అంతర్జాతీయ జలాల్లో రష్యాకు సమీపంగా రెండు అణు జలాంతర్గాములను అమెరికా మోహరించి రష్యాకు బెదిరింపులకు గురి చేసింది. ఈ పరిణామం తర్వాత ఉద్రిక్తతలు బాగా పెరిగిపోవడవతో స్టీవ్ విట్‌కాఫ్ మాస్కోలో బుధవారం పుతిన్‌తో జరిపిన సంప్రదింపులకు అంతర్జాతీయంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

ప్రజాపక్షం
గురువారం, 07 ఆగస్టు

## ఆర్‌బిఐ నిర్ణయం.. ఊరట మాత్రమే..

రెపో, రివర్స్ రెపో రేట్లలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఎలాంటి మార్పులు చేయకపోవడం ప్రస్తుత దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం ఎంత మాత్రం కాదు. ఈ నిర్ణయం మన ఆర్థిక వ్యవస్థకు ఊరట మాత్రమే. మూడు రోజుల సమావేశమైన ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) ప్రస్తుతం ఉన్న 5.5 రెపో, 3.5 రివర్స్ రెపో రేట్లను కొనసాగించాలని తీర్మానించినప్పటికీ, ఈనెల 7వ తేదీ, గురువారం నుంచి అమల్లోకి రాబోతున్న అమెరికా అదనపు సుంకాల భారం, భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తదితర అంశాలను ప్రస్తావించలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో ప్రకటన చేస్తూ వాణిజ్య రంగంలో అనిశ్చితిని పెంచుతుంటే, కేంద్ర ప్రభుత్వం నుంచి విధాన ప్రకటన లేదు. ఆర్‌బిఐ కూడా అదే ఉదాసీనత. కాగితాలు... లెక్కల్లో మాత్రమే మెరుగుపడుతున్న ద్రవ్యోల్బణం. వాస్తవంలో మాత్రం తప్పని ధరాఘాతం. రిజర్వ్ బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలపై వాణిజ్య బ్యాంకులు చెల్లించే రెపో వడ్డీ రేటు తగ్గించాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. వాణిజ్య బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ చెల్లించే రివర్స్ రెపో పెరగాలన్న అభిప్రాయం కూడా బలంగా వినిపిస్తున్నది. ఒకవైపు అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం... మరోవైపు అత్యధిక దేశాలపై అమెరికా మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధం... ఆపై, రష్యా నుంచి ముడి చమురు దిగుమతిని నిలిపివేయకపోతే, పెనాల్టీ విధిస్తామన్న అల్టిమేటం. భారత స్టాక్ మార్కెట్, వాణిజ్య విధానాలు, విదేశీ పెట్టుబడులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఇలాంటి కీలక అంశాలను విస్మరించి, రెపో రేటులపైనే కసరత్తు చేసి, స్థిరంగా ఉంచాలన్న నిర్ణయం వేచి చూసే ధోరణి తప్ప రోగ నివారణ కానేకాదు. భవిష్యత్తులో దశల వారీగా వడ్డీ రేట్లను తగ్గించే ఆలోచన ఉందన్న ఆర్‌బిఐ ప్రకటన వల్ల ప్రయోజనం శూన్యం. స్థూల జాతీయోత్పత్తి అంచనాల్లో మార్పులు లేవు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే దాఖలాలు లేవు. కొనుగోలు శక్తికి సూచన స్థాయిని మించిన పతనం తప్పడంలేదు. రిటైల్ ద్రవ్యోల్బణం ఆశించిన స్థాయిలో మెరుగుపడడం లేదు. కళ్ల ముందున్న పరిస్థితులు భయపెడుతున్నప్పటికీ, ఆహార వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని ఆర్‌బిఐ ప్రకటించడం హాస్యాస్పదం. గతంతో పోలిస్తే ఇప్పుడు రిటైల్ ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందన్న పాత పాటనే ఆర్‌బిఐ మరోసారి వినిపించింది. స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల నుంచి ఆర్థిక వృద్ధి రేటు వరకూ అన్ని మంచి శకునాలేనంటూ కొత్త పల్లవి ఎత్తుకుంది. మెరుగైన రుతుపవనాలు, సాధారణ వర్షపాతం, ఖరీఫ్ పంటలు మంచి దిగుబడి, జలాశయాల్లో పుష్కలంగా నీరు, తగినంత ఆహార పదార్థాల నిల్వ వంటి ఆశావహ అంచనాలతో సరిపుచ్చింది. ఎంపిసి సమావేశాలు జరుగుతున్న సమయంలోనే, దేశ ఆర్థిక పరిస్థితి నిర్ణయంలో రూపాయి విలువ దారుణంగా పతనం కావడం కూడా కొంత మెరుపు. ఆర్‌బిఐ ప్రకటనలో రూపాయి మారక దుస్థితి ప్రస్తావన లేదు. రూపాయితో డాలర్ విలువ పెరిగితే, విదేశీ పెట్టుబడులు వచ్చి పడవని. కానీ, ట్రంప్ హెచ్చరికలతో సంస్థాగత విదేశీ మదుపరులు భారత మార్కెట్లపై నమ్మకం కోల్పోతున్నారు. పెట్టుబడులు వెనక్కు తీసుకుంటున్నారు. అనిశ్చితి ఎంతకాలం కొనసాగుతుందనేదే భేతాళ ప్రశ్న. ధనిక, పేద వర్గాల మధ్య అంతరం రోజురోజుకూ విపరీతంగా పెరుగుతున్న మన దేశంలో, ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని కోల్పోవడం ప్రమాదకరం. స్టాక్ మార్కెట్ పతనం సంస్థాగత పెట్టుబడిదారులను నిరాశ పరుస్తుంది. బంగారం వంటి ఇతరత్రా పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. ఇలాంటి అత్యంత ప్రధానమైన అంశాలను ప్రస్తావించకుండానే, రెపో రేట్ల కొనసాగింపు నిర్ణయంతో సమావేశం ముగించడం పలాయనవాదం. రెపో రేట్లు మాత్రమే ఆర్థికపరమైన ఒత్తిళ్ల నుంచి దూరం చేయవు. ప్రజల కొనుగోలు శక్తి పెరగని... జీవన ప్రమాణాలు మెరుగుపడని ఆర్థిక వృద్ధి ఎంత పెరిగిందని ఏం ప్రయోజనం? ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న ప్రయత్నాలు మంచివే. కానీ, నేల విడిచి సాము గర్జనలు వద్దు. ఇకనైనా రూపాయి మారక విలువ పతనాన్ని నిలువరించడానికి ప్రయత్నాలు జరగాలి. వినియోగ వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. పెట్టుబడులను ఆకర్షించే ప్రణాళికలు సిద్ధం కావాలి. వర్తమానాన్ని విస్మరించి, భవిష్యత్తులో అద్భుతాలను ఆవిష్కరిస్తామంటే ఎవరూ నమ్మరు. అది అరచేతిలో బాధపడుతున్న రోగికి చికిత్స అందించకుండా, భవిష్యత్తులో అత్యుత్తమమైన వైద్యాన్ని సిద్ధం చేస్తామని హామీలిచ్చినట్లే. ప్రస్తుత రుగ్మతలను చక్కదిద్దే ప్రయత్నం లేకుండా, అంచనాలతో మభ్యపెట్టే నివేదికలు ఎందుకు? లెక్కల గారడీలు... కళ్ల ముందున్న వాస్తవాలు ముఖ్యం. సమస్యల పరిష్కారమే సమర్థ ప్రభుత్వానికి గీటురాయి.

### 8వ తరగతి చరిత్ర పుస్తకాలను వక్రీకరించిన ఎన్‌సిఇఆర్‌టి


# ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాతో వాస్తవాల పాతర



కృష్ణ ఝా

మన గతాన్ని వక్రీకరించే పనిని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) తీవ్రంగా కొనసాగిస్తోంది. వాస్తవానికి వ్యతిరేకంగా పక్షపాతాన్ని చూపించే విధంగా, దాని స్వీయ వ్యాఖ్యానాలకు అనుగుణంగా చరిత్రను తిరిగరాయడానికి ప్రయత్నిస్తోంది. కాలం వారికి అనుకూలంగా ఉండడంతో ఈ వక్రీకరణ నిరాటంకంగా కొనసాగుతోంది. ఇటీవల ఎన్‌సిఇఆర్‌టి ఎనిమిదవ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకాన్ని విడుదల చేసింది. 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్' అనే ఈ పుస్తకం, మొఘలులు, ఢిల్లీ సుల్తానుల పాలనలో జరిగిన 'క్రూరత్వం', 'మత అసహనం' సంఘటనలను ఎత్తిచూపించింది. దీనికి విరుద్ధంగా మరాఠాలు మరింత సానుకూల కోణంలో చిత్రీకరించబడ్డారు. ఈ పుస్తకం జాతీయ పాఠ్యప్రణాళిక చట్రం, జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020కు అనుగుణంగా ఉందని ఎన్‌సిఇఆర్‌టి చెప్పినప్పటికీ, ఎనిమిదవ తరగతి పాఠ్యపుస్తకంలో ప్రవేశపెట్టిన మార్పులు ఎంపిక చేసిన చారిత్రక పురుషులను కీర్తించడం లేదా నిందించడమనే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలపరమైన చర్య అని స్పష్టమవుతోంది. సవరించిన ఎనిమిదవ తరగతి పాఠ్యపుస్తకం 17వ శతాబ్దంలో పశ్చిమ భారతదేశంలో ఒక రాజ్యాన్ని పాలించిన మరాఠాలను 'సర్వసత్తాక రాజ్యం' స్థాపించిన పాలకులుగా చిత్రీకరిస్తుంది. వారి వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీని ఒక 'వ్యూహకర్త','నిజమైన దార్శనికుడు'గా అభివర్ణిస్తుంది. ఈ పుస్తకంలో సర్జికల్ స్ట్రైక్ గురించి కూడా ప్రస్తావన ఉంది. మొఘల్ ప్రభువు షాయిస్తా ఖాన్ శిబిరంపై శివాజీ రాత్రిపూట చేసిన దాడిని ఉదహరిస్తూ, ఇప్పుడు మహారాష్ట్రగా ఉన్న ప్రాంతాన్ని విడిచి వెళ్ళేలా బలవంతం చేయడాన్ని 'ఆధునిక సర్జికల్ స్ట్రైక్' తో పోల్చింది. తన ప్రతీకార చర్యల సమయంలో శివాజీ ఎప్పుడూ మతపరమైన ప్రదేశాలపై దాడి చేయకుండా 'జాగ్రత్త' వహించారని కూడా ఈ పుస్తకం ప్రముఖంగా పేర్కొంది.

అయితే, వాస్తవం ఏమిటంటే, ఈ పాఠ్యపుస్తకం మొఘలుల విషయంలో వివరించినంత వివరంగా మరాఠాల హింస గురించి, రాజ్‌పుత్ రాజ్యాలపై వారి దాడులు, బెంగాల్, బిహార్, ఒడిశాను హింసాత్మకంగా ఆక్రమించుకోవడం, స్థానిక ప్రజలను నాశనం చేయడం, 'చౌత్' అనే పన్నులు చెల్లించాల్సిందిగా బలవంతం చేయడం లేదా కర్ణాటకలోని దేవాలయాలను ధ్వంసం చేయడం వంటి వాటిని వివరించదు. ఆపరేషన్ సిందూర్‌ను 3 నుండి 12వ తరగతి వరకు ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలలో చేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కూడా వార్తలు వస్తున్నాయి. భారతదేశ సైనిక శక్తి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో, పాకిస్తాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారతదేశం చేసిన దాడుల గురించి ఎన్‌సిఇఆర్‌టి రెండు ప్రత్యేక మాడ్యూల్స్‌ను రూపొందిస్తోందని వార్తల్లో పేర్కొనబడుతోంది. ఈ రెండు మాడ్యూల్స్ తయారీలో ఉన్నాయి. రూపొందించే దశలో ఉన్న ఈ రెండు మాడ్యుల్స్‌ను త్వరలో పాఠ్యపుస్తకాలలో ప్రవేశపెడతారు.'ఆపరేషన్ సిందూర్'పై మొదటి ప్రత్యేక మాడ్యూల్ 3 నుండి 8వ తరగతి విద్యార్థులకు, రెండవది 9 నుండి 12వ తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది. భారతదేశం, దాని




> సవరించిన ఎనిమిదవ తరగతి పాఠ్యపుస్త కం 17వ శతాబ్దంలో పశ్చిమ భారతదేశంలో ఒక రాజ్యాన్ని పాలించిన మరాఠాలను 'సర్వసత్తాక రాజ్యం' స్థాపించిన పాలకులుగా చిత్రీకరిస్తుంది. వారి వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీని ఒక 'వ్యూహకర్త', 'నిజమైన దార్శనికు డు'గా అభివర్ణిస్తుంది. ఈ పాఠ్యపుస్తకం మొఘలుల విషయంలో వివరించినంత వివరంగా మరాఠాల హింస గురించి, రాజ్‌పుత్ రాజ్యాలపై వారి దాడులు, బెంగాల్, బిహార్, ఒడిశాను హింసాత్మకంగా ఆక్రమించుకోవడం, స్థానిక ప్రజలను నాశనం చేయడం, 'చౌత్' అనే పన్నులు చెల్లించాల్సిందిగా బలవంతం చేయడం లేదా కర్ణాటకలోని దేవాలయాలను ధ్వంసం చేయడం వంటి వా టిని వివరించదు.

సాయుధ బలగాల విజయాలను 8 నుండి 10 పేజీల మాడ్యూల్స్‌లో వివరిస్తారు. భారతదేశ సైనిక శక్తి, పాకిస్తాన్ మరోసారి ఎలా ఓడిపోయిందో విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ మాడ్యూల్స్ లక్ష్యం' అని ఒక వార్త తెలిపింది. ఎన్‌సిఇఆర్‌టి ద్వారా చారిత్రక వాస్తవాలను వక్రీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ఈ ప్రయత్నంలో అంతకుముందు సంఘటన 2024 ఏప్రిల్‌లో జరిగింది. అప్పుడు ఎన్‌సిఇఆర్‌టి 12వ తరగతి రాజకీయ శాస్త్ర పాఠ్యపుస్తకాన్ని మార్చి అయోధ్య వివాదం గురించి వక్రీకరించిన వర్ణనను అందించేందుకు ప్రయత్నించింది. ఈ సవరణ బాబ్రీ మసీదు కూల్చివేతకు బదులుగా రామ జన్మభూమి ఉద్యమానికి ప్రాధాన్యత ఇవ్వడానికి ఉద్దేశించబడింది. ఈ మార్పులకు ఎన్‌సిఇఆర్‌టి పేర్కొన్న కారణం, 2019 నవంబర్ నాటి సుప్రీంకోర్టు తీర్పు. ఈ తీర్పు ఆలయం కోసం బాబ్రీ మసీదు మొత్తం ప్రాంగణాన్ని, మసీదు ఉన్న స్థలాన్ని కూడా ఉపయోగించుకోవడానికి అనుమతించింది. సుప్రీంకోర్టు మసీదు నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం చూడాలని కూడా ఆదేశించింది. పాఠ్యపుస్తకంలో బాబ్రీ మసీదు ప్రస్తావనను కూడా తొలగించడానికి ప్రయత్నించారు. అయోధ్యలో బాబ్రీ మసీదు స్థానంలో రామ మందిరం నిర్మాణం ఒక గొప్ప సంఘటనగా చిత్రీకరించబడినప్పటికీ, మనం ప్రాథమిక వాస్తవాన్ని మర్చిపోకూడదు. అదేమిటంటే, సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ మసీదు ఉన్న స్థలంలో ఆలయానికి చారిత్రక ఆధారం లేదు. 1949 వరకు అది హిందువుల అవగాహనలో ఒక భాగం కూడా కాదు. 1855 లోనే హనుమాన్‌గఢిలో నివసిస్తున్న బైరాగులకు, ముస్లింలకు మధ్య ఒక వివాదం జరిగింది. హనుమాన్‌గఢి సంఘటన (1855) ముఖ్యమైన కోణం ఏమిటంటే, ఆ సమయంలో కూడా హిందువుల మనస్సులో బాబ్రీ మసీదు, జన్మస్థానం మధ్య ఎటువంటి సంబంధం లేదని ఇది సూచిస్తుంది. ముస్లింలు ఆశ్రయం పొందిన మసీదును బైరాగులు స్వాధీనంచేసుకున్నప్పటికీ, వారు దానిని ఆక్రమించుకోలేదు లేదా దానిపై ఎటువంటి హక్కును కోరలేదు. బదులుగా వారు తక్షణమే హనుమాన్‌గఢికి వెనక్కి తగ్గారు. అవధ్ కోర్టు విచారణ సమయంలో ఏ హిందువు కూడా మసీదు ఉన్న స్థలంలో అంతకుముందు ఒక ఆలయం ఉందని ప్రస్తావించకపోవడం కూడా ముఖ్యం.

వాస్తవానికి సుప్రీంకోర్టు ఈ కేసులో జన్మస్థలంతో సంబంధం ఉన్నట్లుగా పేర్కొన్న ఏ శాస్త్రాలలోనూ అయోధ్యను మాత్రమే ప్రస్తావించారే తప్ప ఒక నిర్దిష్ట స్థలాన్ని గురించి కాదు. నిజానికి 2019 నవంబర్ నాటి సుప్రీంకోర్టు తీర్పులో, శ్రీరాముని జన్మస్థలంగా ఒకటి కంటే ఎక్కువ స్థలాలు ప్రస్తావించబడ్డాయి. బ్రిటిష్ కాలం నాటి స్థానిక కోర్టు రికార్డులు కూడా బాబ్రీ మసీదును ఎన్నడూ రాముని జన్మస్థలంగా పరిగణించలేదని చెబుతున్నాయి. ఉదాహరణకు 1903 నాటి ఒక కోర్టు ఉత్తర్వు 'జనంఆస్థాన్' (శ్రీరాముని జన్మస్థలం) బాబ్రీ మసీదుకు దూరంగా, మసీదు సముదాయంలోని బయటి గోడ లోపల ఉన్నట్లు పేర్కొంది. ఫైజాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ ఇచ్చిన ఈ ఉత్తర్వు 'జనంఆస్థాన్' వద్ద ఒక సైన్ బోర్డు పెట్టే ప్రయత్నాలపై నిషేధం కోరుతూ దాఖలైన పిటిషన్‌కు ప్రతిస్పందనగా ఇవ్వబడింది. పిటిషన్‌ను తిరస్కరించిన మేజిస్ట్రేట్ అ లాంటి స్థలం బాబ్రీ మసీదు 'బయటి గోడ' లోపల ఉం దని, మసీదు లోపల కాదని, కాబట్టి ఈ చర్యలో తప్పు లేదని అన్నారు. 'జన్మస్థాన్ ఈ ప్రత్యేక మసీ దు బయటి గోడ లోపల ఉంది. కాబట్టి పేరుతో కూ డిన బోర్డు సరైన స్థలంలో మాత్రమే ఉంచబడుతుంది. దానిని అక్కడ పెట్టడంపై అభ్యంతరం చెప్పడానికి ఇది ఒక కారణం కాదు... ఎందుకంటే, అటువంటి స్థలం నిజానికి ఉంది. పేరుతో కూడిన బోర్డు కేవలం అపరిచితులకు ఒక మార్గదర్శి మాత్ర మే,' అని ఉత్తర్వు పేర్కొంది. బోర్డు పెట్టబడుతున్న స్థలం బాబ్రీ మసీదు లోపలి వాకిలి వెలుపల, కానీ దాని బయటి గోడ లోపల ఉన్న ఒక ఎత్తైన వేదిక. 'రామ్ చబూతర' అని కూడా పిలువబడే ఈ స్థలం మసీదుకు సుమారు 100 అడుగుల దూరంలో ఉండేది. 1949లో రాముని జన్మస్థలంగా విగ్రహా న్ని బాబ్రీ మసీదు లోపల ఉంచే వరకు దానిని పూజించేవారు. ఇనుప కంచెలు ఈ ఎత్తైన వేదికను లోపలి వాకిలి నుండి వేరు చేశాయి. ఎన్‌సిఇఆర్‌టి తన పాఠ్యపుస్తకాలలో ఎన్ని మార్పులు ప్రవేశపెడితే, అవి అన్ని అబద్ధాలతో నిండిపోతాయి. మధ్యయుగ లేదా ఆధునిక కాలానికి సంబంధించిన చరిత్ర పేరుతో విద్యార్థులకు అబద్ధాలను బోధించకూడదు.

## రష్యన్ ఆయిల్ వివాదంలో అమెరికాకు భారత్ దీటైన స్పందన



ఇటీవలి కాలంలో భారత్, అమెరికా మధ్య రాజకీయ, ఆర్థిక సంబంధాలు కొత్త మలుపు తిరిగాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై ఒత్తి డి తెచ్చిన నేపథ్యంలో, భారత విదేశాంగ మంత్రి త్వ శాఖ (ఎంఇఎ) దీటుగా స్పందించింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆర్థిక ఆంక్షలు విధించినప్పటికీ, భారతదేశం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తన అవసరాల కోసం కొనసాగిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధానికి ముందు భారత్ యొక్క చమురు దిగుమతుల లో రష్యా వాటా కేవలం 0.2 శాతం మాత్రమే ఉం డగా, ప్రస్తుతం అది 35–40 శాతానికి పెరిగింది. ఈ గణనీయమైన పెరుగుదలకు కారణం, రష్యా అందిస్తున్న తక్కువ ధరలో క్రూడాయిల్‌ను భారత్ కు అందించడానికి సిద్ధపడింది. భారత్‌కు ఇంధన అవసరాలు అనివార్యం. అయితే, భారత్ ఈ ఆయిల్ కొనుగోళ్లను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా విమర్శిస్తున్నారు.అందుకు పరిహారంగా ఆగస్టు 7, 2025 నుంచి భారత ఉత్పత్తుల పై 25 శాతం సుంకం విధిస్తామని, ఇంకా ముం దు రష్యన్ చమురు కొనుగోళ్లు ఆపకపోతే మరింత కఠిన ఆంక్షలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించా రు. ఇది భారత్, అమెరికా సంబంధాలలో ఒత్తిడిని పెంచింది.

### భారత్ – స్పందన

భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ ఒత్తిడిని 'అన్యాయమైన, అసమంజసమైన' దాడిగా విమర్శించింది. భారత్ యొక్క చమురు కొనుగోళ్లు రాజకీయ ఆమోదం కోసం కాదు, ప్రపంచ మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ఆర్థిక అవసరాలను తీర్చడానికి అని స్పష్టం చేసింది కూడా. ఈ స్పందనలో భారత్ యొక్క స్వయంప్రతిపత్తి అలాగే జాతీయ ఆసక్తులను రక్షించే నిశ్చయం స్పష్టంగా కనిపిస్తుం ది. అమెరికా ఐరోపా సమాఖ్య (ఇయు) రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తూనే, భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చే 'ద్వంద్వ ప్రమాణాలు విధినాన్ని భారత్ ఖండించింది. ఉదాహరణకు, 2024లో ఐరోపా సమాఖ్య రష్యా నుంచి 16.5 మిలియన్ టన్నుల గ్యాస్ దిగుమతి చేసుకొంది. అమెరికా... యురేనియం, పల్లాడియం వంటి వస్తువులను రష్యా నుంచి దిగుమతి చేసుకొంటూంది. ఈ వాస్తవాలను ఎత్తిచూపుతూ, భారత్ అమెరికా యొక్క విమర్శలను తిప్పికొట్టింది. భారత్ యొక్క ఈ స్పందన దాని దీర్ఘకాలిక అలీన విదేశాంగ విధానాన్ని గుర్తుచేస్తుంది. రష్యాతో దశాబ్దాలుగా కొనసాగుతున్న రక్షణ, మరియు ఇంధన సంబంధాలను కొనసాగిస్తూనే, అమెరికాతో సహకారాన్ని బలోపే తం చేయడం భారత్ వ్యూహం. ఈ సందర్భంలో, ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండి యా' ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విధానం దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక స్వావలంబనను సాధించడానికి ఉద్దేశించినది. ట్రంప్ యొక్క ఈ అసమంజస సుంకాలు, వాణిజ్య ఆంక్షలు భారత్ ను ఈ దిశలో మరింత దృఢంగా నడవడానికి పురిగొల్పాయని చెప్పవచ్చు.

### అమెరికా ఒత్తిడి వెనుక ఉద్దేశాలు

ట్రంప్ ఒత్తిడి వెనుక రెండు ప్రధాన ఉద్దేశాలు కనిపిస్తాయి. మొదటిది, ఉక్రెయిన్ యుద్ధం కారణం గా రష్యా ఆర్థిక ఆదాయాన్ని తగ్గించడం. రష్యన్ చమురు కొనుగోళ్ల ద్వారా భారత్, చైనా వంటి దేశాలు చెల్లించే ధనం రష్యాకు ఆర్థిక బలాన్ని అందిస్తున్నాయని అందుకే రష్యా యుద్ధంలో విజృంభణ కొనసాగుతుందని అమెరికా భావిస్తోంది. రెండవది, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందంలో తమకు అనుకూలమైన షరతులను రుద్దడం. భారత్, అమెరికాతో వాణిజ్య లోటు 45 బిలియన్ డాలర్లుగా ఉంది, దీనిని తగ్గించుకోవాలని ట్రంప్ భావిస్తున్నారు. అ యితే, భారత్‌పై ఒత్తిడి తెచ్చే సమయంలో, చైనా, టర్కీ వంటి ఇతర రష్యన్ చమురు కొనుగోలుదారులపై మాత్రం ఇదే విధమైన సమాన ఒత్తిడి అమెరికా తేవడం లేదు. ఈ అసమాన వివక్ష విమర్శలకు దారితీసింది. అమెరికా యొక్క ఈ ఒత్తిడి విధానం దాని స్వంత వైరుధ్యాలను బహిర్గతం చేస్తుంది. గతంలో, అమెరికా అధికారులు రష్యన్ చమురును తక్కువ ధరలకు కొనుగోలు చేయడం ద్వారా భారత్ ప్రపంచ చమురు ధరలను స్థిరీకరించడంలో సహాయపడిందని పేర్కొన్నారు. మాజీ రాయబారి ఎరిక్ గార్సెట్టి ఈ విషయాన్ని బహిరంగంగా అంగీకరించారు. ఇప్పుడు ట్రంప్ ఒత్తిడి ఈ వైరుధ్యాన్ని బయటపెట్టింది. భారత్‌ను ఒకవైపు రష్యాతో వాణిజ్యాన్ని ఆపమని చెప్పడం, మరోవై పు పాకిస్తాన్‌తో ఇంధన ఒప్పందాలను ప్రోత్సహించడం ట్రంప్ విధానంలోని అస్థిరతను చూపిస్తుం ది. పాకిస్తాన్‌తో అమెరికా కొత్త వర్తక, వాణిజ్య స హకారం, ముఖ్యంగా చమురు, ఖనిజ వనరుల స హకారం, భారత్‌ను మరింత అప్రమత్తం చేస్తుంది. ఈ వివాదం భారత్‌కు రెండు ముఖ్యమైన సవాళ్ల ను తెస్తుంది. మొదట, రష్యన్ చమురు దిగుమతులను ఆపితే, భారత్ యొక్క చమురు దిగుమతి ఖర్చు సంవత్సరానికి 911 బిలియన్ డాలర్లు పెరిగే అవకాశం ఉంది. ఇది ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని తీవ్రంగా పెంచుతుంది. రెండవది, అమెరికాతో వాణిజ్య చర్చలలో భారత్ యొక్క స్థానం బలహీనపడే ప్రమాదం ఉంది. అయినప్పటికీ, భారత్ యొక్క ధీటైన స్పందన దాని జాతీయ ఆసక్తుల విషయం లో రాజీ పడబోదని స్పష్టం చేస్తుంది. ఆగస్టు 25–29 తేదీలలో న్యూఢిల్లీలో జరిగే వాణిజ్య చర్చలు ఈ సమస్యలను పరిష్కరించడానికి కీలకం కానున్నాయి. చివరిగా... రష్యన్ చమురు వివాదం భా రత్ స్వయంప్రతిపత్తి, ఆర్థిక వ్యూహాన్ని పరీక్షిస్తోంది. అమెరికా ఒత్తిడి ఒకవైపు రాజకీయ ఒత్తిడిగా కనిపిస్తుండగా, భారత్ స్పందన దాని దీర్ఘకాలిక విదేశాంగ విధానాన్ని బలోపేతం చేస్తుంది. 'మేక్ ఇన్ ఇండియా' ఉద్యమం, రష్యాతో సంబంధాల ను కొనసాగించడం ద్వారా, భారత్ తన ఆర్థిక రాజకీయ, సార్వభౌమాధికార స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి దృఢసంకల్పంతో ఉంది. ఈ సంక్షో భం అంతర్జాతీయ రాజకీయాలలో అధికారం(పవ ర్ ఇక్విలిబ్రియం) సమతుల్యతను, ద్వంద్వ ప్రమాణాలను మరోసారి బయటపెట్టింది. భవిష్యత్తులో, భారత్ ఈ సవాళ్లను ఎదుర్కొని, తన జాతీయ ఆసక్తులను రక్షించుకోవడం లో విజయవంతం కాగలదని ఆశిద్దాం.

**– రాం కిశోర్, 9849328496**

## ఆర్జన కన్నా.. ప్రభుత్వ అప్పు వాటా ఎక్కువ!

ఆర్.సూర్యమూర్తి

తలసరి ఆదాయం, తలసరి ప్రభుత్వ అప్పుకు సంబంధించిన రెండు వేర్వేరు ప్రశ్నలకు ఆర్థిక మంత్రిత్వశాఖ పార్లమెంటులో ఇచ్చిన సమాధానాలు 2025 మధ్యలో భారతదేశ ఆర్థిక వాస్తవికతను సూక్ష్మంగా వెల్లడిస్తున్నాయి. ముందుగా సంఖ్యలు చూదాం : తలసరి నికర జాతీయ ఆదాయం 2014–15లో రూ.72,805 ఉండగా, 2024–25లో రూ.1,14,710కి పెరిగింది – దశాబ్దకాలంలో 57.5శాతం వృద్ధి! ఇదిలావుండగా, జిడిపితో తన రుణం దామాషాను 2030–31 నాటికి 50 శాతం తగ్గించుకుంటామని యూనియన్ ప్రభుత్వం వాగ్దానం చేస్తోంది. ఈ ముఖ్యాంశాల కింద మరింత ఇబ్బంది కరమైన దృశ్యం ఉంది – ప్రాంతీయ అసమానతలు విస్తృతం కావటం, భరించలేని రుణ భారాలు, వృద్ధి – సమన్యాయం మధ్య పెరుగుతున్న విధాన వ్యత్యాసం. వీటిని కలిపి పరిశీలించినపుడు, లోక్‌సభ అన్‌స్టార్ట్ ప్రశ్నల్లో ఉన్న సమాచారం భారతదేశ వృద్ధి స్వభావం గూర్చి ప్రాథమిక ప్రశ్నలు లేవనెత్తుతుంది – 'సబ్ కా సాత్', 'సబ్ కా వికాస్' వాగ్దానం చేసిన లాభాలు సగటు పౌరునికి చేరుతున్నాయా? ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకారం, 2024–25లో తలసరి ఆదాయం నిలకడ ధరల ప్రకారం రూ.1,14,710గా ఉంది. ఇది ద్రవ్యోల్బణానికి సర్దుబాటు తర్వాత కూడా నిజ ఆదాయం వృద్ధి చెందిందని చెబుతున్నది. ఇది జాతీయ సౌభాగ్యం పెరుగుదలను సూచిస్తున్నది. అయితే యూనియన్ ప్రభుత్వ తలసరి రుణభారం 2025 మార్చి 31కి రూ.1,32,059. 66 పైసలు. అంటే సగటు భారతీయుడు సంవత్సరంలో సంపాదించే దానికి మించి ప్రభుత్వ రుణదాతలకు సాంకేతికంగా అప్పుపడి ఉన్నారు. విడివిడిగా చూస్తే, ఏ ఒక్క సంఖ్య ఆందోళనకరంగా ఉండకపోవచ్చు. అయితే కలిపితీసుకుంటే, ఒక విచిత్రం కనపడుతుంది. అదేమంటే, పౌరులు అదనంగా ఆర్జిస్తున్నప్పటికీ అదే సమయంలో ప్రభుత్వ అప్పులో వారి వాటా పెరుగుతూ ఉంది. ఇది కనిపించని పన్ను. ఇది దీర్ఘకాల ద్రవ్య స్థిరత్వాన్ని, ప్రభుత్వ పెట్టుబడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది.

### దిగువ విషయాలు పరిశీలించండి

ప్రభుత్వ అప్పులపై వడ్డీ చెల్లింపులు 2022–23 లో ఉన్న రూ.9.23లక్షల కోట్ల నుంచి 2024–25లో రూ.11.18 లక్షల కోట్లకు పెరిగింది. 2025–26లో బడ్జెట్‌లో కేటాయింపు రూ. 12.76లక్షల కోట్లు. ఇది కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయంలో నాల్గవ వంతు. ఇది ఆరోగ్యం, లేదా మౌలిక వసతుల కల్పనపై వెచ్చిస్తున్నది కాదు, పాత అప్పులపై చెల్లింపు. జిడిపి ద్రవ్యలోటును 2025–26లో తగ్గిస్తామని, 2026 నుంచి అప్పులను తగ్గించుకుంటామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. అయితే ఈ ప్రణాళిక సఫలత జిడిపి బలంగా పెరుగుతుందనే, పన్నుల ఆదాయం పెరుగుతుందనే ఊహలపై ఆధారపడుతున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కల్లోలంలో ఉండగా, దేశీయంగా పుంజుకోవటంలో ఎగుడు దిగుళ్ల దృష్ట్యా పైరెండు నెరవేరటం నమ్మశక్యం కాదు. తలసరి ఆదాయం డేటా పరిశీలిస్తే రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. 2024–25లో గోవా, కర్నాటక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రల తలసరి ఆదాయం రూ.1.75లక్షలకు పైగా ఉంది. కాగా బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లో రూ.75వేల లోపుతో కొట్టుమిట్టాడుతున్నాయి. వాస్తవానికి బిహార్ తలసరి ఆదాయం గోవా ఆదాయంలో ఆరవ వంతు! ఒడిసా, కర్నాటక, తెలంగాణ పదేళ్ల కాలంలో తమ తలసరి ఆదాయాన్ని దాదాపు రెట్టింపు చేసుకోగా, ఇతర రాష్ట్రాలు నీరస వృద్ధి నమోదు చేశాయి. ఉదాహరణకు, పదేళ్లలో తెలంగాణ వృద్ధి 85శాతం, ఒడిసా వృద్ధి 96.7 శాతం ఉండగా ఉత్తరప్రదేశ్ తలసరి ఆదాయ వృద్ధి కేవలం 47.9 శాతం మాత్రమే. ఈ భిన్నత్వం ఆరంభంలో ఉన్న వ్యత్యాసాలనే గాక, విద్య, పారిశ్రామికీకరణ, పరిపాలన, పెట్టుబడిలో ఉన్న సంస్థాగత వ్యత్యాసాలను ప్రతిబింబిస్తున్నది. అటువంటి వ్యత్యాసాలు తగ్గకపోగా పెరుగుతున్నపుడు సమ్మిళిత వృద్ధి గూర్చి ప్రభుత్వం చెప్పే మాటల్లో డొల్లతనం వెల్లడవుతున్నది. పేద రాష్ట్రాల పట్ల కేంద్రప్రభుత్వ బడ్జెటరీ నిర్లక్ష్యం కూడా ఇందుకు కొంత కారణం. ఫెడరల్ వ్యవస్థలో తలసరి ఆదాయం పెరగటం ఒక్కటే ప్రభుత్వ ధ్యేయం కాదు, రాష్ట్రాల మధ్య వ్యత్యాసం తగ్గింపుపై కూడా



శ్రద్ధపెట్టాలి. సంపన్న రాష్ట్రాల్లో కూడా తలసరి ఆదాయంలో అంతర్గత వ్యత్యాసాలున్నాయి. మహారాష్ట్ర, ఢిల్లీ వంటి అధిక ఆదాయ రాష్ట్రాల్లో కూడా పట్టణ – గ్రామీణ ఆదాయాల్లో కొన్ని పెద్ద వ్యత్యాసాలున్నాయి. ఆదాయ పంపిణీపై సూక్ష్మ సమాచారం లేనందున, కోవిడ్ మహమ్మారి అనంతరం, ఆదాయ వృద్ధి కిందిస్థాయిలోని 50శాతం మందికి అందుతుందా, పైనే కేంద్రీకరణ జరుగుతున్నదా స్పష్టత లేదు.ఆదాయం లేదా సంపద పంపిణీ డేటాను రెగ్యులర్‌గా ప్రకటించని కొన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి. ప్రభుత్వ అప్పును స్థూల ఆర్థిక సమస్యగా తరచూ చూపుతుంటారు. అది అంతిమంగా సోషల్ కాంట్రాక్టు. అప్పుడే పుట్టిన బిడ్డ కూడా గత అప్పు భారాన్ని మోస్తుంది. పెరుగుతున్నవడ్డీ పెట్టుబడి వ్యయంపై భారమవుతోంది. ఆరోగ్య సంరక్షణ, హరిత పరివర్తనం, డిజిటల్ మౌలిక వసతులు, ఉపాధుల కల్పన అవసరం మెండుగా ఉండగా అప్పులు తీర్చటం గుదిబండ అవుతోంది. ఆర్థిక వ్యవస్థను భేషుగ్గా నడుపుతున్నామని చెప్పుకునే ప్రభుత్వానికి ఈ సంఖ్యలు వి జయ భావనను గాక ఆత్మపరిశీలన ప్రేరేపించాలి. పెరిగిన ఆదాయం గ్రామీణ శ్రామికులకు, అనియత కార్మికులకు, సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు చేరుతున్నదా, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఉపాధి లేమిని లేదా అప్పును పరిహరిస్తున్నదా? ఆలోచించాలి.

## నేతన్న వెతలు తీరేదెన్నడు!

మానవుడి కనీస అవసరాలు కూడు, గూడు, గుడ్డ అని మనకు తెలుసు. వ్యవసాయం తర్వాత అతి పెద్ద పరిశ్రమగా చేనేత హస్తకళలకు గుర్తింపు ఉన్నది. పుట్టిన నాటి నుండి గిట్టే వరకు మన శరీరం మీద వస్త్రాలు తప్పనిసరి. మనం ధరించే వస్త్రాలు మన మానసిక, శారీరక, ఆర్థిక, సామాజిక, వ్యక్తిత్వ గుణాల స్థాయిని రుజువు చేస్తాయి. పంచె కట్టులో పురుషులు, చీర కట్టులో స్త్రీలు అందంగా, హుందాగా, ఆకర్షణీయంగా, సాంప్రదాయం ఉట్టిపడే విధంగా కనుపిస్తారు. నేతన్న చేతుల్లో మాయాజాలం ఫలితంగా సప్తవర్ణ సింగిడి రంగులు వస్త్రాలకు అందాల విందులు ఆరబోస్తాయి. నేతన్న సృజన, దారం పోగును నాట్యం చేయించగల హస్తకళా నైపుణ్యం సదా అభినందనీయం. నాడు విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ చేనేత వ స్త్రాలను ప్రోత్సహించడానికి సంకేతంగా గాంధీ గారు నూలు వడికే రాట్నం ముందు కూర్చొని ప్రచారం చేయడం చూసాం. నాటి చేనేత వస్త్రాల నుంచి నేటి ఆధునిక సాంకేతిక యంత్రాల వినియోగం వరకు వస్త్ర పరిశ్రమ ఊహించనంతగా అభివృద్ధి చెందడం చూస్తున్నాం. సిరిసిల్ల నేతన్న వస్త్రాలు, మంగళగిరి చీరలు, బెనారస్ వస్త్ర వెలుగులు, ధర్మవరం ధగధగలు, కోట చీరల కమనీయాలు కలంకారీ కళాకాంతుల వస్త్ర రంగులు నేటికీ మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తూనే ఉన్నాయి.

### 11వ జాతీయ చేనేత దినోత్సవం–2025

నేడు జాతీయ చేనేత దినోత్సవం



దేశ సామాజికఆర్థిక సుస్థిరాభివృద్ధికి చేనేత పరిశ్రమ ఊతం ఇస్తున్న ది. స్వతంత్ర భారతంలో చేనేత హస్తకళల ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడం, నేతన్నల సమస్యలకు పరిష్కారాలను వెతకడం, మన చేనేతకు అంతర్జాత గుర్తింపుకు ప్రయత్నాలు చేయడం లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని 2015 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం చొరవతో ప్రతి ఏట 07 ఆగష్టున జాతీయ చేనేత దినోత్సవం (నేషనల్ హాండ్లూమ్ డే) పాటించడం జరుగుతున్నది. 07 ఆగష్టు 1905న బెంగాల్ విభజనను చేసిన బ్రిటీష్ నిర్ణయానికి వ్యతిరేకంగా కలకత్తాలో మొదలైన స్వదేశీ ఉద్యమం ప్రారంభానికి గుర్తుగా ఈ దినోత్సవం 07 ఆగష్టున నిర్వహించుకోవడం ముదావహం. నేడు మన చేనే త హస్తకళల పరిశ్రమతో పాటు దాని అనుబంధ రంగాల్లో పనిచేసేవారిలో దాదాపు 70 శాతం మంది మహిళలు శ్రమ చేయడం జరుగుతున్నది. భారత చేనేత పరిశ్రమపై 32 లక్షల కుటుంబాలు ఆధారపడడంతో పాటు 4.33 మిలియన్ల ఉద్యోగ ఉపాధులు కల్పించడం కొనసాగుతున్నది. నేతన్నల ఆదాయాన్ని మెరుగు పరచడంతో పాటు వారిని శక్తివంతులుగా మార్చడానికి వేదికగా ఈ దినోత్సవం ఉపయోగపడుతున్నది. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు చెందిన 125 చేనే త సంస్థలు, 1,246 చేనేత క్లస్టర్లు నేటి జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుతుంటున్నాయి. ఆంధ్రలో 98, తెలంగాణలో 34 క్లస్టర్లు ఉన్నాయి. ప్రపంచ వస్త్ర పరిశ్రమ ఉత్పత్తుల్లో 6.9 శాతం భారతదేశం ఉత్పత్తి చేస్తున్నది. చైనా మాత్రం 52 శాతానికి పైగా సడవస్త్ర మార్కెట్‌ను కైవసం చేసుకున్నది. చేనేత వస్త్రాల ఉత్పత్తుల్లో 95 శాతం భారతదేశం అందిస్తున్నది. మన దేశ ఆచారాలు, వారసత్వాలను బట్టి నేతన్న చూపిస్తున్న హస్తకళా నైపుణ్యాల ప్రదర్శన వల్ల చేనేత వస్త్రాలకు ఆదరణ పెరుగుతోంది.చేనేత వస్త్రాల్లో ప్రధానమైనవిగా కాటన్, సిల్క్, ఉన్ని, ఖాదీ, పట్టు వస్త్రాలు వస్తాయి. నేతన్నకు చవకగా నూలు అందుబాటులో ఉంచడం, పరిశ్రమలు నెలకొల్పడానికి ఆర్థిక గొడుగులు పట్టడం, వస్త్ర ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, ప్రభుత్వాల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. నేతన్న హస్తకళా ఉత్పత్తుల్లో చీరలు, పంచెలు, కాటన్ దుస్తులు, బెడ్ షీట్లు, దుప్పట్లు, శాలువాలు, కండువాలు, కార్పెట్లు, డోర్ మ్యాట్స్, డ్రెస్ మెటీరియల్స్, అంగవస్త్రాలు లాంటివి అనేకం వస్తాయి. ఒడిసా ఇక్కత్, ఆంధ్ర కలంకారి, గుజరాత్ బంధనీ, యుపి బ్రొకేడ్స్, తెలంగాణ పోచంపల్లి వస్త్రాలకు మంచి ఆదరణ కనిపిస్తున్నది. చేనేత నూలును ఖాదీ వస్త్రాలుగా, మిల్లులో ఒడికిన నూలును హాండ్లూమ్ ఫ్యాబ్రిక్‌గా ఉత్పత్తి చేయడం కనిపిస్తున్నది. మన మూలాలను వెతుక్కుంటూ, సదాచారాలను పాటిస్తూ, ఆరోగ్యకర చేనేత వస్త్రాలను ధరిస్తూ, నేతన్నకు బాసటగా నిలుస్తూ, నేతన్న తయారు చేసిన త్రివర్ణ పతాకానికి వందనం చేస్తూ, చేనేత హస్తకళలను కాపాడుతున్న నేతన్నలకు వందనం చేద్దాం, వారి కుటుంబాలకు ఆనందాలను బహుకరిద్దాం.

**– మధుసూదన్ రెడ్డి**

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

### సిపిఐ, ఎఐటియుసి

**ప్రజాపక్షం/కల్లూరు :** మధ్యాహ్న భోజనం కార్మికుల అక్రమ అరెస్టులను ఉద్యమాలను ఆపలేరని సిపిఐ ఏఐటియుసి మండల సమితి లు బుధవారం జరిగిన సమావేశంలో ఖండించారు. పెండింగ్ వేతనాలు, బిల్లులు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నెలకు పదివేల రూపాయలు వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకు ఖమ్మం కలెక్టరేట్ వద్ద ధర్నాకు వెళ్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను బుధవారం ముందస్తుగా అరెస్టు చేయడంతో మండల కార్మిక సంఘాలు కమిటీలు ఖండించాయి. బుధవారం సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఏఐటియుసి ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఉద్యమాన్ని ఈ విధంగా అణగదొక్కేందుకు ప్రయత్నించడంతో అరెస్టులు చేయడం తో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బుధవారం జరిగిన సమావేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు అధ్యక్షులు పాగా సత్యావతి, నాయకులు పరిగడుపు సుశీల, నాగేంద్ర, అలివేలు, మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ మూడులోగా దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం విజయ డెయిరీ ఆవరణలో నిర్మించిన 10 షెట్టర్లు అద్దె ప్రాతిపదికన కేటాయించుటకు గాను సెప్టెంబర్ మూడులోగా టెండర్ దరఖాస్తులు సమర్పించాలని డెయిరీ ఉప సంచాలకులు కె.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 షెట్టర్లు నెలసరి అద్దె ప్రాతిపదికన కనిష్టంగా నెలకు రూ.25వేలు, 18 శాతం జిఎస్టితో చెల్లించుటకు ఆసక్తిగల వారు రూ.2వేలు చెల్లించి టెండర్ ఫారాలు స్వీకరించాలన్నారు. పూరించిన టెండర్ ఫారాలను సెప్టెంబర్ మూడు లోపు ఖమ్మం పాల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నందు రూ.20వేల ఇఎండి డిమాండ్ డ్రాఫ్ట్‌తో మేనేజింగ్ డైరెక్టర్ టిజిడిడిసిఎఫ్ హైదరాబాద్ పేరున డిడి చెల్లించి దరఖాస్తులు సమర్పించాలన్నారు.
సెప్టెంబర్ మూడు మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉప సంచాలకుల కార్యాలయం నందు దరఖాస్తులు సమర్పించాలని అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్లు తెరవడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9121160540, 9959877109 నెంబర్లను సంప్రదించాలని ఖమ్మం డెయిరీ ఉప సంచాలకులు తెలిపారు.



## కరాటే పోటీల్లో రెజొనెన్స్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ పాఠశాల విద్యార్థులు సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఛాంపియన్‌షిప్ ట్రోఫీని గెలుచుకున్నారు. అండర్ 12 బాలుర కరాటే విభాగంలో ఎస్‌కె.ఉబైద్ బంగారు పతకాన్ని, ఎస్‌కె.రిహాన్ సిల్వర్ మెడల్‌ను గెలుచుకున్నారు. అండర్ 12 బాలికల విభాగంలో డి.దీక్షిత బంగారు పతకాన్ని, అండర్ 10 బాలుర విభాగంలో ఎన్.పృథ్వీరాజ్ బంగారు పతకాన్ని సాధించారు. సౌత్ ఇండియా స్థాయిలో రెజొనెన్స్ శ్రీనగర్ విద్యార్థులు తమ కరాటే నైపుణ్యాలను ప్రదర్శించి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కూడా కైవసం చేసుకుని ప్రముఖుల అభినందనలు పొందారు. పాఠశాలలో జరిగిన అభినందన సభలో డైరెక్టర్లు కె.శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు బంగారు పతకాలు, ట్రోఫీలు సాధించిన విద్యార్థులను అభినందించారు. 10, 12 సంవత్సరాల వయస్సులోనే కరాటేలో సౌత్ ఇండియా ఛాంపియన్‌షిప్ ట్రోఫీని గెలుచుకోవడం హర్షణీయమన్నారు. తమ పాఠశాలలో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ఉన్నత ప్రణాళికలు అమలుపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్.మురళిమోహన్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సేవా కార్యక్రమాల్లో రామారావు కృషి అభినందనీయం : ఎ.వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/వైరా :** వైరా ఎస్సై పి.రామారావు తన విధులు నిర్వహిస్తూ సమాజ సేవా కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని ప్రజాపక్షం బ్యూరో టియుడబ్ల్యూ ఐజెయు జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు అన్నారు. తల్లాడ ఆర్‌బి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో వైరా ఎస్సై పి.రామారావును తల్లాడ, ప్రజాపక్షం జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. టియుడబ్ల్యూజె ఐజెయు జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, తల్లాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బహదూర్ సీతారాములు, టికె.ప్రసన్నతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏనుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సై పి.రామారావు కృత్రిమ కాలు ఏర్పాటు విషయంలో ఎంతో చొరవ చూపుతూ ఎంతోమంది వికలాంగులకు అండగా నిలబడి వారు నడిచేవిధంగా కాలు ఏర్పాటు చేయడంలో చేస్తున్న కృషి ఎంతో గొప్పదని అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్ని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



## న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థుల అద్భుత ప్రదర్శన

**ప్రజాపక్షం/వైరా :** ఖమ్మం గాంధిచౌక్ వర్తక సంఘం (చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం)లో జరిగిన జాతీయస్థాయి ఆల్ స్టైల్ కరాటే అండ్ కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ 2025లో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో పాల్గొని ఓవరాల్ కరాటే చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం జరిగింది. కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ జాతీయస్థాయి కరాటేలో అద్భుత ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వివిధ కేటగిరీల్లో పాల్గొని మెడల్స్ సాధించిన మా **విద్యార్థులు :** గోల్డ్‌మెడల్, సిల్వర్, బ్రౌన్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ కరాటే అనేది ఒక యుద్ధకళ. అలాంటి యుద్ధ కళను పాఠశాలలో ప్రవేశపెట్టి కరాటే కోచ్ సహాయంలో విద్యార్థులు ఎంతో క్రమశిక్షణగా ఓర్పుతో సాహసోపేతమైన కరాటేను నేర్చుకోవడమే కాకుండా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని వివిధ పతకాలను సాధించడం నిజంగా అభినందనీయమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ కళ బాలికలకు అత్యవసరం కాబట్టి ప్రతి బాలిక తమని తాము రక్షించుకోవడానికి కరాటే విద్య చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్, పాఠశాల ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, కరాటే మాస్టార్ మహబూబ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




## గన్నవరానికి ఇన్‌చార్జి సెక్రటరీ కేటాయింపు

**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలం గన్నవరం గ్రామపంచాయతీకి గత వారం రోజులుగా పంచాయతీ సెక్రటరీ లేకపోవడంతో ప్రజాపక్షం దినపత్రికలో 'గన్నవరానికి గ్రామ కార్యదర్శి కావలెను' అనే శీర్షికను ప్రచురించడం జరిగింది. ఈ శీర్షికకు స్పందించిన అధికారులు వైరా మండలం పుణ్యాపురంలో గ్రామ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావుకు గన్నవరం సెక్రటరీగా అదనపు బాధ్యతలను అప్పగించారు. జులై31వరకు గన్నవరం సెక్రటరీగా విధులు కొనసాగించిన వెంకటేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో ఖాళీ అయిన ఆ గ్రామ కార్యదర్శిని నియమించకపోవడంతో ఏడు రోజులు గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# ఎటిసి కోర్సులతో ఉపాధికి భరోసా





### నూతనంగా ఎటిసి ఆరు కోర్సుల్లో యువతకు శిక్షణ

### అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యువతకు ఎటిసి కోర్సులతో ఉపాధి, ఉద్యోగాలకు భరోసా లభిస్తుందని జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థను అప్‌గ్రేడ్ చేసిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటిసి నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న అత్యాధునిక మిషనరీలను పరిశీలించారు. పరికరాల పనితీరును ట్రైనర్స్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, యువతకు కావాల్సిన సౌకర్యాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐటిఐలు ఇప్పుడు కొత్త సాంకేతికతతో అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, టాటా టెక్నాలజీస్ సహకారంతో యువతకు నైపుణ్యతతో కూడిన శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. పలు రకాల మిషనరీపై రియల్ టైమ్ ప్రాక్టికల్ ట్రైనింగ్, ఇంతకు ముందు ఎప్పుడూ లేనటువంటి అత్యాధునిక పరికరాలతో శిక్షణ ఉంటుందని తెలిపారు. మారుతున్న కాలంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు నిష్ణాతులైన ట్రైనర్ల పర్యవేక్షణలో శిక్షణ ఇస్తామని తెలిపారు. మిషనరీపై పనిచేస్తూనే పని నేర్చుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఉద్యోగాలకు, సొంత వ్యాపారం చేసుకోవడానికి వీలుగా రూపొందించిన పలు కోర్సులు, ఇండస్ట్రీ అవసరాలకు తగినవిధంగా డిజైన్ చేసిన పూర్తి స్థాయి శిక్షణ అందిస్తామని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించినవారు ఎటిసి కోర్సులు పొందేందుకు అర్హులన్నారు. ఈ కోర్సులతో మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.
ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ ప్రకారం టాటా కన్సల్టెంట్స్ వారితో సమన్వయం చేసుకుని ఈ కోర్సును డిజైన్ చేశామన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కోర్సులో జాయిన్ కావాలని కలెక్టర్ తెలిపారు. ఎటిసి కోర్సులకు సంబంధించి ప్రాక్టికల్ నిర్వహణకు అవసరమైన పరికరాలను నూతనంగా నిర్మించిన భవనంలో అమర్చడం వల్ల విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు.

### స్మార్ట్‌కిడ్జ్ జ్యూట్ బ్యాగులను ఆవిష్కరించిన కలెక్టర్

స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన జ్యూట్ బ్యాగులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్యలతో కలిసి పర్యావరణహితమైన జ్యూట్ బ్యాగులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత జ్యూట్ బ్యాగులను ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ బ్యాగులతో పర్యావరణానికి, భూమాతకు తీవ్రంగా నష్టం కలుగుతుందన్నారు. తద్వారా ప్రజలకు అనారోగ్యం కలుగుతుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కృష్ణచైతన్య మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో తమ పాఠశాల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ప్రత్యేకంగా జ్యూట్ బ్యాగులను తయారు చేయించి విద్యార్థుల తల్లిదండ్రులకు, ప్రజలకు అందిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంగపేటలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని మంగపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం తదితర సేవల గురించి అంగన్వాడీ టీచర్న్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్నటువంటి గుడ్లను, ఇతర ఆహార పదార్థం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ టీచర్‌ను సిహెచ్‌ఆర్ కింద పిల్లలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు...గర్భిణీ స్త్రీలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలలో రక్తహీనత లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది ద్వారా గర్భిణీలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భిణీలు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ లేకపోవడం వలన కోతులు, పాముల వల్ల ఇబ్బందులకు గురి అవుతున్నామని కలెక్టర్ దృష్టికి అంగన్వాడీ సిబ్బంది తీసుకురాగా, వెంటనే స్పందించి మట్టి ఇటుకలతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంగపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి, విద్యార్థుల పుస్తక పఠనం, చేతిరాతను కలెక్టర్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను కలెక్టర్ మెనూ ప్రకారం ఉన్నాయా లేదా అని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముఖాముఖి ముచ్చటించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యంపై పలు ప్రశ్నలు వేసి బోర్డుపై రాయించి విద్యార్థుల సామర్థ్యాన్ని, వారి చేతిరాతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ గన్యా, ప్రధానోపాధ్యాయురాలు కోటమ్మ, అంగన్వాడీ టీచర్ సుజాత, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పోరాట యాదిలో.. అయోధ్య

### నూనూగు మీసాల వయస్సు నుండి తుదిశ్వాస వరకూ అదే పంథా



**ప్రజాపక్షం/ఖమ్మం :** మణుగూరు ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ గురించి ప్రస్తావన వస్తే దాట్ల వెంకటేశ్వర బాబు, పాకాలపాటి వెంకటేశ్వర రావు, మైసా కొండయ్య తర్వాత గుర్తుకు వచ్చేది అయోధ్య. వెంకటేశ్వర బాబు, మైసా కొండయ్య మరణం, పాకాలపాటి పెద్దాబ్బాయి వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత రెండు దశాబ్దాలుగా మణుగూరు ప్రాంత ముఖ్యంగా పినపాక నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ అన్ని తానై నిలిచిన వాడు అయోధ్య. కమ్యూనిస్టు పార్టీ పిలుపులను అమలు చేయడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేశారు. సాంప్రదాయ కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చిన అయోధ్య పైన పేర్కొన్న నాయకులతో కలిసి అనేక గ్రామాలను నిర్మించారు. విజయనగరం, చిక్కుడుగుంట, సాంబాయిగూడెం, రాజుపేట, విఠల్‌రావునగర్, రామానుజవరం తదితర గ్రామాల ఏర్పాటులో ఆయన కృషి అజరామరం. కొండన్న, మంగన్న దళాలు ఈ ప్రాంతంలో పీపుల్స్‌వార్ ఉద్యమానికి కీలకంగా వ్యవహరించాయి. కమ్యూనిస్టు పార్టీ బలమైనశక్తిగా ఉండడంతో పీపుల్స్‌వార్ నేతలు కమ్యూనిస్టు నాయకులపై దాడులు, బెదిరింపు చర్యలకు పాల్పడేవారు. ఒకకానొక దశలో పాకాల పాటి వెంకటేశ్వరరావును హతమార్చడానికి ప్రయత్నించిన అప్పటి పీపుల్స్ వార్ సాయుధులు అయోధ్యను ఒక ట్రెండు సార్లు కిడ్నాప్ చేశారు. అడవుల్లోకి తీసుకెళ్లి కణతన తుపాకీ పెట్టి బెదిరించే ప్రయత్నం చేసినా అయోధ్య భయపడలేదు. తాను ఎంచుకున్న పంథా నుంచి వైదొలగలేదు. 1/70 ఉద్యమం బలంగా ఉన్నప్పుడు గిరిజనేతరుల ఆస్తుల రక్షణ కోసం పాకాలపాటి పెద్దాబ్బాయితో కలిసి పని చేశారు. మణుగూరు ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ప్రజా సంఘాల నిర్మాణంలో ఆయన కీలక భూమిక పోషించారు. హమాలీల సంఘం, గుమస్తాల సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సహా పలు సంఘాల బలోపేతం వెనక అయోధ్య కృషి ఉంది.

**కింగ్ మేకర్ అయోధ్య :**
అయోధ్యను వంచించిన వారు చాలా మంది ఉన్నారు కానీ అయోధ్య వంచనకు గురైన వారు లేరంటే అతిశయోక్తి కాదు. చాలా మంది నాయకులను అయోధ్య తయారు చేసి కింగ్ మేకర్ గా పేరొందారు. పాత బూర్గంపాడు నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ గెలుపులో ఆయన కృషి చిరస్మరణీయం. బూర్గంపాడు నుంచి సిపిఐ అభ్యర్థుల గెలుపులో అయోధ్య కృషి దాగి ఉంది.

**తెలంగాణ సాధనోద్యమంలో :**
తెలంగాణ వాదిగా ముద్రపడిన అయోధ్య తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకంగా వ్యవహరించారు. పలు స్థానిక ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారు. అప్పటి జిల్లా కార్యదర్శి సాంబశివరావు తో కలిసి మణుగూరు నుంచి ఖమ్మం వరకు 400 కిలో మీటర్ల పాదయాత్రలో అయోధ్య పాల్గొన్నారు. మణుగూరు ప్రాంతాభివృద్ధిపై ఆయన దృష్టి సారించారు. పారిశ్రామిక పట్టణమైన మణుగూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఆయన పరితపించే వారు. ప్రజాప్రతినిధిగా ఎవరున్న మణుగూరు ప్రాంత అభివృద్ధి నిధుల కోసం ఆయన వారిచుట్టూ తిరిగి నిధుల కోసం ప్రయత్నించే వారు. మొత్తంగా అయోధ్య ఒక పోరాట శిఖరం. తన ముందు ఎవరున్నరనేది చూడకుండా ప్రజల పక్షాన నిలబడే వారు.
జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్‌గా పని చేస్తున్నప్పుడు విపక్షం మొత్తం ఓ సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో అధికార పక్షం జెడ్పి సమావేశాన్ని వాయిదా వేసి బయటకు వెళ్లింది. జెడ్పి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న గోనెల విజయలక్ష్మి సైతం సమావేశం నుంచి బయటకు వెళ్లడంతో ఉపాధ్యక్షునిగా ఉన్న అయోధ్య అధ్యక్షతన ఒక రోజంతా సమావేశం నిర్వహించారు. ఇది జిల్లా పరిషత్ చరిత్రలో ఒక అరుదైన ఘట్టం. అధికారుల చేత సభ్యుల ప్రశ్నలకు జవాబులు ఇప్పించి అయోధ్య తన పరిణితిని అప్పుడే చాటుకున్నారు.



## వజ్రమ్మ మృతి సిపిఐకి తీరని లోటు

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చింతకాని :** రాఘువాపురం గ్రామ సిపిఐ సీనియర్ నాయకురాలు వద్దే వజ్రమ్మ(60) అనారోగ్యంతో మృతిచెందారు.విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి రాఘువాపురం చేరుకుని వజ్రమ్మ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ వజ్రమ్మ బతికినంత కాలం నిబద్ధతగల కమ్యునిస్టుగా బ్రతికిందన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, నాయకులు రాసాల మోహన్ రావు, సింగారపు సత్యనారాయణ, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.




## ట్రోఫీకి రమేష్ స్కై స్కూల్ విద్యార్థులు

**ప్రజాపక్షం/పెనుబల్లి :** ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధి మెమోరియల్ అండర్ 14 పోటీల్లో పెనుబల్లి రమేష్ స్కై స్కూల్‌కు చెందిన 15మంది విద్యార్థులు క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు బుధవారం కొత్తగూడెం వెళ్లారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.రమేష్‌బాబు, కరెస్పాండెంట్ కే.లలిత, భవాని, టీం కోచ్ మారుతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సిటీ పోలీస్ యాక్ట్ కింద పదిమందిపై కేసులు నమోదు



**ప్రజాపక్షం/వైరా :** వైరా పట్టణంలో పలు వార్డుల్లో కోట్లపై ప్రజలకు ఇబ్బంది, వాహనదారులకు ఇబ్బంది కలిగించే విధంగా ఇసుక, కంకర ఇతర వస్తువులు అడ్డంగా ఉంచి ఆటంకం కలిగిస్తున్న పలువురిపై కేసులు నమోదు చేసినట్లు వైరా ఎస్సై పుప్పాల రామారావు తెలిపారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో హనుమాన్ బజార్, సత్రంబజార్, గాంధినగర్ ప్రాంతాల్లో గృహ నిర్మాణాల నిమిత్తం పలువురు రోడ్లపైన ఇసుక, కంకర, సెంట్రింగ్ ఇతర వస్తువులు రహదారులపై ఉంచి నిర్మాణాలు కొనసాగిస్తూ వాహనాలు, మనుషుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారని కాలనీవాసుల ఫిర్యాదులపై పది మందిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఎవరైనా రహదారులపై వస్తువులు, వాహనాలను అడ్డంగా నిలిపి ప్రజా సౌకర్యానికి భంగం కలిగించినట్లయితే సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఎస్సై రామారావు తెలిపారు.

# అలంకారప్రాయం.. ఆడింది శూన్యం!

### అక్కరకు రాని క్రీడా స్థలాలు, పరికరాలు

### గ్రామాలకు ఆమడ దూరంలో మైదానాలు

### వృథా అవుతున్న రూ.లక్షల ప్రజాధనం




**ప్రజాపక్షం/పినపాక :** గ్రామాల్లోని యువత, విద్యార్థులకు ఆటలతో ఆరోగ్యమైన జీవితం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. అంతవరకు బాగానే ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వాటి నిర్వహణ ఆయా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. లక్షల రూపాయల నిధులు ఖర్చు చేసి నిర్మించిన క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఖర్చులకు నిధులుగా మారాయి. తప్పితే వాటి వల్ల ప్రయోజనం కల్పించని దుస్థితి గ్రామాల్లో నెలకొంది. గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు గత బిఆర్ఎస్ సర్కారు ఒక్కో గ్రామానికి ఒక క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. అందుకు అవసరమైన నిధులను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా సమకూర్చింది. కానీ ఈమైదానాల వల్ల ఎవరికీ లబ్ధిచేకూరని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామపంచాయతీల్లో బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు. మరికొన్ని గ్రామాల్లో క్రీడామైదానాల్లో ఒక్కరోజు కూడా ఆడినదాఖలాలు లేవు. కేవలం అలంకారప్రాయంగా మారాయి.
మండలంలో 23గ్రామపంచాయతీలుండగా, అన్ని గ్రామాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామపంచాయతీకి రూ.లక్ష చొప్పున నిధులు, 30 గుంటల స్థలంలో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. కొన్ని గ్రామాల్లో స్థలం లేని కారణంగా,10 గుంటల స్థలంలో ఏర్పాటు చేశారు. కొందరు సర్పంచ్‌లు స్థలాన్ని చదును చేసే క్రమంలో గ్రామపంచాయతీ నిధులతో క్రీడా ప్రాంగణానికి అధిక మొత్తంలోనూ నిధులు ఖర్చు చేశారు. వీటిలో వ్యాయామానికి రెండు పోల్స్, రెండు వాలీబాల్ పోల్స్ వేయాల్సి ఉండగా వ్యాయామానికి సంబంధించిన పోల్స్ తప్ప వాలీబాల్ ఆటకు సంబంధించిన పోల్స్ ఎక్కడ కూడా కనిపించడం లేదు. పినపాక మండల పరిధిలోని క్రీడాప్రాంగణాలు ఒకటి,అర తప్పితే ఏ ఒక్క గ్రామ పంచాయతీ పరిధిలో ఉపయోగకరంగా నిర్మించినదాఖలాలు లేవు. గ్రామానికి దూరంగా ఏర్పాటుచేయడంతో అవి ఎక్కడున్నాయో కూడా తెలియనిపరిస్థితి నెలకొంది. దీంతో అవి అలంకారప్రాయంగా ఉన్నాయి. ప్రజాధనం నిష్ప్రయోజనంగా మారింది.

**గ్రామాల్లో దగ్గరగా ఉంటే ప్రయోజనం**
**కొప్పుల లక్ష్మణ్, వెంకట్రావ్ పేట గ్రామం...**

క్రీడాప్రాంగణాలు గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంవల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. క్రీడా స్థలం గ్రామంలో ఉంటే ఉదయం వ్యాయమాలు చేసేందుకు, క్రీడలు ఆడుకునేందుకు క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ స్థలంలోనైనా గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయాలి.

## భూ భారతిపై ప్రత్యేక దృష్టి సారించండి

**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి పథకంలో గ్రామాల వారీగా ప్రజాపాలన లో వచ్చిన దరఖాస్తుల ను వెంటనే పరిష్కరించుటకై ప్రత్యేక దృష్టి సారించాలని వరంగల్ జిల్లా నెక్కొండ మండల తహాసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె తాసిల్దార్ వేముల రాజ్ కుమార్‌ను గ్రామలలో నిర్వహించిన గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తు సంఖ్య ఎన్ని అని వివరాలు తెలుసుకొనారు. వెంటనే అందరూ సిబ్బంది టీములుగా ఏర్పడి గ్రామాలలో ఉన్న భూభారతి దరఖాస్తులు మొత్తం పరిష్కరించడానికి ప్రయత్నించాలని ఆదేశించారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో కీలకపాత్ర సర్వేయర్ దే ఉంటుందని అలాంటి సర్వేయర్ కార్యాలయంలో ఉండడం ఏంటి అని అసహనాన్ని వ్యక్తం చేశారు. భూభారతి కోసం కలెక్టర్ కార్యాలయం నుండి ప్రత్యేకంగా వచ్చిన డిప్యూటీ తాసిల్దార్ పవన్ కుమార్ ను,భూభారతి వివరాలు పనుల తీరును తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, నర్సంపేట డి ఏ ఓ శ్రీనివాస్, వరంగల్ డి ఏ ఓ పని కుమార్, రెవెన్యూ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య జయశంకర్ జయంతి

**ప్రజాపక్షం/ వరంగల్ :** ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణిలు పాల్గొని ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, డిటిడబ్ల్యూ సౌజన్య, కలెక్టరేట్ ఏవో విశ్వ ప్రసాద్, కలెక్టరేట్ కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## అయోధ్య అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హనుమకొండ :** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఖమ్మం మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామ్రేడ్ అయోధ్య రోడ్డు ప్రమాదంలో మరణించడం చాలా దిగ్భ్రాంతి కలిగించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వారి మరణం కమ్యూనిస్టు పార్టీకి, ప్రజలకు, కార్మిక ఉద్యమానికి తీరని లోటు అని శ్రీనివాసరావు అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసి హక్కులను సాధించిన నాయకుడు అని,పోడు భూముల పట్టాల సాధన కోసం అనేక ఉద్యమాలు చేశారని, వారి మరణం సిపిఐకి తీరని లోటని అన్నారు.వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, సానుభూతిని తెలియజేశారు.

## సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కాజీపేట :** భారత కమ్యూనిస్టు పార్టీ కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీవరకు రాష్ట్ర స్థాయిలో జరుగనున్న నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని బుధవారం కాజీపేట జంక్షన్‌లో సిపిఐ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దేల ఎల్లేష్, కాజీపేట మండల కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్, సహాయ కార్యదర్శి వేల్పుల సారంగపాణి యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు మునిగాల భిక్షపతి, రాసమల్ల దీనా, రీల్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రజా ఉద్యమ పార్టీ అని, ఇది దేశంలోని పేదలకు, శ్రామిక వర్గాలకు అండదండగా నిలిచిన రాజకీయ శక్తి అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న నాలుగవ మహాసభలు ప్రజా సమస్యలపై చర్చించే ఒక ముఖ్యమైన వేదిక అవుతాయని తెలిపారు. ప్రజలు ఈ సభలను జయప్రదం చేయడంలో భాగస్వాములవ్వాలని, పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని మొరిపిరాల గ్రామానికి చెందిన యాదవ కులస్థులు, బిఆర్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామంలో బుధవారం టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఝాన్సీరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బిసిలకు 42శాతం రాజకీయ ప్రాతినిధ్యం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, బిసిల ఎదుగుదల కోసం కాంగ్రెస్‌లో చేరిన ప్రతీ ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతే బిసిలకు పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, కొండూరు గోపాల్‌రెడ్డి, బిజ్జల సోమన్న, గుగులోతు భిక్షంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవాహంలో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించిన గంగ పుత్రులు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:**గోదావరి నదిలో ప్రమాదవశాత్తు లోతు ప్రవాహంలో పడి మునిగిపోతున్న ఓ వ్యక్తిని బుధవారం స్థానిక గంగపుత్రులు ప్రాణాలకు తెగించి కాపాడిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో గోదావరి తీరం వద్ద చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. మలహార్ మండలం పెద్దతూండ్ల (కిషన్ రావుపల్లి) గ్రామానికి చెందిన వ్యక్తి గోదావరి నదిలో పుణ్యస్నానం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు లోతు ప్రవాహంలో పడి మునిగిపోతుండగా తీరం వద్ద ఉన్న గంగపుత్రులు గమనించి వెంటనే ప్రాణాలకు తెగించి ఈదుకుంటూ వెళ్లి గోదావరి ప్రవాహంలో మునిగిపోతున్న వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.దీంతో ఆ వ్యక్తి బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకున్నాడు.

## గోల్డెన్ ఓక్ స్కూల్లో వైభవంగా 'ఇన్వెస్టిచర్' వేడుక




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** కాపువాడలోని గోల్డెన్ ఓక్ స్కూల్ తన వార్షిక ఇన్వెస్టిచర్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు అధికార బాధ్యతలు అప్పగిస్తూ, నాయకత్వానికి ప్రారంభ పుటను వేసింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ గంటా రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు శివనగర్ శాఖ ప్రిన్సిపాల్ మనోహర్ రావు, కాపువాడ శాఖ ప్రిన్సిపాల్ దీప్తి బాసాని కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు .తొలుత కార్యక్రమం ఒక ఆకర్షణీయమైన సాంస్కృతిక ప్రదర్శనతో ప్రారంభమైంది. అనంతరం ముఖ్య అతిథి మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ గుణాలు, క్రమశిక్షణ, సేవా దృక్పథం వంటి విలువల పెంపకం అవసరమని పేర్కొన్నారు. నాయకత్వం అనేది హోదా కాదు, అది బాధ్యత అని ఆయన సందేశమిచ్చారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ హెడ్, కల్చరల్ హెడ్, అలాగే నాలుగు హౌస్ ల కెప్టెన్ లు, వైస్ కెప్టెన్లకు బ్యాడ్జులు, సాషెస్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దీప్తి బసాని మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతంగా నడుచుకుని, తమ సహచరులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

# స్వరాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి

### జయశంకర్‌కు రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ నివాళులు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ ఏకశిలా పార్కులోని ఆచార్య జయశంకర్ విగ్రహానికి రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో, ప్రొఫెసర్‌గా ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ కుటుంబ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

**కలెక్టరేట్‌లో ఆచార్య జయశంకర్ సార్ జయంతి**

హనుమకొండ: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ జయంతి ఉత్సవాన్ని హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఆచార్య జయశంకర్ సార్ చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డిఆర్‌డిఓ మేన శ్రీను, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి శ్రీనివాసులు, ఇతర అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త జయశంకర్

### ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:**తెలంగాణ రాష్ట్ర సిద్దాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ జీవిత చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను జిల్లా ఉన్నతాధికారులు స్మరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని రాష్ట్ర పండగలాగా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమయంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదని, 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచి సలహాదారులుగా పని చేశారని, తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్‌కు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని, స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ దేవరాజ్, డిపిఆర్ఓ రఫిక్, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, సూపరింటిడెంట్ మంజుల, శివకుమార్, మాధవి, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్యకలాపాలపై లోక్ సభలో గళమెత్తిన ఎంపి కావ్య

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం లోక్‌సభలో సింగరేణి కంపెనీ (ఎస్సీఎస్‌ఎల్)పై కీలక ప్రశ్నలు అడిగారు. వరంగల్ ప్రాంతానికి సింగరేణి ఇచ్చిన ఉద్యోగాలు, ఎస్సీ అభ్యర్థుల నియామకాలు, భవిష్యత్తులో సింగరేణి విస్తరణ గురించి వివరాలు తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. అందులో భాగంగా 2020 నుండి 2025 వరకు వరంగల్‌లో 1,136 స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు వివరించారు.ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. సింగరేణి కారణంగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలతో పాటు ఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరగాలన్నారు. సింగరేణి ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత ఉండాలని స్పష్టం చేసారు. అలాగే, వరంగల్‌లో సింగరేణి విస్తరణ జరిగితే యువతకు మరిన్ని ఉద్యోగాలు వస్తాయని, జిల్లా అభివృద్ధి వేగవంతమవుతుందని ఎంపి అభిప్రాయపడ్డారు. సింగరేణి కంపెనీ విస్తరణకు వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సందర్భంగా ఎంపి డాక్టర్ కడియం కావ్య కోరారు.

# విధులను నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** విదుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని సస్పెన్షన్ చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. బుధవారం అటవీ ప్రాంతమైన పలిమెల మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పంకెన గ్రామంలోని కెజిబివి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో పాఠాలు చదివించారు. పాఠశాలలో స్టోర్ రూం,వంటగది,సైన్స్ ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మద్యాహ్న భోజనం చేసి భోజనంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నాణ్యత లోపించకుండా చూడాలని ఏదైనా జాప్యం లేదా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలతో పాటు అవసరమైతే సస్పెన్షన్ చేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేసారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని వారిలో ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలు రాబట్టొచ్చని అన్నారు. అనంతరం పలిమెల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సమీకృత కార్యాలయాల భవన నిర్మాణ పనులు,ఎమ్మార్సి భవనాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోడ్డు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని అన్నారు.ఇంటిగ్రేటెడ్ కార్యాలయ కాంప్లెక్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు..ఈ ప్రాంతం వెదురు మొక్కలు పెంపకానికి అనుకూలం కావడంతో వెదురు మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి,తహసీల్దార్ అనీల్,ఎంపిడిఓ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇండ్ల స్థలాలకు ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి




**ప్రజాపక్షం/శాయంపేట :** పేదలు ఇండ్ల స్థలాల కోసం ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. బుధవారం శాయంపేట మండలం పెద్దకొడేపాక శివారులో సిపిఐ ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసెల కేంద్రం వద్ద పార్టీ ఆఫీస్ కార్యాలయంలో సీపీఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ నాయకులు ఎండి అంకుషావలి అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి పాల్గొని మాట్లాడుతూ ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్ల స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, మండల కార్యదర్శి బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు ఎండి అంకుషావలి, వల్లాల రమేష్, బండారి సాంబయ్య, ముంద్రాతి రమేష్, గొట్టుముక్కల రాజు, బోగి రమేష్, బల్ల అనిల్, తీగలా కల్పనా, వైదుల రమా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు : వెంకట్రాములు



**ప్రజాపక్షం/ వరంగల్ :** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు అయోధ్య యాక్సిడెంట్‌లో అకాల మరణం ప్రజాఉద్యమాలకు తీరని లోటని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూర్యాపేట నుండి హైదరాబాద్ వెళుతుండగా బుధవారం ఉదయం కారు యాక్సిడెంట్ గురై ప్రమాదవశాత్తు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. సామ్యవాద సిద్ధాంతాలకు ఆకర్షితుడై సిపిఐలో చేరిన అయోధ్య అంచలంచలుగా ఎదిగి ఖమ్మం జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు ఎంతో సమర్థవంతంగా నిర్వహించారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సంక్షేమ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారని, వారి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని జోహార్పించారు. వారి మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతినితెలియజేశారు.

## శ్రీహేమచల ఫర్టిలైజర్ యజమాని అరెస్ట్

**ప్రజాపక్షం/మంగపేట:** మండలంలో కమలాపురం గ్రామానికి చెందిన శ్రీ హేమచల పర్టిలైజర్ యజమాని వేమ సురేష్ అరెస్ట్ మృతుని భార్య కొమురమ్మ తెలిపిన పూర్తి వివరాలు మండలంలో కమలాపురం గ్రామం సుభాష్ చంద్రబోస్ కాలనీ కి చెందిన పరమాత్ముల సమ్మయ్య అనే రైతు ఏడు ఎకరాలు కౌలు పొలం ఆడ మగ నాలుగు సంవత్సరాల నుండి వ్యవసాయం చేసేవాడు అతనికి వ్యవసాయం పెట్టుబడి వేమ సురేష్ పెట్టేవాడు ర్టిలైజర్ పెట్టుబడి లెక్కలు చేయమంటే జాప్యం చేస్తూ జరుపుతూ నాలుగు సంవత్సరాలు పెట్టుబడి లెక్కలు ఒక్క సారి చేసి రైతు సమ్మయ్య కు ఒక లక్ష నాలుబై వేలు వస్తాయని చెప్పి నాలుగు రోజుల రువాత లెక్కలు తప్పు జరిగాయి. పర్టిలైజర్ కు నాలుగు లక్షలు అప్పు నీవే తెలవని అనడంతో మనస్థాపనికి లోనై సురేష్ పర్టిలైజర్ లో కలుపు మందు కొనుక్కొని కౌలు పొలంలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కనే ఉన్నా రైతులు గమనించి హుటాహుటిన ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా సమ్మయ్య పరిస్థితి విషమించింది అని వరంగల్ ఏంజిఏం వెళ్ళమని వైద్యులు తెలుపగా వెళ్లే క్రమంలో మార్గ మధ్యలోనే మృతి చెందడని నా భర్త మృతికి శ్రీ హేమచల పర్టిలైజర్ యజమాని వేమ సురేష్ అని మృతుని భార్య కొమురమ్మ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన పిర్యాదు మేరకు ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన కమలాపురం గ్రామనికి చెందిన వేమ సురేష్ తండ్రి లక్ష్మి నారాయణ 48 అనే వ్యక్తిని బుధవారం పోలీస్ లు అరెస్టు చేసి ములుగు కోర్ట్ నందు హాజరు పరుచగా జిల్లా కోర్ట్ న్యాయమూర్తి నింధితుడికి జ్యూడిసియల్ రిమాండ్ నిమిత్తం పరకాల సబ్ జైల్ కు పంపించడం జరిగిందని ఎస్ఐ టీవిఆర్ సూరి ఓ మీడియా తెలిపారు.

## ఇందిరా మహిళాశక్తి ఆర్థిక భరోసాకు దిక్సూచి

### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం /జనగామ :**ఇందిరా మహిళాశక్తి ఎందరికో స్వయం ప్రతిపత్తి, ప్రభుత్వం అందిస్తున్న చేయూత ఆర్థిక బరోసాకు దిక్సూచి అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక అన్నారు. కోటీ మంది మహిళల్ని కోటీశ్వర్లుల్ని చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకోసమే మహిళాశక్తి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కళ్యాణి స్వయం సహాయక సంఘానికి చెందిన మంజుల అనే మహిళ 2లక్షల రూపాయల రుణంతో కల్టెరేట్ ముందు ఏర్పాటు చేసిన వనిత టీ స్టాల్‌ను బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళలు అర్ధికంగా ప్రగతి సాధించాలన్నారు. ఈ పథకం ద్వారా ఎందరో మహిళలకు ఆర్థిక బరోసా కలుగుతుందని, మహిళలు విజయవంతమైన వ్యవస్థాపకులుగా ఎదుగుతారన్నారు. ఏ ఒక్క మహిళ ఇతరులపై ఆదారపడకుండా స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక ప్రగతి సాధించడం జరుగుతుందన్నారు. వనిత టీ స్టాల్ ద్వారా ప్రతి రోజు మూడు వేలకు పైగా ఆదాయం సమకూరుతుందని, వనిత టీ స్టాల్ ద్వారా టీలు అమ్మడమే కాకుండా చేతి ఉత్పత్తుల అమ్మకం, భోజనంతో పాటు ప్రజలకు అవసరమై వస్తువులు అమ్మకాలు చేయవచ్చునన్నారు. కలెక్టర్ స్వయంగా స్టవ్ వెలిగించి, పాలు కాచారు. వ్యాపారం బాగా జరగాలని ఆకాక్షించారు. డిఆర్‌డిఏ పిడి, మున్సిపల్ కమీషనర్‌తో కలిసి టీ తాగారు. ఈ కార్యక్రమంలో ఎపిడి, డిపిఎం, స్వయం సహాయ సభ్యులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/ములుగు:** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని గోవిందరావుపే ట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అన్నారు. గోవిందరావుపేట మండ లం లక్నవరం సరస్సు నుండి పంటలకు సాగు నీరు అందించే కోట కాలువ పూడిక పనుల ప్రారంభోత్సవానికి గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ విచ్చేసి కొబ్బరికాయ కొట్టి పూడిక పనులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతన్నల పార్టీ అని, దేశానికి అన్నం పెట్టే రైతన్నకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, లక్నవరం సరస్సు నుండి పంటలకు సాగు నీరు అందించే కోట కాలువల పూడికకు నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు, నిధుల మంజూరు విషయంలో సహకరించిన జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిఆపరు. అలాగే కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు సంక్షేమ పార్టీ అని ఇప్పటికే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల పంట రుణాన్ని మాఫీ చేసిందని, పంటకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రైతు భరోసా పథకం ద్వారా సంవత్సరానికి రూ.12వేలు అందిస్తుందని, సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించి రైతన్నను ఆదుకుంటున్నదని అన్నారు. రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మికశాఖ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు పన్నాల ఎల్లారెడ్డి, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చింత క్రాంతి, బిసి సెల్ మండలాధ్యక్షుడు కాడబోయిన రవి, ఈక జగ్గారావు, రైతులు పాల్గొన్నారు.

## గుంతలు పూడ్పించిన పంచాయతీ అధికారి

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో రహదారులు వర్షం వల్ల గేటు ఇవతల గేటు అవతల ప్రాంతంలోని గ్రామంలోని అన్ని రహ దారుల్లో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులకు నిత్యం తీవ్రమైన ఇబ్బందులు ఏ ర్పడుతున్నాయి. దీన్ని గమనించిన పంచాయతీ కార్యదర్శి దయ్యాల సదానందం తమ సిబ్బందితో పట్టణ కేంద్రంలోని అన్ని రహ దారుల లోని గుంతలలో క్రషర్ నుండి చిప్స్ కంకర డస్ట్ తెప్పించి గుం తలు పూడ్చి ప్రజలకు సౌకర్యవంతమైన రహ దారిని ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ ప్రజలు పంచాయతీ కార్యదర్శి సదానందం ను అభినందించారు.

# భూపాలపల్లికి రైల్వే లైన్ ఏర్పాటు

### రైల్వే శాఖ మంత్రి ని కలిసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లికి రైల్వే లైను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి వర్యులు అశ్వినీ వైష్ణవ్ ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ గణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి,వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి గారినీ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భూపాలపల్లికి రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా కొత్త రైల్వే స్టేషన్, రైల్వే లైను ద్వారా పరిశ్రమలు ఏర్పాటుకి అవకాశం ఏర్పడుతుందని, బొగ్గు గనులకి నిలయమైన భూపాలపల్లికి కొత్త రైల్వేలైన్ అవసరం ఎంతగానో ఉందని బొగ్గు రవాణా, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా,రహదారి ప్రమాదాల నివారణకు దోహదపడుతుందన్నారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే తగిన నిర్ణయాలు తీసుకుంటాను" అని హామీ ఇచ్చారు.

# క్రీడ

## సెప్టెంబర్‌లో ఆసియా కప్..

# సెలెక్టర్లకు సవాల్‌గా జట్టు ఎంపిక!

### ఆ ముగ్గురికి ఛాన్స్ వచ్చేనా?



భారత జట్టు ఇంగ్లాండ్ పర్యటన ముగిసింది. ప్లేయర్స్ అంతా స్వదేశానికి తిరిగి వస్తున్నారు. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోన టీమిండియా అద్భుతంగా రాణించింది. ఇకపై భారత జట్టు ఆసియా కప్‌కు సన్నద్ధం కానున్నది. ఈ ఏడాది సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ మొదలు కానున్నది. ఈ సారి ఈ టోర్నీ టీ20 ఫార్మాట్‌లో జరగనున్నది. ఆసియా కప్ జట్టును ఎంపిక చేసేందుకు సెలక్షన్ కమిటీకి పెద్ద సవాల్‌గా మారింది. టీ20 జట్టు ఇటీవల కాలంలో నిలకడగా రాణిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల మూడోవారం వరకు ఆసియా కప్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటిస్తుందని భావిస్తున్నారు. జట్టులో చోటు కోసం యశస్వి జైస్వాల్, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ పోటీలో ఉన్నారు. సెప్టెంబర్ 28న జరిగే టీ20 టోర్నీలోని ఫైనల్‌కు భారత్ అర్హత సాధిస్తే.. కొద్దిరోజులకే వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్‌లో భారత్ వెస్టిండీస్ మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఐపీఎల్ చివరి సీజన్‌లో యశస్వి మంచి ఫామ్‌లో కనిపించాయి. 160 స్ట్రయిక్ రేట్‌తో 559 పరుగులు చేశాడు. గిల్ 15 మ్యాచుల్లో 155 కంటే ఎక్కువ స్ట్రయిక్ రేట్‌తో 650 పరుగులు చేరశాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుతో శుభ్‌మన్ గిల్‌తో ఓపెనింగ్‌కు దిగే సాయి సుదర్శన్ సైతం 156 స్ట్రయిక్ రేట్‌తో 759 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్‌ను దక్కించుకున్నాడు. ఈ ముగ్గురికి టీ20 జట్టులో చోటు కల్పిస్తారా? లేదా ఉన్నది చూడాల్సిందే. ఆసియా కప్‌లో ఆడే ప్లేయర్స్ అంతా ఫైనల్ వరకు 21 రోజులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. ఆసియా కప్ కోసం 17 మంది సభ్యులతో జట్టును ఎంపిక చేయనుండగా.. ప్రస్తుతం ఉన్న ఆప్షన్స్‌ను సెలెక్టర్లు జాగ్రత్తగా పరిశీలించన్నట్లు బీసీసీఐ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా తెలిపింది. ఆసియా కప్ యూఏఈలో ఆసియా కప్ జరుగనున్న విషయం తెలిసిందే. టీ20 ప్రపంచకప్‌ని బట్టి చూస్తే యశస్వి, గిల్, సాయి సుదర్శన్ టాప్ ఆర్డర్‌లో కీలక ఆటగాళ్లు అయ్యే అవకాశం ఉంది. సాయి సుదర్శన్ టీ20ల్లో అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అయితే, టీమిండియాకు బౌలింగ్ విభాగంలో ఇబ్బందికరంగా మారింది. కీలక టోర్నీకి ఫాస్ట్ బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఆసియా కప్ తర్వాత వెంటనే వెస్టిండిస్‌తో సిరీస్ నేపథ్యంలో వీరి విషయంలో సెలెక్టర్లు జాగ్రత్తలు తీసుకునే అవకాశాలున్నాయి. అదే సమయంలో సెలక్షన్ కమిటీ సమావేశానికి ముందు ఫిట్‌నెస్‌ను సైతం అంచనా వేయాలని భావిస్తున్నట్లు సమాచారం.



### ఐసిసి ర్యాంకింగ్స్ టెస్ట్ ర్యాంకింగ్స్..

# సిరాజ్‌కు అత్యుత్తమ ర్యాంక్


ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో అద్భుతంగా రాణించిన టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నాడు. ఓవల్‌లో జరిగిన చివరి ఓవల్ టెస్ట్‌లో సిరాజ్ కారణంగానే టీమిండియా ఆరు పరుగుల తేడాతో గెలవగలిగింది. దాంతో భారత్ సిరీస్‌ను 22 సమం చేయగలిగింది. ఐదో టెస్ట్ మ్యాచ్ చివరి రోజున మ్యాచ్, సిరీస్‌ను గెలవడానికి ఇంగ్లాండ్‌కు 35 పరుగులు అవసరం కాగా.. సిరీస్‌ను సమం చేయడానికి భారత్‌కు నాలుగు వికెట్లు అవసరం. ఐదోరోజు సిరాజ్ మూడు వికెట్లు కూల్చి భారత్‌కు విజయాన్ని కట్టబెట్టాడు. సిరాజ్ 12 ర్యాంకులు మెరుగుపరుచుకొని 15వ స్థానానికి చేరుకున్నాడు. హైదరాబాదీ బౌలర్‌కు ఇదే కెరియర్‌లో అత్యుత్తమ ర్యాంకు. ఇంతకు ముందు ఈ ఏడాది జనవరిలో 16వ ర్యాంక్ వరకు చేరాడు. వర్క్ మేనేజ్‌మెంట్ నేపథ్యంలో బుమ్రాకు విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో మూడు మ్యాచులు ఆడిన జస్ప్రీత్ బుమ్రా 889 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ సైతం అత్యుత్తమంగా 59వ ర్యాంక్‌కు చేరుకుదున్నారు. భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఓవల్ టెస్ట్‌లో సెంచరీ సాధించి తిరిగి టాప్5లో చోటు దక్కించుకున్నాడు. యశస్వి మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 5వ స్థానానికి చేరుకున్నాడు. టాప్10లో ఉన్న మరో బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ ఒక స్థానం దిగజారి 8వ ప్లేస్‌కు చేరుకున్నాడు. గాయం కారణంగా పంత్‌కు దూరమైన విషయం తెలిసిందే. దాంతో ఓవల్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ జో రూట్ అద్భుత బ్యాటింగ్ చేయగా.. ప్రస్తుతం బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సెంచరీ హీరో హ్యారీ బ్రూక్ రెండో స్థానానికి చేరుకున్నాడు. బౌలర్లలో ఇంగ్లాండ్‌కు చెందిన ఫాస్ట్ బౌలర్ గస్ అట్కిన్సన్, జోష్ టంగ్ సైతం కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంకింగ్స్‌కు చేరుకున్నారు. అట్కిన్సన్ తొలిసారిగా టాప్ 10లోకి ప్రవేశించగా.. టంగ్ 14 స్థానాలు మెరుగుపడి 46వ స్థానానికి చేరాడు.



## చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్..

అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టీ20 క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు సాధించాడు. పొట్టి ఫార్మాట్ క్రికెట్‌లో 650 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డులకెక్కాడు. ఇంగ్లాండ్ వేదికగా జరుగుతున్న ది హండ్రెడ్ లీగ్ ఆరంభ మ్యాచ్‌లో ఈ ఘనతను సాధించాడు. ఓవల్ ఇన్విన్సిబుల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రషీద్ ఖాన్ లండన్ స్ప్రిరిట్‌తో జరిగిన లీగ్ ఆరంభ పోరులో విజృంభించాడు. 20 బంతుల్లో (3/11) అదరగొట్టాడు. 15 డాట్ బాల్స్ చేసిన రషీద్ వేన్ మాడ్సెన్, లియామ్ డాసన్, ర్యాన్ హిగ్గిన్స్‌ను ఔట్ చేశాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే తొలుత బ్యాటింగ్ చేసిన లండన్ స్పిరిట్ జట్టు 94 బంతుల్లో 84 పరుగులే చేసి ఆలౌటైంది. ఆ జట్టుకు ఆడుతున్న స్టార్ బ్యాటర్లు డేవిడ్ వార్నర్ (9), కేన్ విలియమ్సన్ (9) విఫలమయ్యారు. ఓవల్ ఇన్విన్సిబుల్స్ 4 వికెట్లు కోల్పోయి 31 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది.

# ఫోకస్






## పురాతన 'స్టార్ మ్యాప్'

దాదాపు ఒకటిన్నర శతాబ్దాలుగా కొనసాగుతున్న పరిశోధనలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఒకొక్కరూ ఒక్కో సిద్ధాంతాన్ని వెల్లడిస్తున్న 'క్యూనిఫామ్ క్లే టాబ్లెట్' రహస్యాన్ని పరిష్కరించడానికి జరుగుతున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చాయి. 'కోఫెల్ ప్రభావ సంఘటన'గా పిలిచే ఈ వృత్తాకార చిన్న ఫలకాన్ని 19వ శతాబ్దం చివరిలో, ఇరాక్‌లోని నినెవెలోని కింగ్ అషుర్బానిపాల్ వద్ద జరిపిన పురతత్వ తవ్వకాల్లో బయటపడింది. ఆకాశంలోని తారలు, ఇతర ఖగోళ అంశాలను ప్రతిబింబించే ఈ రాతి బిళ్ల అస్సిరియన్ కాలానికి చెందినట్టుగా భావించారు. కానీ, అత్యాధునిక కంప్యూటర్ విశ్లేషణ దీనిని క్రీస్తు పూర్వం 3300 ప్రాంతానికి చెందినదిగా నిర్ధారించింది. నాటి మెసొపొటేమియా ప్రాంతంలో ఆకాశంలో కినిపించిన దృశ్యాలతో దీనిని సరిపోల్చవచ్చని పరిశోధకులు అంటున్నారు. అత్యంత పురాతనమైన సుమేరియన్ మూలాలకు చెందినదిగా వారు చెప్తున్నారు. బహుశా ఇది మొట్టమొదటి 'ఆస్ట్రోలాబ్' (ఖగోళ పరికరం) కావచ్చన్న అభిప్రాయానికి వచ్చారు. మొత్తం మీద ఈ టాబ్లెట్ వసుయ 5500 సంవత్సరాలు. దీని అంచులపై చెక్కిన కోణాలు, కొలతలు ఆధునిక ఖగోళ అధ్యయనాన్ని పోలి ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది.

## ప్రపంచ చరిత్ర అంటే..

ప్రపంచ చరిత్ర అనేది మానవ మనుగడ మొదలు నేటి వరకు జరిగిన యథార్థాల అధ్యయనం. ఈ అధ్యయనం పురాతత్వశాస్త్రం, మానవ పరిణామ శాస్త్రం, జన్యుశాస్త్రం, భాషాశాస్త్రం, ఇతర సంబంధిత శాస్త్రాల ఆధారంగా జరుగుతుంది. చరిత్రలో మానవుడు వ్రాత పద్ధతిని కనిపెట్టిన మొదలు, వివిధ వనరుల ఆధారంగా, అధ్యయనాల ఆధారంగా, ప్రపంచ చరిత్రను నిర్వచించగలుగుతాం. మానవుడు లికనిపెట్టక ముందు ప్రాక్ చరిత్ర తొలి రాతి యుగంతో మొదలై కొత్త రాతి యుగం (నియోలిథిక్, నియో కొత్త, లిథిక్ రాయి) వరకు కొనసాగింది. కొత్త రాతి యుగంలో క్రీస్తుపూర్వం 8000 నుండి క్రీస్తుపూర్వం 5000 మధ్య వ్యవసాయ విప్లవం మొదలైంది. వ్యవసాయం మానవ చరిత్రలో ఒక పెద్ద ఘట్టం. అప్పటి దాకా సంచారులై తిరుగుతున్న మనుషులు ఒక చోట స్థిరపడి పంట పండించుకొని తినడం మొదలుపెట్టారు. వ్యవసాయానికి పనికొచ్చే మొక్కలను, చెట్లను, జంతువులను మనిషి తనకనువుగా మచ్చిక చేసుకోవటం ప్రారంభమైంది. వ్యవసాయం మెరుగు అయ్యేకొద్ది మనిషి సంచారజీవితాన్ని వదిలేసి స్థిరనివాసాలను ఏర్పాటు చేసుకోవడం, ఎక్కువ ప్రయాస లేకుండా ఆహారం అందుబాటులోకి రావటం, వ్యవసాయ మెరుగుదలతో పెరిగిన రాబడి పొందడం వల్ల స్థిర నివాసాలు విస్తరించాయి. రవాణా వ్యవస్థ వికాసం వలన మరింత మెరుగయ్యాయి.





# నగరాలకు కొత్త భాష్యం!

ప్రపంచ పురాతన నగరాల చరిత్రకు వివిధ పరిశోధనలు కొత్త భాష్యాన్ని చెప్తున్నాయి. పురావస్తు ఆవిష్కరణలు చరిత్ర కథనాన్ని తిరగ రాస్తున్నాయి. నిన్నమొన్నటి వరకూ చరిత్రలో మొట్టమొదట నగరాలు మెసొపొటేమియా లేదా మధ్య ఆసియాలో వెలిశాయన్న సిద్ధాంతం సరైనది కాదేమోనన్న అనుమానాలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. ఉక్రేన్‌లో జరిపిన పురావస్తు తవ్వకాలతో వెలుగు చూసిన అంశాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. స్విస్ న్యూయూ జర్చర్ జైటుంగ్ ప్రచురణను అనుసరించి, ప్రపంచంలోనే అతి పురాతనమైన, అతి పెద్ద నగరాన్ని పరిశోధకులు ఉగ్రేన్‌లో గుర్తించారు. దానిపై పరిశోధనలు చేస్తున్నారు. ఈ పురావస్తు తవ్వకాలు ప్రారంభించిన సైటు కనీసం 4000 సంవత్సరాల క్రితం నాటిదని అంచనా. కీల్ విశ్వవిద్యాలయ పురావస్తు శాస్త్రవేత్త జోసెఫ్ ముల్లర్ 2011లో ఉక్రేన్‌లోని ఈ పెద్ద స్థావరాలపై పరిశోధన చేయడం ప్రారంభించినప్పటికీ, దానిపై చరిత్రకారులు తొలుత అంతగా ఆసక్తి ప్రదర్శించలేదు. అనంతరకాలంలో, భౌగోళిక అయస్కాంత పద్ధతులు ఉపయోగించడం ద్వారా పరిశోధకులు భూమి ఉపరితలం కింద ఉన్న నిర్మాణాలను ఆవిష్కరించారు. 100 హెక్టార్లకుపైగా విస్తరించిన ట్రిపిలియా మెగాసైట్‌లను కనుగొన్నారు. రాతియుగం ముగింపు, కాంస్య యుగం ఆవిర్భావం మధ్య అనేక జనావాసాలు, పట్టణాలు, నగరాలు ఉన్నాయని ఉక్రేనియన్ సైట్‌లోని నిర్మాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆవిష్కరణ, ఇప్పటి వరకూ పురావస్తు శాస్త్రజ్ఞులు తమకు తెలుసని భావిస్తున్న ఎన్నో అభిప్రాయాలను మారుస్తుంది. ట్రిపిలియా మెగాసైట్‌లు, తొలి ప్రణాళికాబద్ధమైన నగరాలుగా గుర్తింపు పొందుతున్నాయి. ఇవి వృత్తాకారంగా లేదా కోడిగుడ్డు ఆకారంలో



ఉండేవని తెలుస్తోంది. కేంద్రీకృత వలయాల్లోనే ఇళ్లు నిర్మించడాన్ని ఇక్కడ చూడవచ్చు. బౌలేవార్డ్‌లు లేదా విస్తృత కారిడార్‌లు కూడా కనిపిస్తాయి. వీటిని మానవాళి యొక్క మొదటి ప్రణాళికాబద్ధమైన నగరాలుగా ఎన్‌జెడ్‌జెడ్ పేర్కొంది.అత్యంత విశేషమైన సైట్ మొనాకో పరిమాణాన్ని మించిపోయిందని వ్యాఖ్యానించింది. మొత్తం మీద పురాతన నగరాల చరిత్రకు కొత్త భాష్యం చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.

## మధ్యాహ్న భోజన కార్మికుల

# సమస్యలు పరిష్కరించండి


భూపాలపల్లి...



ఖమ్మం...

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు డిమాండ్

### కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో నిరసన చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి అందజేశారు. కార్యక్రమానికి నర్సింహారావు హాజరై మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులకు సకాలంలో బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వంట కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, దండు ఆదినారాయణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మినారాయణ, గుండెపంగు మల్లేష్, పిల్లి భాస్కర్, రామారావు, నాగరాజు, రంజాన్‌బీ, పిల్లి బుచ్చాలు, వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు కుంట వెంకమ్మ, మహదేవ లక్ష్మి, కృష్ణకుమారి, నెల్లూరు కోటమ్మ, నంది ని, సూరమ్మ, రాజమ్మ, తెల్లా రాణి, కనకమ్మ, మరియమ్మ, సీత, సత్యావతి, నాగలక్ష్మి, శివకుమారి పాల్గొన్నారు.

**ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంఇఒ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా చేశారు. యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు గడ్డం లలిత మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం కార్మికులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి నర్రా స్వరూప, కార్మికులు రమ, పుష్ప, స్వరూప,ఉమ, జయ, విమల, కవిత, సిపిఐ మండల కార్యదర్శి శనిగరపు రాజకుమార్, తండ మొండయ్య, అరెపల్లి చంద్రమౌళి పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ ఎఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండిఎం జిల్లా అధ్యక్షురాలు స్రవంతి, లక్ష్మి, రాజమణి, సాయమ్మ, గంగామణి, రూపం పాల్గొన్నారు.


**భూపాలపల్లి :**మధ్యాహ్న భోజన వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్‌తో కలిసి నిరాహార దీక్షలు నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన వర్కర్స్‌కు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గౌరవ వేతనం రూ.పదివేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు స్వర్ణలత, సంపూర్ణ, లావణ్య లక్ష్మి సుగుణ, పద్మ, మణెమ్మ, కమల, భారతి పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నేషనల్ పే స్కేల్ చెప్పిన విధంగా నెలకు 26 వేల వేతనం చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎఐటియుసి కార్మిక భవనంలో సమావేశం జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఉపాధ్యక్షులు పంతం రవి, కె.వి అనసూర్య, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మీసం లక్ష్మన్, ఎల్ల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

**దేవరకొండ :** ఎఐటియుసి రాష్ట్ర కమిటిటీ పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై బుధవారం దేవరకొండ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒవినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లాఅధ్యక్షుడు నూనె రామస్వామి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వర్కర్స్ వంట బకాయి బిల్లులు, జీతాలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ హామీలో భాగంగా రూ.10వేల వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రాములు, మండల కార్యదర్శి మల్లయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల కార్యదర్శి ధనలక్ష్మి, నారయ్య, అజీబేగం, వెంకటయ్య, వెంకటమ్మ, సాయిలు, శోభారాణి, మౌనిక, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి...


నిజామాబాద్...



సిరిసిల్ల...



దేవరకొండ...

## ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు

### సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్

ప్రజాపక్షం/భూపాలపల్లి : ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లాలో జరగనున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో రాష్ట్ర మహాసభ పోస్టర్లు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురిజాపల్లి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్, నూకల చంద్రమౌళి, తాళ్ల పోషం, ఎండి కరిముల్లా, యాకూబ్ పాషా, నాయకులు తిరుపతిరెడ్డి, శ్రావణ్ కుమార్, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# వీరోచిత పోరాటాల చరిత్ర సిపిఐ సొంతం

### తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హనుమకొండ :** దేశ స్వాతంత్ర్య పోరాటంలో వేలాదిమంది బలిదానం చేసిన వీరోచిత పోరాటాల చరిత్ర సిపిఐ సొంతం అని, పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరుగుతున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి మాట్లాడుతూ దేశంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా..నియంత నైజామును మెడలు వంచి దొరల గడీలను కూలగొట్టి స్వేచ్ఛ వాయువులను ప్రజలు పీల్చుకునేలా పోరాడింది సిపిఐ మాత్రమేనన్నారు. భూసంస్కరణ అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించి అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడాలని ఉద్యమాలు చేసిన పార్టీ సిపిఐ అన్నారు. మతసామరస్యం కోసం, లౌకికరాజ్యం కోసం, భారత రాజ్యాంగాన్ని కాపాడడం కోసం విశ్రమించని వీరోచిత పోరాటాల పార్టీ సిపిఐ అన్నారు. దేశవ్యాప్తంగా శాఖలు కలిగి ప్రజలకు అండగా వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న సిపిఐని ప్రజలు ఆదరించాలని కోరారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20, 21, 22 తేదీలలో మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో జరుగుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పార్టీని ప్రజాసంఘాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించుట కోసం, భవిష్యత్తు కార్యాచరణ చేపట్టేందుకు ఈ మహాసభలలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. మహాసభలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి,బత్తిని సదానందం,నకీర్త ఓదెలు, మంచాల రమాదేవి, మాలోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## భట్టుపల్లి పాఠశాలలో షీటీంపై అవగాహన



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :**కాగజ్‌నగర్ మండలంలోని జడ్‌పిహెచ్ఎస్ బాలికల పాఠశాలలో బుధవారం షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి ఎఎస్ఐ సునిత మాట్లాడుతూ విద్యార్థినులకు భద్రతా చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100, సోషల్ టిసింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినిలు ఎవరైనా వేధింపులకు గురైనట్లయితే వెంటనే కాగజ్‌నగర్ షీటీం 8712670565 నెంబర్‌కి సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా ఎఎస్‌పి చిత్తరంజన్ ఆదేశాల మేరకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేద ప్రజల కల సాకారం..



**ప్రజాపక్షం/ముధోల్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లలో గూడులేని పేదప్రజల కల సాకారమవుతోందని మండల కాంగ్రెస్ యువ నాయకులు రావుల శ్రీనివాస్ అన్నారు.బుధవారం మండలంలోని అష్టా గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మొదటి దశ పూర్తి కాగా లబ్ధిదారులకు బిల్లులు పడేలా స్థానిక పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తో ఫోటోలను అప్లోడ్ చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పథకాల అమలును పకడ్బందీగా చేపడుతోందని వెల్లడించారు.నిరుపేదల సంక్షేమం,అభివృద్ధిని చిత్తశుద్ధితో పని చేస్తూ ఒక దిశా నిర్దేశంతో ముందుకెళ్తోందని పేర్కొన్నారు.కాంగ్రెస్ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందుతాయన్నారు.ముధోల్ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి,మండలసేవాదళ్అధ్యక్షుడు,గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

## పౌల్ట్రీ ఫారాలలో యూరియా వాడకంపై ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలో గల మహమ్మద్ నయిమ్ పౌల్ట్రీ ఫారంలో అక్రమ యూరియా వాడకంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ కమీషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సంయుక్త తనిఖీలో యూరియా నిల్వలు ఏమీ లేవని అధికారులు నిర్ధారించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్, ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వర్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. పౌల్ట్రీ ఫారంలో క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం, అక్కడ ఎలాంటి యూరియా నిల్వలు లేవని అధికారులు ధ్రువీకరించారు. పౌల్ట్రీ పరిశ్రమలో యూరియా అక్రమ వాడంకపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి నేపథ్యంలోనే ఈ ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ తెలిపారు. రైతులు, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే అక్రమ పద్ధతులను అరికట్టడానికే ఈ తనిఖీలు అన్నారు.

## నగరం గ్రామాన్ని ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నిజాంపేట్ :**నగరం గ్రామంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా మండల ఎంపిడిఒ రాజిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి గ్రామంలో జరుగుతున్న డ్రై డే పనులను పర్యవేక్షించి, నీటి నిల్వలు ఉన్న చోట దోమల లార్వాలు పెరగకుండా ప్రతి వారానికి ఒకసారి నీటి తొట్టెలు శుభ్రం చేసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, అంగన్వాడీ టీచర్ స్వప్న, ఆశ వర్కర్ స్వప్న, గ్రామ కాంగ్రెస్ నాయకులు , మహిళా సంఘం సభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేద్దాం



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని జిల్లాలో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌తో కలిసి నిర్వహించిన రెడ్‌క్రాస్ అడ్‌హాక్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ కార్యకలాపాలు సమర్థవంతంగా కొనసాగాలంటే సభ్యుల పాత్ర కీలకం. ప్రతి సభ్యుడు కనీసం 100 మందిని సభ్యులుగా చేర్చి, సంఘాన్ని బలోపేతం చేయాలని కోరుతున్నాం. అన్ని వర్గాల నుంచి సభ్యత్వం కల్పించాలి. త్వరలో 10 మంది సభ్యులతో మేనేజింగ్ కమిటీని ఏర్పాటు చేస్తాం అన్నారు. అడ్వైజరీ స్థాయిలో ఇప్పటికే ఐదుగురు సభ్యులతో అడ్ హాక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అడ్ హాక్ కమిటీ సభ్యులు, పర్యవేక్షకుడు జితేందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆమె అక్కడికి.. ఈయన ఇక్కడికి...



**ప్రజాపక్షం / ఆర్మూర్:**ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి గ్రేడ్ 1 కార్యదర్శిగా జి. పరమేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సిద్దిపేట్ జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తు ఆర్మూర్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న భారతి బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న భారతి మాట్లాడుతూ నాకు సహకరించిన మార్కెట్ కమిటి కార్యాలయ సిబ్బందికి మార్కెట్ కమిటి పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుఎఎంసి డైరెక్టర్ సురకంటి చిన్నారెడ్డి, ఎఎంసి వైస్‌చైర్మన్ ఇస్సాపల్లి జీవన్ బదిలీపై వెళుతున్న భారతికి వీడ్కోలు పలుకుతూ నూతన బాధ్యతలు స్వీకరించిన పరమేశ్వర్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో గద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటి గ్రేడ్ 1 కార్యదర్శి జాన్, సూపర్వైజర్ బాలకృష్ణ, డిఒ మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**నిర్మల్ గ్రామీణ మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ,ఇంటి నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.దశలవారీగా పనులు పూర్తయిన వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు.ఇంటి నిర్మాణాన్ని వేగంగా,నాణ్యంగా పూర్తి చేసుకోవాలని సూచించారు.అలాగే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండ్ల వివరాలను కలెక్టర్ సమీక్షించారు. ఇసుక సహా ఇతర నిర్మాణ ముడి సరుకుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సంతోష్,ఎంపిడిఒగజానన్,ఎఇ,అధికారులు పాల్గొన్నారు.

**పాఠశాలల్లో నైపుణ్యాభివృద్ధి పై దృష్టి సారించాలి..**

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా బోధన కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.బుధవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని రత్నాపూర్ కాండ్లి



గ్రామ ప్రభుత్వ జెడ్‌పి హై స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా తరగతులను పరిశీలించి,విద్యార్థుల హాజరుతోపాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల సరఫరాపై ఆరా తీశారు.విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్,వారికి పాఠాలు చదివించడంతో పాటు లెక్కలు చేయించారు.పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం ఇప్పటి నుంచే పకడ్బందీగా సన్నద్ధమవాలని సూచించారు .విద్యార్థులు రూపొందించిన భారతదేశ భౌగోళిక పటాన్ని పరిశీలించి మెచ్చుకున్న కలెక్టర్,ప్రతి పాఠశాలలో ఇలాంటి పటాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు.నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని ప్రతిరోజు అందించాలన్నారు.వంటకు కట్టెల పొయ్యి బదులుగా ఎల్‌పిజివాడాలని సూచించారు.వంటగది,డైనింగ్ హాల్, నిల్వ గదులు పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆరవ తరగతి విద్యార్థిని అక్షయ కలెక్టర్ ఫోటో ఆధారంగా గీసిన బొమ్మను అందించగా,కలెక్టర్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోసిన కలెక్టర్,వాటి సంరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమన్నారు.కిచెన్ గార్డెన్ లో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి కూరగాయల విత్తనాలను నాటారు.అక్కడ పండే కూరగాయలను మధ్యాహ్న భోజనంలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు,తహసిల్దార్ సంతోష్,ఎంపిడిఒగజానన్,ఎంఇఒ వెంకటేశ్వర్లు,అధికారులు,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## 108 సేవలపై నిఘా పెంపు



**ప్రజాపక్షం / జైపూర్ :**అత్యవసర వైద్య సేవలందించే 108 అంబులెన్స్‌ల పనితీరుపై నిఘా పెంచినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజు తెలిపారు. బుధవారం జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన, జిల్లాలోని అంబులెన్స్ సేవలు, అం దులో ఉన్న మెడికల్ ఎక్విప్‌మెంట్ పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్స్‌లు కాల్ వచ్చిన 30 సెకన్లలోనే స్పందించాల్సిందే. వాహనాల్లో మానిటర్, బిపి అపరేటర్, ఆక్సిజన్ సిస్టం, అంబు బ్యాగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రెస్సింగ్ మెటీరియల్, ఎమర్జెన్సీ మందులు సిద్ధంగా ఉండాలి. ఎప్పటివరకు ఎంతమందికి సేవలు అందించాయన్న వివరాలు ప్రతి అంబులెన్స్ దగ్గర నమోదు ఉండాలి అని తెలిపారు. జిల్లాలోని 18 అంబులెన్స్‌లను తనిఖీ చేస్తున్నామని, వాటి పనితీరును పైస్థాయికి నివేదిస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ వంటి సేవలపై సిబ్బంది శిక్షణ, ప్రతిస్పందనపై కూడా తనిఖీ చేసినట్టు వివరించారు. జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై కూడా సమీక్ష చేపట్టిన డాక్టర్ హరీష్ రాజు మాట్లాడుతూ వైద్యులు సమయానికి హాజరవుతుండాలి. సెలవులు మంజూరు చేయరాదని ఆదేశించాం. గర్భవతుల పూర్తి నమోదు, సాధారణ ప్రసవాల ప్రోత్సాహం, ఆడపిల్ల ప్రాధాన్యతపై ప్రచారం జరగా లి. బిపి, షుగర్, క్యాన్సర్ లాంటి అసంక్రమణ వ్యాధులపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి. గ్రామపంచాయతీల సహకారంతో ముందస్తు చర్యలు తీసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్యులు డాక్టర్ అశోక్, డాక్టర్ ము స్తాఫా, సిబ్బంది వెంకట సాయి, 108 కోఆర్డినేటర్ సంపత్, సిబ్బంది లక్ష్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూముల కోసం పాదయాత్ర

### దిందా గ్రామస్తుల ర్యాలీ, హైదరాబాద్‌కు కాలి నడక




**ప్రజాపక్షం/చింతలమానేపల్లి :**పోడు భూములపై హక్కుల సాధన కోసం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలానికి చెందిన దిందా గ్రామ రైతులు బుధవారం పాదయాత్ర ప్రారంభించారు. సుమారు 20 మంది రైతులు గ్రామం నుండి హైదరాబాద్ దాకా కాలినడకన వెళ్లేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నేళ్లుగా సాగుచేసుకుంటున్న పోడు భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనపరచుకునేందుకు కంచెలు వేస్తున్నారు. పంటలు వేయకుండా అడ్డుకుంటున్నారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న మేము, హైదరాబాద్ వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, అధికారులకు మా గోడును చెప్పేందుకు పాదయాత్ర చేపట్టాం అని ఆవేదన వ్యక్తం చేశారు. దిందా నుంచి హైదరాబాద్ వరకు సుమారు 400 కి.మీ. దూరం ఉండటంతో వారం రోజులపాటు పాదయాత్ర కొనసాగనుంది. పోడు భూముల రక్షణకు తమదైన పోరు చేయాలన్న సంకల్పంతో రైతులు పాదయాత్ర చేస్తుండగా, పలువురు మద్దతు తెలిపారు. సంబంధిత అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే భూవివాదాలకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

## జన్నారం మీదుగా భారీ వాహనాలకు అనుమతి

### సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కళిందర్ అలీ ఖాన్ డిమాండ్



**ప్రజాపక్షం/జన్నారం :**అటవీ శాఖ ఆంక్షలతో జన్నారం, కడెం, దండేపల్లి మండలాల అభివృద్ధి నిలిచిపోయిందని, వెంటనే భారీ వాహనాల రాకపోకలపై నిషేధాన్ని ఎత్తివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కళిందర్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం జన్నారం మండల కేంద్రంలో ప్రజా ఉద్యమంగా సాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ నిషేధం వల్ల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యవసరాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. నిర్మాణరంగం కుంటుపడటంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. వ్యవసాయ మండలాలు కావడంతో విత్తనాలు, ఎరువులు, మందుల ధరలు భారం అయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తక్షణమే ఈ ఆంక్షలను ఎత్తివేసి, ప్రజలకు ఉపయోగపడే విధంగా చట్టాలు తీసుకురావాలని కోరారు. ప్రజావ్యతిరేక నిర్ణయాల వల్ల తిరుగుబాటు చైతన్యం వెలిసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి, జిల్లా సమితి సభ్యుడుదేవి పోచన్న, మండల కన్వీనర్ మామిడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో.. గ్రూపులను ప్రోత్సహిస్తున్న మైనంపల్లి



**ప్రజాపక్షం/గజ్వేల్:**గజ్వేల్‌లో జరిగిన రేషన్ కార్డుల పం పిణీ కార్యక్రమంలో ఎలాంటి ప్రోటోకాల్ లేని కొండపా క విజయ్ వేదికపైకి వెళ్లి గొడవ సృష్టించగా, ఆయనపై కేసు నమోదు చేయాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా డిసిసి అ ధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిపై అట్రాసి టీ కేసు నమోదు చేయడం సిగ్గుచేటని దళిత సంఘాల నేత లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో గ్రూపులను ప్రోత్సహిస్తున్న మైనంపల్లి హన్మంతరావు చర్యలను నిరసిస్తూ, బు ధవారం గజ్వేల్ పట్టణంలో దళితులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నేతలు తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గం లో కెసిఆర్, హరీష్ రావు లాంటి దొరలకు వ్యతిరేకంగా పో రాటం చేస్తూ దళితులకు అండగా నిలిచి ప్రోత్సహిస్తున్న న ర్సారెడ్డిపై అక్రమంగా అట్రాసిటీ కేసు నమోదు చేయించ డ ం సిగ్గుచేటని నిలదీశారు. స్వప్రయోజనాల కోసం అట్రాసి టీ చట్టాన్ని దుర్వినియోగం చేయడం పట్ల వారు ఆందోళ న వ్యక్తం చేశారు. నర్సారెడ్డిపై అక్రమంగా నమోదు చేసిన కే సును పోలీసులు విరమించని పక్షంలో ఆందోళనలు చేపడతామనివివరించారు.కార్యక్రమంలో,తదితరులుపాల్గొన్నా రు.

## తెలంగాణ తల్లి రూపురేఖల్ని మార్చడం దురదృష్టకరం

### సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతాప్రభాకర్



**ప్రజాపక్షం /సంగారెడ్డి :**సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి రూపురేఖల్ని మార్చడం దురదృష్టకరమని సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతాప్రభాకర్ కాసాల బుచ్చి రెడ్డి లు ఆవేదనని వ్యక్తం చేసారు. సంగారెడ్డి జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహాలు తొలగించవద్దని జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్యకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వినతి పత్రం అందజేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో 02.06.2015 నాడు తెలంగాణ తల్లి విగ్రహాన్ని అప్పటి మంత్రి తన్నీరు హరీష్‌రావు ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్, అప్పటి కలెక్టర్ రాహుల్ బొజ్జా అప్పటి అందోల్ ఎమ్మెల్యే బాబు మోహన్, అప్పటి నర్సాపూర్ మదన్ రెడ్డి అందరూ కలిసి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారని మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చి రెడ్డి అన్నారు. 2001లో కెసిఆర్ ఉద్యమ ప్రారంభం తరువాత తెలుగు తల్లి సెంటిమెంట్ ఆంధ్రపాలకులు ప్రస్తావించేవారు. ఉద్యమ సమయంలో బిఎస్ రాములు తెలంగాణ తల్లికి రూపాన్ని ఇచ్చే ప్రయత్నం చేశారన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాలు తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మూడు సంవత్సరాల కాలంలో మళ్లీ వచ్చేది బిఆర్‌ఎస్ ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో చింత సాయినాథ్,జీవి శ్రీనివాస్ ,వీరేశం ,ముబీన్, విఠల్ తదితరులు ఉన్నారు.

## అటవీశాఖ అధికారులపై చర్యలు

### జిల్లా అటవీశాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**రైతు ఆత్మహత్యయత్నానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు రామావత్ మోహన్‌నాయక్ కోరారు. బుధవారం అటవీశాఖ ఉన్నతాధికారులకు బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. బైరాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో పోడు భూమిలో వేసిన పంటలైన గడ్డి మందు పిచికారి చేసి ప్రకాష్ అనే గిరిజనుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోవటానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మోపాల్ మ ండల మాజీ జెడ్‌పిటిసి నరేష్‌నాయక్ సారథ్యంలో దక్షిణ మండలం అటవీశాఖ అధికారి రాధికకు వినతిప త్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్‌పిటిసి నరేష్, జిల్లా అధ్యక్షుడు రామావత్ మోహన్‌నాయక్ మాట్లాడుతూ మోపాల్ మండలంలోని బైరాపూర్ గ్రామానికి చెందిన ప్రకాష్ మోజీరాం నాయక్ తండా వద్ద తరాతరాలుగా పోడు భూమిలో సాగు చేస్తున్నారని గత ప్రభుత్వం గిరిజనులకు పట్టాలు ఇవ్వటంతో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. గిరిజన హక్కుల చట్టాన్ని ఉల్లంఘిస్తూ అటవీ అధికారుల బృందం పంటలను నాశనం చేయటం సమంజసం కాదన్నారు. మొక్కజొన్న పంటపై గడ్డి మందు (హీర్బైడ్) పిచికారి చేసి ప్రకాష్ కుటుంబానికి తీవ్ర నష్టం కలిగించారన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక అటవీశాఖ అధికారుల తీరును నిరసిస్తూ అక్కడే ఉన్న గడ్డి మందును సేవించి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించడం తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామావత్ మోహన్‌నాయక్, ప్రధాన కార్యదర్శి కేతావత్ పీర్‌సింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు 'సైబర్ వారియర్స్'గా నిలవాలి



**ప్రజాపక్షం / హాజీపూర్:**సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు హాజీపూర్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బుధవారం వేంపల్లి గ్రామంలోని ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాలలో సైబర్ జాగృతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ నేరాల రహస్యాలు, మోసాల బాటలు, నివారణ చర్యలపై స్పష్టమైన దృక్పథాన్ని అందించారు. ఈ సందర్భంగా హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ మాట్లాడుతూ పార్ట్ టైం ఉద్యోగాల పేరిట మోసాలు, నకిలీ వాణిజ్య ప్రకటనలు, క్రెడిట్ కార్డు మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి సైబర్ మోసాల నుంచి జాగ్రత్తగా ఉండాలని, ప్రతి యాప్‌కు వేర్వేరు పాస్‌వర్డు వాడాలని, వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవాలి అని సూచించారు.విద్యార్థులు ఈ అవగాహనను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకోవాలని, సమాజాన్ని మోసాల నుంచి రక్షించే 'సైబర్ వారియర్స్'గా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పెట్టెం మల్లయ్య, అధ్యాపకులు, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లు పెట్టెం రాజేందర్, సాయినాథ్, అమీన్ బేగం పాల్గొన్నారు.

## బైరాపూర్ గ్రామస్థుల ఆందోళన

### జిల్లా అటవీ శాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బై రాపూర్‌కు చెందిన గ్రామస్తులు భారీగా తరలివచ్చి కా ర్యాలయం ప్రధాన గేటు వద్ద ఆందోళన చేపట్టారు. అటవీశాఖ స్థలంలో మక్క పంట వేయడాన్ని వ్యతిరేకిస్తూ అ టవీ శాఖ అధికారులు మంగళవారం బైరాపూర్‌కు వె ళ్లారు. అక్కడ ప్రకాష్‌కు చెందిన మక్క చేనుపై గడ్డిమ ందు చల్లారు. దీంతో తీవ్రమైన మనస్థాపానికి గురైన రై తు ప్రకాష్ అక్కడే ఉన్న గడ్డి మందు సేవించి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు. దీంతో అతని పరిస్థితి విషమంగా మారటంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రి కి చికిత్స నిమిత్తం తరలించారు. అటవీ శాఖ అధికారుల తీరును నిరసిస్తూ బైరాపూర్‌కు చెందిన గ్రామస్తులు భా రీగా జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. వర్ని రోడ్డులోని అటవీ శాఖాధికారి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర ఏర్పాటుకు అంకితం చేసిన గొప్ప విద్యా వేత్త ఆచార్య జయశంకర్ అని, వారి సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ గారి జయంతి పురస్కరించకుని వారి చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణనే తన ఆశ, శ్వాసగా జీవించి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాడి మలి దశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ మార్గదర్శనం గా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, శ్రీధర్, రాందాస్, ఎడి మైనింగ్ క్రాంతి కుమార్ కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంచందర్, సిబ్బంది , పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్:** తెలంగాణ సిద్దాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. నగరంలోని మదీనా కాంప్లెక్స్‌లో గల ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహానికి కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆచార్య జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు లక్ష్మి కిరణ్, అశ్విని తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్వో వెంకటేశ్వర్లు, డిఇవో చైతన్య జైనీ, ఇతర జిల్లా అదికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తాం

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి లోని ఎస్ ఎస్ గార్డెన్స్ లో నూతన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్, కేకే మహేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. తంగళ్లపల్లి మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. వీటి ద్వారా పేదలకు రేషన్ అందుతుందన్నారు. మండలంలో నూతనంగా 1397 కొత్త కార్డులు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో 2224 మంది కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసి అందిస్తున్నామని వెల్లడించారు. ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్, ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కే కే మహేందర్ రెడ్డి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొకటి అమలు చేస్తూ ముందుకు వెళ్తుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణ మాఫీ, 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి కింద క్యాంటీన్లు, మిల్క్ పార్లర్, ఆర్ టీ సీ బస్సులు, పెట్రోల్ బంక్, ఫెర్టిలైజర్ దుకాణాలు ఇతర స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డి డబ్ల్యు ఓ లక్ష్మీ రాజ్యం తహసిల్దార్ జయంత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోడౌను పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని గల ఈవీఎం గోడౌన్ కేంద్రాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతి నెల తనిఖీ చేయడం జరుగుతుందని, అందులో భాగంగా బుధవారం ఈవీఎం గోడౌన్ కేంద్రాన్ని సందర్శించడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూధన్, కలెక్టరేట్ ఏవో హకీం, ఎలక్షన్ సూపరింటెండెంట్, జగిత్యాల అర్బన్, తహసీల్దార్ రామ్మోహన్ పాల్గొన్నారు

## సమయపాలన పాటించని అధికారులుపై చర్యలు

### కలెక్టర్ హైమవతి హెచ్చరిక



**ప్రజాపక్షం/దుబ్బాక:** అధికారులు సమయపాలన పాటించి విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హైమవతి అధికారులకు ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్, విసిట్ రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. సంబంధిత వైద్యురాలు దుబ్బాకలో మీటింగ్ వెళ్లారని సిబ్బంది తెలపగా స్థానిక అధికారులతో మాట్లాడి నిజనిర్ధారణ చేశారు. ల్యాబ్ సిబ్బందితో శాంపిల్స్ టిహబ్‌కి పంపిస్తున్నారా అని అడిగి రాండమ్ చేస్తున్నారని ఆరా తీశారు. ర్యాపిడ్ తప్పనిసరిగా పీహెచ్‌సీలోనే చేయాలని ఆధేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల డిస్పోజల్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను పరిశీలించారు. మండలంలో 393 ఇండ్లుమంజూరు కాగా 255 గ్రౌండింగ్ అయ్యాయని ఎంపిడివో తెలిపారు. పీఎంఏవై యాప్‌లో రోజు వారిగా టార్గెట్ పెట్టుకుని అఫ్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. బొడ్డు సంతోష ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. వనమహోత్సవం టార్గెట్‌ను వంద శాతం పూర్తి చేయాలని ఎంపిడివోకు సూచించారు. ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్‌తో పాటు తహసీలాద్ కృష్ణమోహన్, ఎంపిడివో బాలయ్య, ఎంపివో శ్రీనివాస్, ఎంఇవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## పెన్షన్ల పెంపుపై తాత్సారం తగదు

### మంద కృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/ధర్మపురి:** ఎన్నికల సమయంలో తమకు అధికారమిస్తే వృద్దులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచి అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలైన పెన్షన్ల పెంపుపై ఊసే లేకపోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం వికలాంగులకు రూ. 6వేలు, ఇతర పెన్షన్ దారులకు రూ. 4వేలు పెంపు లక్ష్యంగా నిర్వహించిన సభలో అయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ఎన్నికలు ముగిసి 20 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని అదే సమయంలో ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలు ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దె దిగన కేసిఆర్ ఫాం హౌస్ నుండి బయటకు రాకుండా ప్రతిపక్ష పాత్ర కూడా పోషించకపోవడం తగదన్నారు. రాష్ట్రంలోని వితంతువుల, వృద్దులు, వికలాంగుల పెన్షన్ల పెంపు లక్ష్యంగా ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సభకు భారీగా తరలివచ్చిన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏ ప్రభుత్వమైనా ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి నెల లేదా 20మ నెలలైన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని కేవలం రూ.20 కోట్ల బడ్జెట్ వికలాంగులకు ఇతర పెన్షన్ దారులకు కేటాయిస్తే సరిపోతాయని, పెంచాల్సిన పెన్షన్ డబ్బులను రుణమాఫీకి బదలాయించి ధనవంతులకు లాభం చేకూరుస్తుందని విరుచుకుపడ్డారు. పేదలు, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి వారి పక్షాన నిలబడి కొట్లాడుతానని మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. ఎమ్మార్పిఎస్ ధర్మపురి మండల అధ్యక్షుడు చెందోలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఇంచార్జీ గొల్లపల్లి శ్రీధర్, జాతీయ కమిటీ చైర్మన్ సి. గోపాల రావు, జిల్లా అధ్యక్షులు అంకదాసరి శ్రీనివాస్, పారపెల్లి రాజమల్లయ్య, ముత్తునూరి మహేష్, బేడింగం రాజు, వెల్మ బాపురెడ్డి, రాయిల్ల రవికుమార్, దొనకొండ నరేష్ పాల్గొన్నారు.

## మానకొండూర్ జడ్‌పి బాలికల స్కూల్‌లో మౌలిక సదుపాయాలేవీ ?

### ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్



**ప్రజాపక్షం/మానకొండూర్:** అఖిల భారత విధ్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆద్వర్యంలో బుధవారం మానకొండూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విధ్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్బంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ మాట్లాడుతూ మానకొండూర్ పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించి విధ్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపయాలు కల్పించాలన్నారు. దీని వల్ల విధ్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. పాఠశాలకు కనీస గేటు లేకపోవడం వల్ల బయట వ్యక్తులు వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. పాఠశాలకు గేటును ఏర్పాటు చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లకు వాటర్ సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లను మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు , పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల



### సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి పిలుపు

**ప్రజాపక్షం/హుస్నాబాద్:** అగస్టు 19 నుండి 22వరకు జరిగే సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహా సభలను విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ సిద్దిపేట జిల్లా సహయకార్యదర్శి గడిపె మల్లేశ్ పిలుపు నిచ్చారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో మహా సభ పోస్టర్‌ను, కరపత్రాలను విడుదల చేశారు.
ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ప్రతి మూడు ఏళ్లకు ఒకసారి జరిగే తెలంగాణ రాష్ట్ర మహా సభలను ఈ నెల 19 నుండి 22వరకు మెడ్చేల్ జిల్లా లో జరగనున్నాయని తెలిపారు. ఈ మహా సభకు జిల్లా నలుమూలల నుండి కార్యకర్తలు ,యువతి యువకులు ప్రజా సంఘాలుల, అభిమానులు , విద్యార్థులు, రైతు కూలీలు, కార్మిక సంఘల నాయకులు అధిక సంఖ్యలో పాల్గోని సభను విజయవంతం చేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జాగీరు సత్యానారయణ, ఎగ్గోజు సుదర్శన చారి , ఐలేని మల్లారెడ్డి, ఎండి అక్బర్, మౌటం బాలయ్య, బాస్కర్, దోంతరవేణి రజిత, రొడ్ల భాగ్య, రాజవ్వ, సులోచన, రాములు పాల్గొన్నారు.

## స్కిల్ మాస్టర్ మ్యాగజైన్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్‌పి



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** ది మాస్టర్ మైండ్ యాజమాన్యం రూపొందించిన స్కిల్ మాస్టర్ మ్యాగజైన్ తో పాటు మాస్టర్ రైటర్, మాస్టర్ రీడర్ పుస్తకాలను మాస్టర్ మైండ్ పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాఎస్పి మహేష్ బి గితే చేతుల మీదుగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ది మాస్టర్ మైండ్స్ స్కూల్స్ రూపొందించిన మ్యాగజైన్స్, పుస్తకాలతో వినూత్నమైన కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభకు ఎంతగానో ఉపయోగ పడుతాయని ప్రశంసించారు.

## ఆల్ఫోర్స్‌లో ఘనంగా బాలికల టిటి టోర్నమెంట్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ హై స్కూల్ (సిబిఎస్ఇ)లో సిబిఎస్ఇ క్లస్టర్ సెవెన్ బాలికల టెన్నిస్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభమయ్యింది. ఈ మేరకు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, అడ్మిన్ డిసిపి పి.వెంకటరమణ, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి, డివైఎస్‌వో శ్రీనివాస్, రాష్ట్ర అబ్జర్వర్ పద్మారావు, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో కలిసి టోర్నమెంట్‌ను ప్రారంబించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా ఆసక్తిని పెంపొందించుకుని సరైన రీతిలో కష్టపడి విజయాన్ని సాధించాలని కోరారు. తల్లిదండ్రులు ఏర్పరచుకున్న ఆశయాలను , సొంతంగా ఏర్పాటు చేసుకున్నటువంటి లక్ష్యాలను సాధించడానికి పోటీ పడి విజయం సాధించి సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని సూచించారు. భారతదేశంలో పారా ఒలంపిక్ అథ్లెట్ దీప మాలిక్ సాధించిన విజయం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమన్నారు. విధ్యార్థులు అవకాశాలను సకాలంలో సద్వినియోగం చేసుకుని సామర్థ్యాన్ని ప్రదర్శించి విజయం సాధించాలని కోరారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నరేందర్‌రెడ్డి సారధ్యంలో విధ్యార్థులకు క్రీడారంగంలో విశిష్టమైన అవకాశాలు కల్పించడం గొప్ప విషయమని, ఇతర విద్యాసంస్థలకు మార్గదర్శకమని కొనియాడారు. గౌరవ అతిధి వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతో పాటు విజయం సాధించాలనే తపనను పెంపొందించుకుని విజయం సాధించే దిశగా ప్రయత్నం కొనసాగించి సఫలీకృతం కావాలని కోరారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల వార్షిక ప్రణాళికలో భాగంగా నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తూ వివిధ పోటీలకు ఎంపిక చేసి వనరులను కల్పిస్తున్నామన్నారు. టోర్నమెంటులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 35 పాఠశాలల నుంచి సుమారు 2500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, పలు పాఠశాలల ప్రతినిధులు, క్రీడా కోచ్‌లు, టీం మేనేజర్లు, ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ



**ప్రజాపక్షం/చేర్యాల:** త్యాగాల చరిత్ర కలిగిన గొప్ప పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ అన్నారు. సిపిఐ చేర్యాల మండల సమితి ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 22వ తేది వరకు జరుగబోయే సిపిఐ 4వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ కార్యాలయంలో గోడ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన కష్టజీవులకు ఏ సమస్య వచ్చిన నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ప్రజా సమస్యల పరిష్కారమే ఏకైక లక్ష్యంగా ఆవిర్భవించిన సిపిఐ పార్టీ వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రజా ఉద్యమాల పార్టీ అని, ఇది దేశంలోని పేదలకు, శ్రామిక వర్గాలకు అండదండగా నిలిచిన రాజకీయ శక్తి అని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న 4వ మహాసభలు ప్రజా సమస్యలపై చర్చించే ఒక ముఖ్యమైన వేదిక అవుతాయని తెలిపారు.సిపిఐ నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, కత్తుల భాస్కర్‌రెడ్డి, పొన్నబోయిన మమత, నంగి కనకయ్య, పోనుగోటి శ్రీనివాస్‌రెడ్డి సుంకోజు రజిత, బూరుగు సత్తయ్య, మహేష్, హరిబాబు, యాదయ్య, నర్సిరెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయబావిలో గుర్తు తెలియని శవం లభ్యం



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్నకొండ శివారులోని వ్యవసాయ బావిలో 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని కనుగొన్నట్లు చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు. మృతుడి ఒంటిపై బిస్కెట్ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు, ఎడమ చేతికి హోమ్ రంగు ప్యాంటు, ఆరెంజ్ రంగుదారం ఉందని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు చొప్పదండి పోలీసులను 8712670766 ను సంప్రదించాలన్నారు. ఆర్నకొండ పంచాయతీ సెక్రటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

## వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలి

### ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ శ్రీ కోయ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని ప్రతి వార్డు, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌లను కలెక్టర్ పరిశీలించారు.ఔట్ పేషెంట్ విభాగంలో ఉదయం 9.30 తర్వాత ఆరుగురు వైద్యులు ఆలస్యంగా రావడం గమనించి ఇలాంటివి పునారావృతం కాకుండా ఉండాలని మరియు అవసరం అయితే క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్ మరియు ఆర్ఎంఓలను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ ఔట్ పేషెంట్ సేవలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలని, ఆసుపత్రి వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్యుల హాజరు పై సరైన పర్యవేక్షణ ఉండాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం అమలులోకి తీసుకొని రావాలని కలెక్టర్ సూచించారు.ఆసుపత్రిలో పరిశుభ్రత పెంచుకోవాలని, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రీమియం రేంజ్ లో సేవలు మరియు పారిశుధ్య సేవలు కూడా ఉండాలని, దీనికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని అన్నారు. ప్రభుత్వ వైద్యులు డ్యూటీ సమయంలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.అదే విదంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది పేషెంట్లతో మర్యాద పూర్వకంగా ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్

**ప్రజాపక్షం/బెజ్జంకి:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తక్షనమే పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ అన్నారు.ఏఐటియూసి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం కలెక్టర్ ముట్టడికి వెళ్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్టేషన్‌కు తరలించగా సిపిఐ,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శులు రూపేష్,దొంతరవేణి మహేష్‌లు కార్మికులను కలిసి సంఘీభావం తెలిపారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి మధ్యాహ్న భోజన కార్మికులకు పది వేల వేతనాన్ని ఇవ్వాలని,పెండిగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని.కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద భీమా సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మధ్యామ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

# రీల్

## సట్టముం నీతియుం

### సక్సెస్ మీట్



శరవణన్ ప్రధాన పాత్రలో నటించిన 'సట్టముం నీతియుం' సిరీస్‌ను జీ 5 తెలుగు ప్రేక్షకులకు అందించింది. 18 క్రియేటర్స్ బ్యానర్ మీద ఈ సిరీస్‌ను శశికళ ప్రభాకరణ్ నిర్మించారు. షో రన్నర్‌గా సూర్య ప్రతాప్. ఎస్ వ్యవహరించారు. బాలాజీ సెల్వరాజ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సిరీస్ తెలుగులో రీసెంట్‌గా స్ట్రీమింగ్ అయి మిలియన్ల స్ట్రీమింగ్ మినిట్స్‌తో దూసుకుపోతోంది. ఈ క్రమంలో 'సట్టముమ్ నీతియుమ్' సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ 'నిర్మాతగా ఇలా స్టేజ్ మీద మాట్లాడుతుండటం కొత్తగా ఉంది. యాంకర్‌గా ఎన్నో సార్లు మైక్ పట్టుకున్నా కూడా ఈ రోజు ఇలా కొత్తగా అనిపిస్తోంది. ఇదంతా కూడా నా భర్త ప్రభాకరణ్ వల్లే సాధ్యమైంది. ఈ సిరీస్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్‌ను ఇంత గ్రాండ్ సక్సెస్ చేసిన అందరికీ థాంక్స్. తెలుగులోనూ ఈ సిరీస్ అద్భుతంగా దూసుకుపోతోంది. ఈ సిరీస్‌కు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. బాలాజీ ఈ సిరీస్‌ను కేవలం 13 రోజుల్లోనే పూర్తి చేశారు.

## మెగా రక్తదాన శిబిరం



మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా హై టెక్స్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనేక మంది చిరంజీవి ఫ్యాన్స్ ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. ఈ శిబిరంలో హనుమాన్ హీరో తేజ సజ్జ కూడా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి అందరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈనెల 22న చిరంజీవి జన్మదిన వేడుకలను చిరంజీవి అభిమానులు ఘనంగా నిర్వహించనున్నారు.

## ఎగరేయ్ నీ రెక్కలే పాట విడుదల



సినిమా బండి ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల 'పరదా' అనే మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ తెరకెక్కిస్తున్నారు.'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ నిర్మాతలు రాజ్, డికె దీనికి నిర్మాణ సహకారం అందిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా, దర్శన రాజేంద్రన్‌తో పాటు, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో జర్నీ పాటగా చిత్రీకరించిన 'ఎగరేయ్ నీ రెక్కలే' పాటను రిలీజ్ చేశారు. స్టార్ కంపోజర్ గోపీ సుందర్ మనసుకు హత్తుకునేలా ఈపాటను కంపోజ్ చేశారు. వనమాలిసాహిత్యం అందించారు.

## హృదయాలను హత్తుకుంటుంది

వైవిధ్యమైన పాత్రలతో.. విభిన్న చిత్రాలతో కమెడియన్‌గా, నటుడిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రవీణ్. ఆయన తొలిసారిగా హీరోగా నటిస్తున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం హారర్ థ్రిల్లర్, కామెడీ, ఎమోషన్ అన్నీ రకాల అంశాల మేళవింపుతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



ఈ నెల 8న చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా నటుడు ప్రవీణ్ మీడియాతో చిట్ చాట్ చేశారు.

*** బకాసుర రెస్టారెంట్ ఎలాంటి కథ?**

ఈ సినిమా ఐదు పాత్రలతో నడుస్తుంది. ఇందులో కథను నడిపించే పరమేష్ అనే పాత్రలో నేను కనిపిస్తాను. నా పాత్రలో ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్ కూడా ఉంటుంది. నా పాత్రకు ఉండే ఓ యాంబిషన్ ఎలా ఫుల్‌ఫిల్ అయ్యింది అనేది ఆసక్తికరంగా ఉంటుంది.

*** మీపాత్ర చుట్టే కథ నడవడం, మీరు హీరోగా నటించడం ఎలాఫీలవుతున్నారు ?**

నిజం చెప్పాలంటే ఇది కొంచెం బరువే. పర్‌ఫార్మెన్స్ వైజ్ నాది రెగ్యులర్ పాత్ర కాదు. కథలో హారర్, థ్రిల్లర్, మైథాలజీ ఇలా అన్నీ మిక్స్ అయ్యాయి. ఐదు పాత్రలున్న కథను నడిపించే పాత్ర కావడంతో కాస్త టెన్షన్‌గానే ఉంది. అయితే సినిమాను దర్శకుడు ఎంతో క్లారిటీగా తెరకెక్కించాడు. సినిమాను మంచి ప్రమోషన్‌తో బయటికి తీసుకరావాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ విషయంలో నాకు సినీ పరిశ్రమలోని అందరూ సహకరిస్తున్నారు. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్ కూడా ఉంటుంది. నా పాత్రలో ఎమోషన్‌ను పండించడమే నాకు చాలెంజింగ్‌గా అనిపించింది. ఓ పెయిన్‌ఫుల్ ఎమోషన్‌తోనే ఈ కథ ఎండ్ అవుతుంది. ఇదొక కాన్సెప్ట్ కథ. తిండిబోతు దెయ్యం పెట్టే ఇబ్బంది చాలా ఎంటర్‌టైనింగ్‌గా.. ఎమోషన్‌ల్‌గా ఉంటుంది.

*** కమెడియన్‌గా హీరోగా మారితే కమెడియన్‌గా అవకాశాలు తగ్గిపోతాయోనని అంటుంటారు?**

అలాంటిదేమీ లేదు. అసలు నేను హీరోగా ఫీలయితే అలాంటి ఫీలింగ్ అందరిలో వస్తుంది. నేను ఓ చిత్రంలో లీడ్ రోల్ చేస్తున్నాననే భావనలో మాత్రమే ఉన్నాను .ప్రస్తుతం నేను విశ్వంభర, ఉస్తాద్ భగత్ సింగ్, మాస్ జాతర, లెనిన్, ఆకాశంలో ఓ తార చిత్రాలతో బిజీగా ఉన్నాను. నాకు దర్శకుడు ఎలాంటి పాత్రను ఇచ్చినా నేను చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

*** ఈ సినిమాలో ఉండే స్పెషాలిటీ ఏమిటి?**

ముఖ్యంగా పతాక సన్నివేశాలు చాలా ఎమోషనల్‌గా ఉంటాయి. మన జీవితంలోకి వచ్చిన మంచి స్నేహితుడు అనివార్యా కారణాల వల్ల వెళ్లిపోవాల్సి వస్తే మనలో ఓ పెయిన్ ఉంటుంది. ఈ కైండ్ ఆఫ్ ఎమోషన్ ఈ సినిమాలో కూడా ఉంటుంది. ఇది అందరి హృదయాలకు హత్తుకుంటుంది. శిరీష్ గారు సినిమా చూసి మంచి కథను ఎంచుకున్నారు అన్నారు. సినిమా ఆయనకు బాగా నచ్చింది. అందుకే ఎస్వీసీ ద్వారా విడుదల చేస్తున్నాం.

*** భవిష్యత్‌లో మళ్లీ ఎలాంటి సినిమాల్లో లీడ్ రోల్స్ చేస్తారు?**

అన్ని పాత్రలు చేస్తాను. కానీ లీడ్ రోల్ మాత్రం ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ చేయాలని వుంది. ఎందుకంటే కమెడియన్‌గా ఇమేజ్ ఉన్న మేము. లీడ్ రోల్ చేస్తే మోర్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఆడియన్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తారు. ఆ తరహాలోనే సినిమాలు చేస్తాను.

*** ఈ సినిమాను చూసి థియేటర్ నుంచి బయటికి వచ్చే ఆడియన్స్‌కు కలిగే ఫీలింగ్ ఏమిటి?**

థియేటర్‌లో మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఎంజాయ్ చేసి... పతాక సన్నివేశాలు చూసిన తరువాత ఓ మంచి ఎమోషన్‌తో.. కాసేపు అదే ఫీల్‌లో థియేటర్ నుంచి బయటికొస్తారు.

## 'డేవిడ్ రెడ్డి'గా మంచు మనోజ్



రాకింగ్ స్టార్ మనోజ్ మంచు తన పాత్రలను, స్క్రిప్ట్‌లను సెలెక్టివ్‌గా జాగ్రత్తగా ఎంచుకుంటున్నారు. తన తాజా ప్రాజెక్ట్ హిస్టారికల్ యాక్షన్ డ్రామా. హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వం వహించగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మోతుకూరి భరత్, నల్లగంగుళ వెంకట్ రెడ్డి నిర్మిస్తున్నారు. డేవిడ్ రెడ్డి అనే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమా కథ 1897 నుంచి 1922 వరకూ నడుస్తుంది. ఈ స్టోరీలో మనోజ్ ఎన్నడూ చూడని పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు. కుల వ్యవస్థ ఒత్తిడుల నుంచి తిరగబడి, బ్రిటిష్ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసిన ఓ రెబల్ కథ ఇది. కథ ఎమోషనల్ మాస్ టచ్‌తో జనం గుండెల్లో నిలిచిపోయేలా వుంటుందని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి చెప్పారు. 21 సంవత్సరాల క్రితం, ఇదే రోజున మంచు మనోజ్ దొంగ దొంగదితో అరంగేట్రం చేశారు. ఇప్పుడు, సరిగ్గా రెండు దశాబ్దాల తర్వాత, తన న్యూ బ్లాస్టింగ్ వెంచర్ డేవిడ్ రెడ్డిని ప్రకటించడం విశేషం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ సినిమా టైటిల్ పోస్టర్ ఒక బోల్డ్ స్టేట్‌మెంట్ ఇస్తుంది. తెరపై చూపించే విప్లవానికి టోన్‌ను సెట్ చేస్తుంది. టైటిల్ డిజైన్‌ని మనోజ్ ఫేస్‌లోకి మార్చడం చాలా క్రియేటివ్‌గా వుంది. 'మద్రాస్ ప్రెసిడెన్సీలో పుట్టాడు, ఢిల్లీలో పెరిగాడు, ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వణికిస్తున్నాడు!' అనే ట్యాగ్‌లైన్ కట్టిపడేసింది. విజువల్‌గా అద్భుతమైన పోస్టర్ సినిమా ఎంత పవర్ ఫుల్‌గా వుంటుందో తెలియజేస్తోంది.

## కలెక్షన్స్‌తో దూసుకెళ్తున్న 'కింగ్డమ్'



మహావతార్ నరసింహ లాంటి సూపర్ డూపర్ హిట్ సినిమా కలెక్షన్లను తట్టుకుని విజయ్ దేవరకొండ నటించిన కింగ్డమ్ సినిమా వసూళ్లలో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మహావతార్ నరసింహ వంటి సినిమాల ప్రభావం కొంత కింగ్డమ్ పై పడిన ఆ పోటీని తట్టుకుని కింగ్డమ్ సినిమా బాక్సాఫీస్ వద్ద నిలబడింది. తీవ్రమైన పోటీ మధ్య రిలీజైన కింగ్డమ్ సినిమా విజయ్ స్టార్ పవర్ తో మంచి వసూళ్లు సాధించింది. యూఎస్‌లో బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. ఫస్ట్ డే ఈ సినిమాకు 39 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ దక్కడం విశేషం.

## 'గుర్రం పాపిరెడ్డి' టీజర్ రిలీజ్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా.సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సడ్డి, అమర్ బుర్రా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. 'గుర్రం పాపిరెడ్డి' సినిమా టీజర్ ను హైదరాబాద్‌లో గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం ముఖ్య అతిధిగా పాల్గొని టీజర్‌ను రిలీజ్ చేశారు. సౌత్ ఇండియన్ కామెడీ సూపర్ స్టార్ యోగిబాబు కూడా ఈ కార్యక్రమంలో ఉన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ 'గుర్రం పాపిరెడ్డి' సినిమా నాకొక స్పెషల్ మూవీ అని చెప్పగలను. ఎందుకంటే యంగ్ స్టర్స్ అంతా కలిసి ఈ సినిమాను రూపొందించారు. ఈ చిత్రంలో జడ్జి పాత్రలో నటించాను. దర్శకుడు మురళీ మనోహర్ సినిమా అంటే ప్యాషన్ ఉన్నవాడు. నన్ను ఈ మూవీలో డిఫరెంట్ గా చూపించాడు. ప్రభాస్ శ్రీను, రాజ్ కుమార్ కాసిరెడ్డి, జీవన్ కుమార్ వీళ్లతో పాటు నేను మిమ్మల్ని నవ్వించేందుకు ప్రయత్నించాను. అలాగే యోగిబాబు ఈ మూవీకి స్పెషల్ అట్రాక్షన్. ఇవాళ తమిళ చిత్ర పరిశ్రమలో యోగిబాబుకు ఉన్న క్రేజ్ ఎలాంటిదో మనకు తెలుసు. ఇటీవల యోగిబాబు హీరోగా నటించిన ఓ కన్నడ చిత్రంలో నేను నటించాను. ఆయన బయట చాలా కామ్ గా ఉంటారు. ఈయన కామెడీ చేస్తారని అనుకోం. కానీ కామెడీని పండించడంలో దిట్ట యోగిబాబు. ఇలా వీళ్లందరితో కలిసి నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. కొత్త వాళ్లు ఇండస్ట్రీకి రావాలి. అప్పుడే మన సినిమా మరింత అభివృద్ధి చెందుతుంది. ఒక ఫ్రెష్ నెస్ వస్తుంది. మంచి కామెడీతో సాగే థ్రిల్లర్ మూవీ ఇది. హీరో నరేష్, హీరోయిన్ ఫరియా సహా 'గుర్రం పాపిరెడ్డి' సినిమా టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా అని అన్నారు.




## ఒకేరోజు 15 చిత్రాల షూటింగ్

### నిర్మాతకు బాసటగా నిలిచిన హీరో సుమన్, దర్శకుడు రేలంగి




ఒకే రోజు 15 సినిమాలకు శ్రీకారం చుడుతూ ప్రపంచ రికార్డు సాధించేందుకు సన్నాహాలు చేసుకుంటున్న భీమవరం టాకీస్ అధినేత శతాధిక చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ వెనుక తాము ఉంటామని ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, సీనియర్ హీరో సుమన్, ప్రఖ్యాత రచయిత జె.కె.భారవి చెప్పారు. . ఈనెల15న హైదరాబాద్‌లోని సారధి స్టూడియోలో ఒకేసారి ప్రారంభమై ప్రపంచ రికార్డు' నెలకొల్పనున్న 15 సినిమాలకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీరంతా మాట్లాడారు. ఈ 15 చిత్రాల్లో నటించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సుమన్ ప్రకటించగా ఈ 15 చిత్రాల్లో యండమూరి సినిమా మినహా మిగతా సినిమాలకు తాను స్క్రిప్ట్ కోఆర్డినేటర్ గా వ్యవహరించి తగిన సలహాలు, సూచనలు ఇస్తానని జె.కె.భారవి పేర్కొన్నారు. రామసత్యనారాయణను చూసి తాను గర్వపడుతుంటానని రేలంగి తెలిపారు.

---

## 'పుష్ప-2' తొక్కిసలాటలో.. సిఎస్‌కు ఎన్‌హెచ్ఆర్ నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద గత సంవత్సరం డిసెంబర్ 4న రాత్రి సమయంలో తొక్కిసలాట) చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందగా ఆమె కుమారుడికి తీవ్ర గాయాలు కావడంతో దాదాపు ఆరు నెలలపాటు ఆస్పత్రిలోనే చికిత్స అందించారు. ఈ ఘటనపై స్పందించిన చిత్ర బృందం బాలుడి వైద్య ఖర్చులు మొత్తం బరిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత తెలంగాణ ప్రభుత్వం, సినిమా ఇండస్ట్రీ మధ్య అనేక అంశాలపై తీవ్రమైన చర్చలు జరగ్గా.. ప్రభుత్వం పలు కఠిన నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో ప్రభుత్వ తీరుపై మాత్రం జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ మేరకు సిఎస్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చింది.

## సంస్కరణలలో రాష్ట్రం పని తీరు భేష్




ప్రజాపక్షం/హైదరాబాద్: వివిధ సంస్కరణల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం సూచించిన గడువు ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సంస్కరణల ఎజెండాను విజయవంతంగా అమలు చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో సులభతర వాణిజ్య విధానాల అమలు తీరు హైదరాబాద్‌లోని సచివాలయంలో రామకృష్ణా రావు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో వివిధ సంస్కరణల అమలు స్థితిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ఈ సంస్కరణలను అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం నిరంతరం అత్యుత్తమ పని తీరు కనబరుస్తున్న రాష్ట్రాలలో ఒకటిగా ఉన్నదని రామకృష్ణారావు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, నియంత్రణ ప్రక్రియలను సరళీకృతం చేయడం ద్వారా మరింత మెరుగుదలకు గణనీయమైన అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు, ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు ఈ ప్రయత్నాలు చాలా కీలకమని చెప్పారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారి, టాస్క్ ఫోర్స్ సభ్యురాలు సుకృతి లిఖి మాట్లాడుత సులభతర వాణిజ్య విధానంలో భాగంగా అమలు జరుగుతున్న సంస్కరణలలో రాష్ట్ర పని తీరును ప్రశంసించారు. సంస్కరణలను అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం చాలా బాగా పని చే స్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేయడానికి, దాని పెట్టుబడి ఆకర్షణను పెంచడానికి మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. రాష్ట్రాలు వ్యాపార సంస్కరణల అమలును కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని ఆమె వివరించారు. ఈ సమావేశంలో రవాణ, రోడ్లు, భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ఐటిఈ,సి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, కార్మిక, ఉపాధి శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



ఛత్తీస్‌గడ్ మైనారిటీలపై జరుగుతున్న మతపరమైన దాడులను తక్షణమే నిలిపివేయాలని, కేరళకు చెందిన ఇద్దరు నన్‌లతో పాటు, వారి వెంబడి వెళ్ళిన ముగ్గురు యువతులపై దాడి చేసి వేధించిన మతోన్మాద శక్తులపై ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయాలని కోరుతూ నారాయణ్‌పూర్ కలెక్టరేట్ వద్ద బుధవారం సిపిఐ కార్యకర్తల భారీ ధర్నా

---

## ఠాణా స్థాయిలో జవాబుదారీతనం పెంచాలి

### అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశంలో డిజిపి డాక్టర్ జితేందర్

ప్రజాపక్షం/హైదరాబాద్: పోలీసు వ్యవస్థపై ప్రజలు మరింత నమ్మకాన్ని పెంపొందిచడానికి పోలీసు స్టేషన్ స్థాయిలో జవాబుదారీతనం, పారదర్శకతతో పాటు సేవా బట్వాడా మెరుగు పరచాలని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అధికారులను కోరారు. డిజిపి కార్యాలయంలో మంగళవారం జరిగిన తొలి అర్ధ వార్షిక నేర సమావేశాన్ని డిజిపి జితేందర్ సమీక్షించారు. ఈ సమీక్షలో డిజిపి నేరాల ధోరణులు, శాంతిభద్రతల పరిస్థితులు, ప్రధాన కేసుల దర్యాప్తులో పురోగతి, శారీరక నేరాలు, ఆస్తి నేరాలు, మహిళలు, పిల్లలపై జరిగిన నేరాలకు సంబంధించిన అమలు చర్యలను సిఐడి అదనపు డిజి చారుసిన్హా నివేదిక అందించారు.అన్ని నేరాలలో ప్రతి జిల్లా పనితీరు, నేరాల రేటు విశ్లేషణ, శిక్ష విధించే రేట్లను పెంచడం, ఛార్జ్ షీట్లను సకాలంలో దాఖలు చేయడం, అంతర్విభాగ సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి ముఖ్యమైన అంశాలపై డిజిపి ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి డిజిపి మాట్లాడుతూ.. నేరాల మ్యాపింగ్, ప్రభావవంతమైన నేర నియంత్రణ కోసం డేటా ఆధారిత పోలీసింగ్ వాడకంపై డిజిపి ఉద్ఘాటించారు. సంవత్సరం మొదటి అర్ధభాగంలో శాంతిభద్రతలను కాపాడటంలో అధికారులందరు కృషి చేశారని తెలిపారు. ఆర్థిక నేరాలు, వ్యవస్థీకృత నేరాలపై దృష్టి పెట్టడానికి, విజిబుల్ పోలీసింగ్‌ను మెరుగుపరచడానికి, ప్రజా భద్రతను నిర్ధారించడానికి అన్ని యూనిట్ అధికారులను డిజిపి ఆదేశించారు. మహిళలు, పిల్లల భద్రత మరియు షీ టీమ్‌లు, ఎహెచ్‌టియులు, భరోసా కేంద్రాల పనితీరుపై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమీక్ష సమావేశంలో టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, ఎడిజి అనిల్ కుమార్, ఐజి ఎం.రమేష్, ఐజి చంద్రశేఖర్ రెడ్డి, రేంజ్ డిఐజి తఫ్సీర్ ఇక్బాల్, కమిషనర్లు అవినాష్ మోహంతి, సుధీర్ బాబు పాల్గొన్నారు.

## అయోధ్య మృతి

(మొదటి పేజీ తరువాయి)



అయోధ్య గుర్తింపు పొందారు. చదివింది ప్రాథమిక విద్యే అయినా ఆయన ఆలోచన రీతి, పోరాటతత్వం ఎందరినో ఆయన అభిమానులుగా మార్చింది.

**అంచలంచెలుగా ఎదిగిన అయోధ్య :**

అయోధ్య కుటుంబం ఆది నుంచి కమ్యూనిస్టు పార్టీ కుటుంబమే. ఇప్పటి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజక వర్గంలోని గానుగబండ గ్రామంలో బొల్లోజు నర్సయ్య చారి, ఈశ్వరమ్మ దంపతులకు మూడవ సంతానంగా అయోధ్య జన్మించారు. నర్సయ్యచారి కుటుంబం 1962 ప్రాంతంలో మణుగూరు ప్రాంతానికి వలస వచ్చింది. నర్సయ్య దంపతులు సాయుధ తెలంగాణ పోరాటంలో పాల్గొన్నారు. బతుకుదెరువు కోసం ఈ ప్రాంతానికి వచ్చిన ఆ కుటుంబం ఇక్కడ కూడా కమ్యూనిస్టు పార్టీలో పని చేయడం ప్రారంభించింది. రామానుజవరంలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా ప్రారంభమైన అయోధ్య జీవితం రాష్ట్ర కార్యవర్గ సభ్యుని స్థాయికి ఎదిగింది. మండల కార్యదర్శిగా, ఉమ్మడి ఖమ్మంజిల్లా కార్యవర్గ సభ్యునిగా, కార్యదర్శి వర్గ సభ్యునిగా పనిచేసిన అయోధ్య ప్రస్తుతం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పని చేస్తున్నారు.

**మంత్రులు, సిపిఐ నేతల సంతాపం**

అయోధ్య మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పని చేసే ఓ నాయకున్ని ఖమ్మంజిల్లా కోల్పోయిందని అయోధ్య మృతి అత్యంత బాధాకరమన్నారు. అయోధ్య మృతి పట్ల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర సంతాపంతెలిపారు. ప్రజా హక్కుల కోసం నిబద్ధతతో పోరాడిన కమ్యూనిస్టు యోధుడిగా అయోధ్య గుర్తిండిపోతారని ఆయన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి డా॥కె.నారాయణ తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. నికార్సయిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తను అయోధ్య మృతితో కోల్పోయామన్నారు. యుక్త వయస్సు నుంచి కమ్యూనిస్టు పార్టీ పక్షాన పోరాడిన అయోధ్య భౌతికంగా దూరమైన ప్రజల హృదిలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

**అత్యంత ఆప్తుడైన పార్టీనేత : కూనంనేని**

అయోధ్య మృతితో కమ్యూనిస్టు పార్టీ ఒక నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోయిందని తాను వ్యక్తిగతంగా తనకు అత్యంత ఆప్తుడైన పార్టీ నాయకున్ని కోల్పోయానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కాగా అయోధ్య మృతికి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ శాసనసభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు చాడ వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అయోధ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చెన్న కేశవులు బి.వెంకటేశం, హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, చెట్టు కింద శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది శ్రీరాములు, అంజయ్య, దశరథ్, శివ ఉన్నారు.

## మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

అని దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. అత్యున్నత న్యాయస్థానం ఈ పిటిషన్ దాఖలు చేసిన ఎఐడిఎంకె నాయకుడు సివి.షణ్ముగమ్‌పై రూ.10లక్షల జరిమానా విధించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ విధించిన జరిమానా మొత్తాన్ని సివి.షణ్ముగం ఒక వారం లోపు చెల్లించాలని కోరింది. ఈ మొత్తం చెల్లించడాన్ని పాటించకపోతే కోర్టు ధిక్కారణకు గురవుతారని స్పష్టంచేసింది. 'ఈ రిట్ పిటిషన్ పూర్తిగా అనవసరమైనది. చట్టంలో తప్పుడు అవగాహనతో కూడుకున్నది. కానీ చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేయడం కూడా. అందువల్ల మేం స్పెషల్ లీవ్ పిటిషన్‌ను (ఎస్‌ఎల్‌పి) అనుమతిస్తాం. మద్రాస్ హైకోర్టు ఆదేశాన్ని పక్కనపెడతాం. హైకోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నటువంటి రిట్ పిటిషన్‌ను కూడా డిస్మిస్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని బెంచ్ ఆదేశించింది. ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ మాట్లాడుతూ 'రాజకీయ పోరాటాలను ఓటర్ల ముందు పరిష్కరించుకోవాలి. దీనికోసం కోర్టులను ఉపయోగించుకోకూడదని పదే పదే గమనించాం' అని సిజెఐ బిఆర్.గవాయ్ తెలిపారు. ఎఐడిఎంకె నాయకుడి పిటిషన్‌ను సుప్రీంకోర్టు హైకోర్టు నుండి సుప్రీంకోర్టు తనకు బదిలీ చేసుకుని కొట్టివేసింది. 'వివిధ రాష్ట్రాలలో వివిధ రాజకీయ నాయకుల పేర్లతో పథకాలు ప్రవేశపెట్టబడ్డాయి. అన్ని రాజకీయ పార్టీల నాయకుల పేర్లతో ఇటువంటి పథకాలు ఉన్నందున, ఏ రాజకీయ పార్టీని ఇబ్బందిపెట్టేలా మేం ఇతర పథకాలను ప్రస్తావించకూడదని అనుకుంటున్నాం' అని ధర్మాసనం చెప్పింది. డిఎంకె, రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన ముఖ్యమైన సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, అభిషేక్ సింఘ్వీ 'అమ్మ' పేరుతో గత ఎఐఎడిఎంకె ప్రభుత్వం అమలుచేసిన పథకాలను ప్రస్తావించడంతో ఈ ఉత్తర్వులో చేసిన పరిశీలనలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. 'పిటిషనర్ (షణ్ముగం) ఆందోళనను మేం అభినందించడం లేదు. ఆయన ఒకే ఒక రాజకీయ పార్టీని, దాని రాజకీయ నాయకులను ఎంచుకున్నారు. రాజకీయ పార్టీల ప్రజానిధుల గురించి పిటిషనర్ అంతగా ఆందోళన చెంది ఉంటే , పిటిషనర్ అలాంటి పథకాలన్నింటినీ సవాల్ చేయగలిగేవాడు' అని ఉత్తర్వులో పేర్కొన్నది. డిఎంకెను, దాని ప్రభుత్వ పథకాలను వేరు చేసిన పిటిషన్ దాఖలు చేయడంలో ఉద్దేశం ఏమిటి అని ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టులో తొందరపడి పిటిషన్ దాఖలు చేయడాన్ని కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. జులై 18న డిఎంకె గుర్తింపును సస్పెండ్ చేయడం లేదా ఉపసంహరించుకోవడంపై ఎఐఎడిఎంకె నాయకుడు భారత ఎన్నికల సంఘానికి చేసిన ప్రాతినిధ్యాన్ని కూడా ఇది ప్రస్తావించింది. 'మొదట, వివాదాస్పదంగా, తమిళనాడు రాష్ట్రంలో మోడల్ ప్రవర్తనా నియమావళి అమలులో లేదు. కాబట్టి ఎన్నికల కమిషన్ ముందు అలాంటి ప్రాతినిధ్యం చెల్లుబాటు అవుతుందా? లేదా? అనేది మొదటి ప్రశ్న'అని బెంచ్ పేర్కొంది. ఆ తర్వాత ఎన్నికల సంఘానికి ప్రాతినిధ్యాన్ని నిరయించే అవకాశాన్ని ఇవ్వకుండా పిటిషనర్ జులై 21నప్రాతినిధ్యాన్ని స్వీకరించిన మూడు రోజుల్లోనే హైకోర్టుకు తొందరపడి వెళ్లారని ధర్మాసనం గమనించింది.విచారణ సందర్భంగా, సంక్షేమ పథకాల కోసం ప్రస్తుత ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులు, గవర్నర్ల ఫోటోలను ఉపయోగించడానికి అనుమతించే తీర్పులను న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఆయన ఎఐఎడిఎంకె పాలనలో అనేక పథకాలకు అమ్మ పేరుతో ఫోటోలు, పేర్లను ఉపయోగించడాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. జులై 31న మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వం ఏ కొత్త లేదా రీబ్రాండెడ్ ప్రజా సంక్షేమ పథకాలకు జీవించి ఉన్న వ్యక్తుల పేర్లను పెట్టకుండా నిరోధించింది. అలాగే, అటువంటి పథకాలను ప్రోత్సహించే ప్రకటనలలో మాజీ ముఖ్యమంత్రి, సైద్ధాంతిక నాయకుల చిత్రాలను లేదా ఏదైనా డిఎంకె చిహ్నం లేదా ఎంబ్లమ్ లేదా జెండాను ఉపయోగించడాన్ని కూడా నిషేధించింది. షణ్ముగం దాఖలు చేసిన పిటిషన్ విచారించిన మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాత్సవ, జస్టిస్ సుందర్ మోహన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీచేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com